తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 12.08.2025 | సంపుటి : 12 సంచిక : 24 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






# త్వరలో పీఏసీ భేటీ

## 42 శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం

- త్వరలో బోర్డు, కార్పొరేషన్, డైరెక్టర్ల పోస్టుల నియామకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సమావేశం

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి): తాజా రాజకీయ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో పీసీసీ, పీఏసీ భేటీ ఉండే అవకాశం ఉంది. ఈ సమావేశంలో మెజారిటీ- నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం

మిగతా 2లో..

# పాతపద్ధతిలోనే 'పది' పరీక్షలు

## 20 శాతం ఇంటర్నల్ మార్కులు కేటాయింపు

### విద్యాశాఖ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్11(జనంసాక్షి): పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్కంఠకు విద్యాశాఖ తెరదించింది. పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు- వెల్లడించింది. ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వం జివో జారీ చేసింది. అయితే ఇటీ-వలే ఢిల్లీలోని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి నిర్వ హిం చిన వర్క్ షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తాయి. దీంతో వి ద్యాశాఖ అధికారులు పునరాలోచనలో

మిగతా 2లో..





బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారడంతో గాయపడ్డ టీఎంసీ ఎంపీని ఆస్పత్రికి తరలిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర పార్లమెంటు సభ్యులు

# ఉద్రిక్తతల మధ్య విపక్షాల ర్యాలీ

- బారికేడ్లు ఎక్కిన ఎంపీలు
- అడ్డుకుని బస్సుల్లో తరలించిన పోలీసులు
- స్పష్టమైన ఓటర్ల జాబితా ఇవ్వాలని ఈసీకి రాహుల్ గాంధీ డిమాండ్
- బిహార్ వ్యవహారం సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయమివ్వాలని ఈసీకి కాంగ్రెస్ లేఖ
- అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం..



న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.కర్ణాటకలో తమ పార్టీ

మిగతా 2లో..

## బనకచర్లపై బీఆర్ఎస్ ఎంపీల వాయిదా తీర్మానం

పార్లమెంట్‌లో అదే రభస

2లో..



# నిరసనల మధ్యే పలు బిల్లుల ఆమోదం

## కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- ఐటి, స్పోర్ట్స్ బిల్లులకూ సభ మద్దతు
- ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బైజయంత్ పాండా సారథ్యంలో 31 మంది సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు నవీకరించిన బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం

మిగతా 2లో..



# కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికే కీలకం

- మేడిగడ్డ ప్రాజెక్టు లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
- ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం స్పీకర్ పరిధిలో ఉంది: మంత్రి శ్రీధర్ బాబు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనుల ప్రారంభం

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):మేడిగడ్డ ప్రాజెక్ట్ లాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా ముందుకెళ్తామని తెలిపారు. మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్ర త్తగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కే సుపై సిట్ దర్యాప్తు చేస్తోందన్నారు. ఈ కేసులో ఎవరె వరిని విచారణకి పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణ యిస్తారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం లేదని స్పష్టత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌పై అధికారులే విచారణ చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారిగా ఒప్పందం చేసు కుందని విమర్శించారు. తమ మేనిఫెస్టో లోనే కాళే శ్వరం ప్రాజెక్ట్‌పై జ్యూడీషనల్ ఎంక్వైరీ వేస్తామని చెప్పా మని.. అన్నట్లుగానే వేశామని గుర్తుచేశారు. సోమవారం మంత్రి శ్రీధర్ బాబు కరీంనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు

మిగతా 2లో..

## ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిపై కేసు కొట్టివేత

- ఎన్నికల కేసును కొట్టివేసిన హైకోర్టు
- పిటీషనర్‌కు ధర్మాసనం అక్షింతలు



వార్త 2లో

# అమెరికా అండతో రెచ్చిపోతున్న పాక్

- ప్రాజెక్టులు పేల్చివేస్తాం
- అణుబాంబును ప్రయోగిస్తాం
- మాతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తాం
- పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ పిచ్చి ప్రేలాపనలు




వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. తమది అణ్వాయుధ దేశమని.. అవసరమైతే అణు యుద్ధానికి దిగుతామని బహిరంగంగా బెదిరింపులకు దిగారు. తాము నాశనమైతే.. తమతో పాటు సగం ప్రపంచాన్ని పతనం వైపునకు తీసుకెళ్తా మంటూ మునీర్ పిచ్చి ప్రేలాపనలు చేశారు .ఫ్లోరిడాలోని టాంపాలో ఓ కార్యక్రమంలో

మిగతా 2లో..

## పాక్ 'అణు' బెదిరింపులకు భారత్ భయపడదు

2లో

- ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోంది
- మునీర్ వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ శాఖ మండిపాటు



# సివిల్స్‌లో సత్తా చాటాలి

## తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలి

- అన్ని విధాలుగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధం
- ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం
- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):సివిల్స్ లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన ప్రజాభవన్లో సింగరేణి ఆధ్వర్యంలో మెయిన్స్ కు ఎంపికైన 178 మందికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ వనరులు అతి ముఖ్యమైనవి అవి బలమైన పెట్టుబడులని, ఆ మానవ వనరులను సానబట్టి వజ్రాలుగా తయారు చేస్తే సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతారని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆలోచన చేసి సివిల్స్ కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో కొంత సాయం చేస్తే వారు లక్ష్యం సాధించేందుకు ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమం

మిగతా 2లో..



# కేవలం పురుషులకే.. నిబంధన ఎందుకు పెట్టారు?

- ఆర్మీ జడ్జి అడ్వకేట్ నియామకాల్లో లింగవివక్ష
- తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్11(జనంసాక్షి):భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. కేవలం పురుషులకే వీటిని రిజర్వ్ చేయడాన్ని సుప్రీం తప్పు పట్టింది. ప్రస్తుత విధానాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై

మిగతా 2లో..

# కాళేశ్వరం నివేదికపై ఏం చేద్దాం?

## కేటీఆర్, హరీశ్‌లతో కేసీఆర్ మంతనాలు

### ఫామ్‌హౌజ్‌లో తదితర అంశాలపై చర్చ



గజ్వేల్,ఆగస్ట్11(జనంసాక్షి): కాళేశ్వరం నివేదక తరవాత మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వరుసగా పార్టీ ముఖ్యులతో భేటీ అవుతున్నారు. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన ముఖ్య అనుచరులతో వరుసగా సమావే శాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పార్టీ ము ఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం కమిషన్ రిపో ర్టుకు సంబంధించి సుప్రీంకోర్టుకు వెళ్లే విషయంపై వారు కూలంకుషంగా చర్చించారు. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని వారంతా నిర్ణయించారు. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పా ర్టీ కీలక నేతలకు

మిగతా 2లో..

# తెచ్చిన అప్పులు ఏం చేస్తున్నారు?

- బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు 8 లక్షల కోట్లు కాదు.రూ.3.5 లక్షల కోట్లే..
- పార్లమెంట్‌లో కేంద్రంమే స్పష్టం చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్(జనంసాక్షి): కేసీఆర్ ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పు చేసిందని పిచ్చోడిలా గాయి గాయి చేసిన రేవంత్ రెడ్డి చెంప ఛెల్లుమనేలా కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు. కాంగ్రెస్, బీజేపీలు ఆరోపిస్తున్నట్టుగా తమ హయాంలో రాష్ట్ర అప్పు 8 లక్షల కోట్ల కాదని, కేవలం 3.5 లక్షల కోట్లు మాత్రమే అన్న నిజాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో రేవంత్ రెడ్డి అండ్ గ్యాంగ్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్దాలన్న సంగతి

మిగతా 2లో..

# ముఖ్యమైన అంశాలపై వివరంగా చర్చించాం

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ ఫోన్



న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన తాజా పరిణామాల గురించి జెలెన్ స్కీ ప్రధాని మోదీకి వివరించారు. ఈ విషయాన్ని ఇరు నేతలూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ తర్వలో భేటీ కానున్నారు. ఆ భేటీకి జెలెన్‌స్కీని కూడా పిలిచే యోచనలో ఉన్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలో ఈ టెలిఫోన్ సంభాషణ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉక్రెయిన్‌కు సంబంధించి ఇటీవల జరిగిన పరిణామాలపై జెలెన్‌స్కీతో మాట్లాడనని ప్రధాని మోదీ తెలిపారు. జెలెన్‌స్కీ తన అభిప్రాయాలు నాతో పంచుకున్నారు. ఈ వివాదాన్ని వీలైనంత త్వరగా, శాంతియుతంగా పరిష్కరించడంపై భారత్ స్థిరమైన వైఖరి గురించి తెలియజేశాను. యుద్ధం ముగింపు విషయంలో సాధ్యమైన ప్రతి సహకారాన్ని అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. అలాగే ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి

మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
12.08.2025

## త్వరలో పీఏసీ భేటి

తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు– సమాచారం.

## పాతపద్ధతిలోనే 'పది' పరీక్షలు

పడ్డారు.దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూశారు. దీంతో పాత విధానాన్నే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాత విధానం ప్రకారమే 20 శాతం ఇంటర్నల్ మార్కులు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదో తరగతి పరీక్షల్లో 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులు, 20 శాతం ఇంటర్నల్ మార్కులు కేటాయించనున్నట్లు– విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
**ఫారం -6**
(చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్-1 రూల్ 19 ప్రకారం)
ప్రాథమిక నోటిఫికేషన్

జ1/3359/2025 తేది: 30/07/2025
నెం.సి/39/2024 తేది: .07.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్గొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, శేరిగూడెం మజీర ఎల్లారెడ్డిగూడెం గ్రామం, నార్కెట్‌పల్లి మండలం నందు భూమి విస్తీర్ణం ఎ.5.05 1/2 గుంటల పట్టా భూమి ప్రజా ప్రయోజనార్థం ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో భాగంగా ఎడమ ప్రధాన కాలువ యొక్క డి-1 యందు 10ఎల్ మైనర్ కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.700 వరకు మరియు కి.మీ. 0.800 నుండి కి.మీ. 1.700 వరకు మరియు 8 ఎల్ మైనర్ కి.మీ. 1.680 నుండి 1.850 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.ఎస్.నెం. 54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్/2) (క్యాడ్ & డిపార్టుమెంటు) తేది 25.07.2017 నాడు జారీ చేసినారు. అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము II & III ఈ ప్రాజెక్టు నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద నల్లగొండ జిల్లా, శేరిగూడెం మజీర ఎల్లారెడ్డిగూడెం గ్రామం, నార్కెట్‌పల్లి మండలం విస్తీర్ణం ఎ.5.05 1/2 గుంటల పట్టా ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: శేరిగూడెం మజీర ఎల్లారెడ్డిగూడెం మండలం: నార్కెట్‌పల్లి
జిల్లా: నల్లగొండ

| క్రమ సంఖ్య | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/తరి/పట్టా ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశముపై ఉన్న చెట్లు/నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| డి-1 యందు 10ఎల్ మైనర్ కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.700 వరకు మరియు కి.మీ. 0.800 నుండి కి.మీ. 1.700 వరకు | | | | |
| 1 | 557 ఖుష్కి / పట్టా 0.04 1/2 | 0.04 1/2 | జోగు ఎట్టయ్య తండ్రి క్రిష్టయ్య | -- |
| 2 | 558 ఖుష్కి / పట్టా 0.04 1/2 | 0.04 1/2 | ఎమిరెడ్డి గణేష్ రెడ్డి తండ్రి కొండల్‌రెడ్డి | -- |
| 3 | 559 ఖుష్కి / పట్టా 0.04 1/2 | 0.03 | అలుగుబెల్లి అంజిరెడ్డి తండ్రి రాంరెడ్డి | -- |
| 4 | | 0.08 1/2 | ఎమిరెడ్డి గణేష్ రెడ్డి తండ్రి కొండలరెడ్డి | -- |
| 5 | 563 ఖుష్కి / పట్టా 0.33 | 0.23 | ఎమిరెడ్డి గణేష్‌రెడ్డి తండ్రి కొండలరెడ్డి | -- |
| 6 | | 0.02 | వెల్దండ వెంకట్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి | -- |
| 7 | | 0.08 | వెల్దండ శంకర్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | -- |
| 8 | 564 ఖుష్కి / పట్టా 1.02 | 0.18 | నంద్యాల పురుషోత్తం రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | 2-తాటి చెట్లు |
| 9 | | 0.03 | నంద్యాల శంకర్‌రెడ్డి తండ్రి పాపిరెడ్డి | 2-తాటి చెట్లు |
| 10 | | | నంద్యాల మధుసూదన్ రెడ్డి పాపిరెడ్డి | -- |
| 11 | | 0.05 | నంద్యాల వనజాత భర్త లక్ష్మారెడ్డి | 2-తాటి చెట్లు |
| 12 | | 0.04 | నంద్యాల అనిత భర్త అంజిరెడ్డి | -- |
| 13 | | 0.12 | నంద్యాల నర్సిరెడ్డి తండ్రి లింగారెడ్డి | -- |
| 14 | 565 ఖుష్కి / పట్టా 0.23 | 0.03 | నంద్యాల సుగుణమ్మ భర్త నర్సిరెడ్డి | 2-తాటి చెట్లు |
| 15 | | 0.03 | పందిరి భద్రమ్మ భర్త మల్లారెడ్డి | 2-తాటి చెట్లు |
| 16 | | 0.01 | నంద్యాల సుగుణమ్మ భర్త నర్సిరెడ్డి | 2-తాటి చెట్లు |
| 17 | | 0.08 | పులిపెల్లి అంజిరెడ్డి తండ్రి అనితరెడ్డి | 2-తాటి చెట్లు |
| 18 | | 0.08 | పులిపెల్లి లింగారెడ్డి తండ్రి నారాయణరెడ్డి | 2-తాటి చెట్లు |
| 19 | 567 ఖుష్కి / పట్టా 0.13 1/2 | 0.13 1/2 | బత్తుల అనంత రెడ్డి తండ్రి రాంరెడ్డి | -- |
| 20 | 638 ఖుష్కి / పట్టా 0.12 1/2 | 0.12 1/2 | బిట్ల నిర్మల భర్త సంజీవరెడ్డి | -- |
| 21 | 637 ఖుష్కి / పట్టా 0.12 | 0.09 1/2 | బిట్ల నిర్మల భర్త సంజీవరెడ్డి | -- |
| 22 | | 0.02 1/2 | మేరెడ్డి యాదగిరిరెడ్డి తండ్రి వీర రెడ్డి | -- |
| 23 | 540 ఖుష్కి / పట్టా 0.18 | 0.09 | అలుగుబెల్లి కృష్ణారెడ్డి తండ్రి రాంరెడ్డి | -- |
| 24 | | | అలుగుబెల్లి రాఘవరెడ్డి తండ్రి రాంరెడ్డి | -- |
| 25 | | 0.09 | అలుగుబెల్లి శంకర్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి | 1 బోర్, పైప్‌లైన్ |
| 26 | 529 ఖుష్కి / పట్టా 0.05 | 0.05 | నంద్యాల సుగుణమ్మ భర్త నర్సిరెడ్డి | -- |
| | మొత్తం | 4.19 1/2 | | |
| 8 ఎల్ మైనర్ కి.మీ. 1.680 నుండి 1.850 వరకు | | | | |
| 27 | 614 ఖుష్కి / పట్టా 0.26 | 0.12 | పులిపెల్లి దామోదర్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి | -- |
| 28 | | 0.05 | పులిపెల్లి రాఘవరెడ్డి తండ్రి లింగారెడ్డి | -- |
| 29 | | 0.09 | పులిపెలి శంకర్ రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | -- |
| | మొత్తం | 0.26 | | |
| | స్థూల మొత్తం | 5.05 1/2 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ, భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టం నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్&ఎల్ఎ., విభాగం-2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్ నెం.6, జి.వి.గూడెం, నల్లగొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పని దినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్ఎ., విభాగం-2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విష యంలో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధిత భూ యజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్గొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్ఎ., విభాగం-2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఏ. విభాగం-2, నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO.No.461/LA/PP/Advt/Pub/2025-26


# ఉద్రిక్తతల మధ్య విపక్షాల ర్యాలీ

అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలాయన్నారు. ఈ నిజం దేశం ముందున్నా .. ఎన్నికల సంఘం మాత్రం దీనిపై మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతంగా మారింది. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. బిహార్‌లో ఓట్ల జాబితా సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఈ ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయల్దేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 'ఓట్ల చోరీ'



జరిగిందంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ సహా దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు పాల్గొన్నారు. అయితే.. ఈ ర్యాలీకి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంసద్ మార్గ్‌లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ రహదారిని బ్లాక్ చేసి బారికేడ్లు పెట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అఖిలేశ్ యాదవ్ సహా కొంతమంది ఎంపీలు బారికేడ్లు దూకేందుకు యత్నించారు. వాటిపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని నిలువరించారు. విపక్ష ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. మరోవైపు, బిహార్ సమగ్ర సవరణ సర్వే సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈసీకి లేఖ రాశారు. ఇందుకు అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం.. విపక్షాలతో భేటీకి అంగీకరించింది. అయితే, 30 మంది విపక్ష ఎంపీలు మాత్రమే సమావేశానికి రావాలని చెబుతూ సోమవారం మధ్యాహ్నానికి అపాయింట్‌మెంట్ ఇచ్చింది.

## సీఎం రేవంత్ రెడ్డిపై కేసు కొట్టివేత

**హైదరాబాద్,ఆగస్టు11(జనంసాక్షి):** సిఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ–కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పుర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పిటిషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజుపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు క్షమాపణలు చెప్పాలని తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## తెచ్చిన అప్పులు ఏం చేస్తున్నారు?

పార్లమెంట్ లో ఇవాళ నిరూపించబడిందన్నారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులంటూ నిరాధార ప్రచారానికి దిగిన రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని కేటీఆర్ ప్రశ్నించారు. తాము అధికారం నుంచి దిగిపోయిన తరువాత అంటే 2024 మార్చి 31 నాటికి తెలంగాణ ప్రభుత్వ అప్పు రూ. 3,50,520.39 కోట్లు మాత్రమే అన్న కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అనవసరంగా అప్పులు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలకే కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆస్తుల సృష్టి కోసమే తెచ్చిన అప్పులను ఉపయోగించిందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆ నిధులను ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ, సమర్థతతోనే రాష్ట్రం వేగంగా పురోగమించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలివిగా ఆర్థిక నిర్వహణ చేసిన సంగతి కేంద్రం ఇచ్చిన నివేదిక తో తెలుస్తుందన్నారు కేటీఆర్. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అప్పులు రూ. 3,50,520.39 కోట్లు అయితే, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల విలువ రూ. 4,15,099.69 కోట్లుగా ఉందన్నారు. అంటే, అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 64,579 కోట్లు ఎక్కువగా ఉందని తెలిపారు. గత ఆరు ఆర్థిక సంవత్సరాలుగా (2018-19 నుండి 2023-24 వరకు) ప్రతి ఏటా తెలంగాణ అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 50 వేల కోట్లకు పైగా పెరిగిందన్న కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వ సమర్థతకు ఈ గణాంకాలే నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేస్తుందని ఆరోపించిన రేవంత్ రెడ్డి, తాను ముఖ్యమంత్రి అయిన మరు క్షణం నుంచే విపరీతంగా అప్పులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. నిజాలు తెలుసుకుని, నిరాధారమైన ఆరోపణలు మానుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పారదర్శకత లేని ఆర్థిక విధానాలను అవలంబిస్తూ, అప్పులను ప్రజల మీద మోపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా తమ పరిపాలన గురించి సమీక్షించుకోవాలన్నారు.

**ఆదాయం తగ్గడంపై కెటిఆర్ విమర్శలు**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగ్ క్వార్టర్లీ రిపోర్టుపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోంది. ఆరు గ్యారెంటీ-ల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ. 2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్‌లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ. 10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. మూడు నెలల్లోనే రూ. 20,266 కోట్లు– అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడుతారో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా..? అని కేటీఆర్ నిలదీశారు.

## కాళేశ్వరం నివేదికపై ఎం చేద్దాం?

అధినేత కేసీఆర్ స్పష్టమైన సూచన ఇచ్చినట్లు– సమాచారం. రూ. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 15 నెలల పాటు– విచారించిన ఈ కమిషన్.. ఇటీ-వల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అంతా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలకమని స్పష్టం చేసినట్లు– కథనాలు వెల్లువెత్తాయి. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు– చేసింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం.. ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కేటీఆర్‌తోపాటు– పలువురు నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కోర్టు తీర్పుపై సంతృప్తి చెందని ఆ పార్టీ నేతలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారని సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు– ఒక ప్రచారం అయితే ఉధృతంగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఖండించింది.

## మరో 476 పార్టీలపై ఈసీ కొరడా

దిల్లీ: చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘించే రాజకీయ పార్టీలపై ఈసీ కఠిన చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా మరో 476 పార్టీలను రద్దు చేసే దిశగా చర్యలను మొదలు పెట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇటీవల 334 పార్టీలను రద్దు చేసిన ఈసీ.. తాజాగా రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించి.. వాటిపై వేటు వేసే ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా డీలిస్ట్ చేసేందుకు గుర్తించిన పార్టీల జాబితాలో ఏపీ నుంచి 17 పార్టీలు ఉండగా.. తెలంగాణ నుంచి 9 పార్టీలు ఉన్నట్లు ఈసీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా జాబితాను విడుదల చేసింది. ఎన్నికల వ్యవస్థను క్లీన్ చేసేందుకు చేపట్టిన సమగ్రమైన వ్యూహాల్లో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఈసీ పేర్కొంది. 2019 నుంచి ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనైనా పోటీ చేయాలనే ముఖ్యమైన షరతును నెరవేర్చడంలో విఫలమైన రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల(%=ఖ్రాం%)ను గుర్తించేందుకు, జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఇందులో భాగంగానే తొలి రౌండ్‌లో ఆగస్టు 9న 334 పార్టీలను జాబితా నుంచి తొలగించగా.. రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించినట్లు వెల్లడించింది. తాము డీలిస్ట్ చేసిన పార్టీలేవీ.. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29సీ, 29బీ ఆదాయపన్ను చట్టం-1961, ఎన్నికల గుర్తులు (రిజర్వేషన్ అండ్ ఎలాట్‌మెంట్) ఆర్డర్ 1968 కింద ఉన్న ప్రయోజనాలను పొందలేవని ఇటీవల ఈసీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## కేవలం పురుషులకే.. నిబంధన ఎందుకు పెట్టారు?

పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ అంశంపై తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం.. ఆర్మీ ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ విభాగంలో పురుషులకు 6.. మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం. లింగ తటస్థతకు నిజమైన అర్థం.. స్త్రీ, పురుష భేదం లేకుండా అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే. అంతేగానీ, ఇలా మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. మహిళలపై పరిమితి పెట్టి.. ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదని సుప్రీంకోర్టు వెల్లడించింది.

## అమెరికా అండతో రెచ్చిపోతున్న పాక్

పా ల్గొన్న మునీర్.. అక్కడి పాక్ పౌరులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. "సింధూ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు మేం ఎదురుచూస్తాం. మా వద్ద క్షిపణులకు లోటు లేదు. వారు కట్టే ఆనకట్టలను 10 క్షిపణులతో పేల్చేస్తాం. మాది అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశం. ఒకవేళ భవిష్యత్తులో న్యూదిల్లీ నుంచి మా అస్థిత్వానికి ముప్పు ఎదురైతే.. మాతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తాం" అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు..

## పాక్ 'అణు' బెదిరింపులకు భారత్ భయపడదు

**ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోంది**

**మునీర్ వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ శాఖ మండిపాటు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది."అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో (మునీర్ మాటలను ఉద్దేశిస్తూ) ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అక్కడ సైన్యం, ఉగ్ర ముఠాలతో చేతులు కలిపింది. అమెరికా గడ్డపై మునీర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. అయితే, ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదు. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం" అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు కూడా దీనిపై స్పందించాయి. "పాక్ మిలిటరీకి అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా.. వారు తమ నిజస్వరూపాన్ని బయటపెడుతూనే ఉంటారు. అక్కడ (దాయాదిని ఉద్దేశిస్తూ) ప్రజాస్వామ్యం లేదని దీన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆ దేశాన్ని సైన్యమే నియంత్రిస్తోంది. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు ప్రపంచం మొత్తానికి ముప్పు ఎదురైనట్లే" అని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లోరిడాలో ఓ కార్యక్రమంలో మాట్లాడిన మునీర్.. భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు.

# సివిల్స్‌లో సత్తా చాటాలి

చేపట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సివిల్స్ సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అభ్యర్థులకు మనోధైర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం కార్యక్రమంలో చేపట్టిందినీ డిప్యూటీ సీఎం తెలిపారు. మెయిన్స్ కు ఎంపికైన 178 మందికి లక్ష రూపాయల చొప్పున అందిస్తున్నాము. ఇంటర్వ్యూ కి ఎంపికైన వారికి కూడా లక్ష ఆర్థిక సాయం ఢిల్లీలో వసతులు కల్పిస్తాం అని భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక సహాయం అందించగా పదిమంది సివిల్ సర్వీస్ కి ఎంపికయ్యారని వివరించారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం, ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి సివిల్ సర్వీసెస్ ద్వారా అవకాశముంటుంది. వేలాదిమంది రాష్ట్రంలో పనిచేసిన ఎస్సార్ శంకరన్, పార్థసారధి, మాధవరావు వంటి కొద్ది మంది పేర్లు మాత్రమే జనం గుండెల్లో నిలిచిపోయారు అని అన్నారు. నిబద్ధత సేవలందిస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరవేస్తేనే ప్రభుత్వాలు ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి అన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తే ప్రభుత్వ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా ఫలితం ఉండదు అన్నారు. %ూతీ% శంకరన్ సాంఘిక సంక్షేమ శాఖలో సెక్రటరీగా ఉన్నప్పుడు చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి ఉపయోగపడ్డాయి అన్నారు. 45 వేలకు పైబడి ఉన్న సింగరేణి కార్మికులు సింగరేణి సంస్థను బతికిస్తూ పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు మీ ప్రయత్నంలో విజయం సాధించే క్రమంలో సింగరేణి కార్మికుల ఆశీస్సులు మీకు ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు.

## నిరసనల మధ్యే బిల్లుల ఆమోదం

ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టిన 3 నిమిషాలకే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. సెలక్ట్ కమిటీ సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు మంత్రి వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లు తదుపరి రాజ్యసభకు వెళ్లనుంది. మరో రెండు క్రీడావిధానాల సంస్కరణల పరిధిలోకి వచ్చేవి. పన్నుల విధింపు సంబంధిత ఇన్‌కం టాక్స్ (నెంబరు 2) ,పన్నుల విధింపునకు సంబంధించిన టాక్సేషన్ లాస్ (సవరణ) బిల్లు ఇప్పుడు సభామోదం దక్కించుకున్నాయి. సోమవారం ఉదయం సభ ఆరంభం కాగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. దేశంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను బిల్లు 1961 నాటి ఆదాయ పన్ను చట్టం నిబంధనలకు అనుగుణంగా ఉంది. ఈ చట్టాన్ని సవరించి , సరైన విధంగా పటిష్టం చేసేందుకు ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లు తీసుకువచ్చారు. ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే పాత చట్టం స్థానంలో కొత్త చట్టం అమలులోకి వస్తుంది.

**బనకచర్లపై భారత రాష్ట్ర సమితి ఎంపీల వాయిదా తీర్మానం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):బనకచర్లపై భారత రాష్ట్ర సమితి ఎంపీలు మరోసారి రాజ్యసభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. ఏపీలో నిర్మించే ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని అందులో పేర్కొన్నారు. దీనివల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వెల్లడించారు. రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి సభ్యుడు సురేశ్‌రెడ్డి తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇప్పటికే ఓసారి సభలో బనకచర్లపై వాయిదా తీర్మానం ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రతిపక్షాల ఆందోళలతో పార్లమెంట్ దద్దరిల్లింది. సోమవారం ఉదయం ఉభయ సభలు ప్రారంభం కాగానే బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆందోళనకు దిగాయి.

## కాళేశ్వరంపై ఎన్డీఎస్‌ఏ నివేదికే కీలకం

మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద తమ నిరసన ధర్నాకు బీజేపీ ఎంపీలు ఎందుకు మద్దతు పలకలేదని ప్రశ్నించారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడితే జనం నమ్ముతారా అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఎవరినీ పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని వెల్లడించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తుది నిర్ణయం స్పీకర్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు బీసీ బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్షకు బీజేపీ ఎందుకు మద్దతు తెలపలేదు..? ఆ పార్టీ ఎంపీలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. అలాంటిది ఈరోజు బీసీల గురించి ప్రతిపక్షాలు మాట్లాడితే నమ్ముతారా అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతోనే ముందుకు పోతామని స్పష్టం చేశారు.

పకడ్బందీ ప్రణాళికతో కరీంనగర్ అభివృద్ధి..

పకడ్బందీ ప్రణాళికతో కరీంనగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఒక మాడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన సుడా వాణిజ్య భవన సముదాయ నిర్మాణం, ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఆధునీకరణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ హాజరయ్యారు. దాదాపు 4.79 కోట్లతో



మౌలిక వసతుల కల్పన ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. నాలుగు కోట్లతో సుడా వాణిజ్య భవన నిర్మాణాన్ని చేపడుతు న్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు కోట్లు మంజూరు అయ్యాయనీ, వాటితో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ పనులు 79 లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు నాణ్యతతో చేపట్టేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని సూచించారు. పనులు వేగవంతంగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో మిగిలిపోయిన పనులకు ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామనీ, ఆ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. అదేవిధంగా కరీంనగర్ కు తలమానికంగా నిలిచే మానేర్ రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ శాతవాహన యునివర్సిటీ లో తాము ఏర్పాటు చేసిన గ్రూపులతోనే యూనివర్సిటీ రన్ అయిందనీ, తమ ప్రభుత్వం వచ్చాక శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, మృత్యుంజయం, జిల్లాఅధికారులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా పరీవాహకంలో భారీ వర్షాలు

- జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు



హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లోలో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థం 215.80 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాలకు భారీగా వరద నీరు చేరుకుంది. వరద చేరుకోవడంతో పలు ప్రాజెక్టుల గేట్లు తెరిచారు. నాగార్జునసాగర్, హిమాయత్ సాగర్, శ్రీరాంసాగర్, మూసీ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం జలాశయాల్లో భారీగా వరద ప్రవహిస్తోంది. ఈ జలాశయాల దగ్గర ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా ఉంది. హిమాయత్ సాగర్‌కు వరద నీరు మళ్లీ పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు హిమాయత్ సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. వరద నీరు పెరగడంతో రెండో గేట్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తారు. ఇప్పటి వరకు ఒక్క గేటు మాత్రమే అధికారులు తెరిచి నీటిని విడుదల చేశారు. హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తుండటంతో ప్రమాదకరస్థాయిలో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరుకుంది. హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారాహిల్స్, బుల్కాపూర్, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌లోకి వరద వస్తోంది. తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని అధికారులు మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీవహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. తిరిగి క్ష సర్వీస్ రోడ్డును అధికారులు మూసివేశారు. వరద ప్రవాహంతో రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ వైపు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మూసీ పరివాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# తెలంగాణలో ఓటు చోరీపై జవాబివ్వాలి

- రాహుల్‌కు కెటిఆర్ డిమాండ్



హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ప్రభుత్వంపై మరోసారి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫైరయ్యారు. తెలంగాణలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఓటు- చోరీ చేశారన్నారు. ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో 'ఓటర్ చోరీ' జరిగిందంటూ నిరసన వ్యక్తం చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు పార్లమెంట్ నుండి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఈ మార్చ్‌లో 25 ప్రతిపక్ష పార్టీల నుండి 300 మందికి పైగా ఎంపీలు పాల్గొన్నారు. ఈ ర్యాలీపై కెటిఆర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలపై రాహుల్ గాంధీని కెటిఆర్ నిలదీశారు. తెలంగాణలో రాహుల్ గాంధీ చేసింది కూడా ఓటు చోరీ కాదా? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 420 హామీలు 100 రోజుల్లోపు అమలు చేస్తామని చెప్పి గెలిచి.. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ఉండటం ఓటు- చోరీ కిందకి రాదా అని మండిపడ్డారు. బిజెపికి వ్యతిరేకంగా ఓటు- చోరీపై పోరాడుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో మీరు చేసేది ఎంటి అని నిలదీశారు.

# పెద్ద నిర్మాతలతో పోలిస్తే మాకు కష్టాలు ఎక్కువే

- మీడియా సమావేశంలో చిన్న నిర్మాత ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు11 (జనంసాక్షి) : పెద్ద నిర్మాతలతో పోలిస్తే చిన్న నిర్మాతల కష్టాలు వేరని ప్రొడ్యూసర్ ఎస్కేఎన్ పేర్కొన్నారు. ఓ ప్రాతిపదికన కాకుండా అందరికీ వేతనం పెంచడంపై అభిప్రాయం వ్యక్తం చేశారు. సినీ కార్మికులకు 30 శాతం వేతనం పెంపు డిమాండ్‌పై టాలీవుడ్‌లో కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలువురు చిన్న నిర్మాతలు మీడియా సమావేశంలో పాల్గొని, తమ కష్టాలు వివరించారు. వంశీ నందిపాటి, బెన్నీ, అనురాగ్, చైతన్య, రాజేశ్ దండా, మధుర శ్రీధర్, శరత్ చంద్ర, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు ఎస్కేఎన్ మాట్లాడుతూ.. సినీ కార్మికులు 30 శాతం వేతనం పెంపు కోరుతున్నారు. మరి, థియేటర్లకు ప్రేక్షకులను ఎవరు రప్పిస్తారు? మా సినిమా బడ్జెట్లకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? అలా చేస్తే 30 శాతం, 40 శాతం కాదు 50 శాతం పెంచుతాం. ఆర్థికంగా నిర్మాతలకు చాలా సమస్యలుంటాయి. 2022లో.. ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఒప్పందం మేరకు.. 25 శాతం తగ్గించి ఇవ్వమని చిన్న నిర్మాతలకు ఫెడరేషన్ చెప్పింది. కానీ, ఆ రూల్‌ను యూనియన్లు పాటించట్లేదు. ప్రస్తుతం సినీ వ్యాపారం బాగోలేదు. ఓ ప్రాతిపదికన కాకుండా అందరికీ వేతనం పెంచి ఇవ్వాలంటే కష్టం. మేం పాన్ ఇండియా స్థాయి సినిమాలు నిర్మించడం లేదు. టికెట్ ధరల పెంపులాంటివి చిన్న నిర్మాతలకు వర్తించవు. మా కష్టాలు వేరని ఆవేదన వ్యక్తం చేశారు.



# గర్భిణిని మోసుకెళ్లిన భర్త

## మార్గమధ్యంలోనే ప్రసవం

సంగారెడ్డి, ఆగస్టు11 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం మున్యా నాయక్ తండాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తండాకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో గర్భిణి ఆసుపత్రికి నడుచుకుంటూ వెళుతూ.. మార్గమధ్యలో ప్రసవించింది. మున్యా తండాకు చెందిన కౌశిబాయి అనే మహిళ పురిటి నొప్పులతో ఇబ్బంది పడింది. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తండా వరకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలోనే అంబులెన్స్‌ను నిలిపేశారు. ఆ పరిస్థితుల్లో ఆశా వర్కర్, కుటుంబ సభ్యుల సహాయంతో కౌశిబాయి భర్త ఆమెను తన భుజంపై మోస్తూ అంబులెన్స్ వరకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

# నాకు మంత్రి పదవి రాకుండా అడ్డుకున్నారు

## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు11 (జనంసాక్షి) : తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, ఇది వాస్తవమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అయితే ఆ హామీని అధిష్ఠానం అమలు చేయలేదని వాపోయారు. ఈ విషయంలో తనను రాష్ట్రంలోని ముఖ్య నేతలే అడ్డుకుంటూ అవమానిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇందులో వాస్తవాన్ని ప్రజలకు వివరించిన భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, ప్రభుత్వం అవినీతిరహిత పాలనను అందించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నానన్నారు. తెలంగాణ సమాజం ఆకాంక్షలు నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆకాంక్షించారు.

# పాతబస్తీలో కూలిన పురాతన ఇల్లు

హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) : నగరంలో కురుస్తున్న వర్షాల కారణంగా పాతబస్తీలోని హుస్సేనీ ఆలం వద్ద వందేళ్లకు పైబడిన పురాతన ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సీసీటీవీ కెమెరాలో ఇల్లు కూలిపోయిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఆ ప్రాంతంలో వందేళ్లకు పైబడి శిథిలావస్థకు చేరిన పురాతన ఇళ్లు మరికొన్ని ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో అవి కూడా కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని వారు భయాందోళన వ్యక్తం చేశారు. వాటిని కూల్చివేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# హైడ్రాలో ఎవరి జీతాలూ తగ్గవు

- గతంలో ఉన్న జీతాలే చెల్లిస్తాం
- సిబ్బంది అపోహలను నివృత్తి చేసిన హైడ్రా కమిషనర్
- కమీషనర్ హామీతో సంతోషం వ్యక్తం చేసిన మార్షల్స్



హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) : హైడ్రాలో పని చేస్తున్న సిబ్బంది జీతాలు ఎవరివీ తగ్గవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. సోమవారం వారితో మాట్లాడి.. అనుమానాలను నివృత్తి చేశామని.. ఎట్టి పరిస్థితుల్లోనూజీతాలు తగ్గవని.. గతంలో ఉన్న జీతాలే వారికి చెల్లించడం జరుగుతోందని స్పష్టం చేశారు. హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్ ఆందోళన చెస్తున్నారని.. విధులకు గైర్హాజర్ అయ్యారు. హైడ్రా కార్యక్రమాలు ఆగిపోయాయని ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో కమిషనర్ వివరణ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని రాత్రీ పగలూ పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనలో ఉందని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను రెగ్యులరైజ్ చేస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో... హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్ కొంతమంది అనవసరమైన ఆందోళన చెందారని అన్నారు. సమాచార లోపంతో ఈ జీవో ప్రకారం జీతాలు తగ్గుతాయేమో అని కొంతమంది ఆందోళన చెందారని.. ఎక్కడా ఎలాంటి సేవలకు ఆటంకాలు ఏర్పడలేదని స్పష్టం చేశారు. హైడ్రా అంటే ప్రజల్లో ఎంతో విశ్వాసం, గుర్తింపు ఉందని.. అందుకనుగుణంగా అందరూ కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు. సైన్యంలో పని చేసి వచ్చిన వారంతా మార్షల్స్‌గా ఉన్నారని వారి సేవలపట్ల హైడ్రా పూర్తి విశ్వాసంతో ఉందని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. మిగతా రాష్ట్రాల్లో వారికి ఇక్కడికంటే ఎక్కువ జీతాలు చెల్లిస్తున్నట్టయితే.. ఆ విధానాలను కూడా అధ్యయనం చేస్తామన్నారు.

# రైళ్లలో గొలుసు దొంగతనాలు

## దొంగను అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం

హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) : మద్యం బెట్టింగ్‌లకు అలవాటు పడి గొలుసు దొంగతానలు చేస్తున్న దొంగను పట్టుకున్నారు. అతడి నుంచి చోరీ సొత్తు చాటుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న లవరాజు అనే వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.7,70,000 విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్ మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా శంఖవరం మండలం జగ్గంపేటకు చెందిన కోరుప్రోలు లవరాజు (23) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పరిధి సూరారంలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు- సంస్థలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస అయ్యాడు. వీటన్నింటికీ తనకు వచ్చే జీతం సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటు- పడ్డాడు. రద్దీగా ఉన్న రైళ్లను ఎంపిక చేసుకుని మహిళల మెడలో బంగారు గొలుసులు దొంగిలించడం మొదలుపెట్టాడు. తద్వారా వచ్చిన డబ్బును బెట్టింగ్‌లో పెట్టాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న సింహపురి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2న గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో బంగారు గొలుసులు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదులతో రైల్వే ఎస్పీ చందనాదీప్తి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై సుబ్బారెడ్డి, ఆర్పీఎఫ్‌తో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు- చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు- తెలిపారు.

# పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): 19 సంవత్సరాల లోపు వయసున్న పిల్లల్లో నులి పురుగుల నివారణకు తప్పనిసరి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జంగేడు కెజిబివి పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అంగన్ వాడి కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం తదితర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని పిల్లలందరికి కేంద్రాలలో మాత్రలు తప్పకుండా ఇప్పించాలన్నారు. జిల్లాలో 19 సంవత్సరాల లోపు 69,652 మంది పిల్లలు ఉన్నారని, వారికి మాత్రలు వేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎలాంటి అపోహలు పడొద్దని తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు మాత్రలు వేయాలనీ, 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాల వారికి సగం మాత్ర , రెండు సంవత్సరాలు ఆ పైబడిన వారికి పూర్తి మాత్ర నమిలి మింగించాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు, ఆర్బీఎస్కె బృందాలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇంఛార్జి వైద్యాధికారి డా శ్రీదేవి, ప్రోగ్రాం అధికారి డా ప్రమోద్ కుమార్, వైద్యులు డా ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు ఎస్బీఐ విరాళం




హైదరాబాద్ (జనంసాక్షి) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి ఆగస్టు 10, 2025న ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు గణనీయమైన మద్దతును అందించారు. గ్రామీణ సాధికారతను బలోపేతం చేయడానికి ఎస్బీఐ కంప్యూటర్, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్ర ప్రయోగశాలల ఏర్పాటుతో సహా 50 లక్షల విలువైన విద్యా మౌలిక సదుపాయాలను విరాళంగా ఇచ్చింది. ఈ కార్యక్రమంలో శ్రీ సెట్టి మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు నికర లాభంలో 1 శాతం సామాజిక బాధ్యతకు కేటాయించాలని ఆదేశాల మేరకు ఎస్బీఐ మొదటిస్థానంలో ఉందన్నారు. ఫౌండేషన్ కింద, యూత్ ఫర్ ఇండియా ఫెలోషిప్ వంటి ప్రభావవంతమైన కార్యక్రమాలు - ఇప్పుడు దాని 11వ సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వ్యవస్థాపకులుగా సేవలందిస్తున్న 80 నుండి 100 మంది యువకులను ఎంపిక చేస్తాయి. గ్రామ సేవా కార్యక్రమం సమగ్ర గ్రామ అభివృద్ధిని ప్రోత్సహిస్తోందని, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ నైపుణ్యం-నిర్మాణం, మద్దతు ద్వారా ఉద్యోగ, నిరుద్యోగ వ్యక్తులకు సాధికారత కల్పిస్తోందని తెలిపారు. విలువ ఆధారిత విద్యకు కేంద్రమైన వికారాబాద్‌లోని గింగుర్తిలో ఉన్న సాందీపని గురుకుల్‌కు సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి, ఆచరణాత్మక అభ్యాసం, శాస్త్రీయ అన్వేషణను మెరుగుపరచడానికి అల్-ఎనేబుల్డ్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి మద్దతు లభించిందని తెలిపారు. ఎస్బీఐ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి సూర్య, మెదక్ మరియు వికారాబాద్ జిల్లాల నుండి స్వయం సహాయక బృందాలకు అవసరమైన కిరాణా సామాగ్రి, కుట్టు యంత్రాలు, గృహోపకరణాలను విరాళంగా ఇచ్చారు. గ్రామీణ కుటుంబాలు మరియు బలహీన వర్గాలతో కూడిన ఈ సమూహాలు సేంద్రీయ వ్యవసాయం మరియు చేతితో తయారు చేసిన సబ్బులు, డిటర్జెంట్లు, మూలికా ఉత్పత్తులు మరియు ఔషధ వస్తువుల ఉత్పత్తి ద్వారా స్థిరమైన జీవనోపాధిలో నిమగ్నమై ఉన్నాయని తెలిపారు.

## డబ్బులు, ఆభరణాలు తేవాలని వేధించడంతో

# యువతి ఆత్మహత్య



మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 11 (జనంసాక్షి) : ప్రేమ పేరుతో ఓ వ్యక్తి ,ఓ యువతిని మానసికంగా ఫోన్‌లో వేధింపులకు పాల్పడడంతో చివరికి వేధింపులు భరించలేక ఆత్మస్థైర్యం కోల్పోయిన ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని భగవంతం వాడకు చెందిన నూలిగొండ అనూష డిగ్రీ పాసు అయి ఇంటి వద్దనే ఉంటుంది. డిగ్రీ చదువుతుండగానే అదే కాలేజీలో రంగుల శ్రీకాంత్ యువకుడు, ఈ యువతి ప్రేమించుకున్నారు. ఇరువురు ఇరు కుటుంబాలలో సంప్రదించగా కులాలు వేరు కావడంతో యువతి పెద్దలు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో రంగుల శ్రీకాంత్ యువతికి ఫోన్ చేసి నన్నే పెళ్లి చేసుకోవాలని, ఇంట్లో నుండి బంగారం, డబ్బులు ఆభరణాలు తేవాలని వేధింపులకు గురి చేసే వాడని, నన్ను కాదని ఎవరిని పెళ్లి చేసుకున్న మీ కుటుంబ పరువు బజార్ కి ఇస్తానని బెదిరించడంతో మానసికంగా టార్చర్ పెట్టడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి ఇంట్లో మధ్యాహ్నం ఎవరూ లేరని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీకాంత్ మూలంగానే తమ చెల్లెలు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్నయ్య మంచిర్యాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. మంచిర్యాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# న్యాయవాదిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

## రెబ్బన ఎస్ఐని సస్పెండ్ చేయాలి

## బార్ అసోసియేషన్ నాయకుల డిమాండ్




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 11 ( జనం సాక్షి) : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గల న్యాయవాది నరహరి పై ఆదివారం దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సిర్పూర్ కోర్టు బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి శ్రీనివాస్ మాట్లాడుతూ రెబన మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ దాడి చేసిన వారికి వంత పాడుతూ , న్యాయవాది నరహరి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం పట్ల ఆయన ఖండించారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న న్యాయవాదుల పట్ల సమాజంలో కొంతమంది గిట్టని వారు ఈ విధంగా భయభ్రాంతులకు గురి చేస్తూ, దాడులు చేయడ%శీ% ప్రియమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంట కళ్యాణ్, సభ్యులు ఎం శంకర్, రైస్ హెహ్మద్, సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాలు వెల్లడిస్తే అరెస్టులా?

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను ఖండించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి



పాలకుర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి) : ఈవీఎంల ట్యాంపరింగ్‌పై బహిరంగంగా మాట్లాడి సాక్షాలతో నిజాలను బయటపెడితే అక్రమంగా అరెస్టులు చేస్తారని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డిలు బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులను ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎంల క్యాంపరింగ్ జరుగుతుందని ఆధారాలతో కూడిన ప్రశ్నలు లేవనెత్తినందుకే అక్రమంగా అరెస్టులు చేయడం బిజెపి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతగల ప్రభుత్వమే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ప్రతిపక్షాల గొంతును నొక్కుతుందని విమర్శించారు. అణచివేసే ధోరణికి కేంద్ర ప్రభుత్వం పాల్పడితే ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని స్పష్టం చేశారు. దేశంలోని బిజెపి రహిత పార్టీలన్నీ ఐక్యమై ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొని బిజెపి నిరంకుశ పాలనను అంతమొందించేందుకు ఏకం కావాలని సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
12 ఆగస్టు 2025

# ప్రమాదంలో యువత భవిత

జనంసాక్షి

ప్రపంచవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలు మరియు అవకాశాలను సూచించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 12 న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటారు.దీనిని ఐక్యరాజ్యసమితి 1999లో స్థాపించింది.ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి జాతి నిర్మాణంలో మరియు స్థిరమైన అభివృద్ధిని నడిపించడంలో యువతరం పోషించే పాత్రను హైలైట్ చేయడం ఈ దినోత్సవ లక్ష్యం.విద్య, ఉపాధి, మానసిక ఆరోగ్యం మరియు పౌర భాగస్వామ్యం వంటి అంశాలపై యువత చర్చల్లో పాల్గొనడానికి ఒక వేదికగా పనిచేస్తుంది.అంతర్జాతీయ యువజన దినోత్సవం 2025 యువత అభివృద్ధికి తోడ్పడే థిమ్‌తో ఎస్‌డిజిఎస్ మరియు అంతకు మించి స్థానిక యువత చర్యలు". స్థానిక స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డిజిఎస్) సాధించడంలో యువత పాత్రను మరియు సామాజిక అభివృద్ధి మరియు శాంతికి వారి విస్తృత సహకారాన్ని ఈ థీమ్ హైలైట్ చేస్తుంది.యువత సామాజిక, ఆర్థిక మరియు పర్యావరణ చొరవలతో సహా వివిధ అభివృద్ధి రంగాలలో పాల్గొంటున్నారని థీమ్ నొక్కి చెబుతుంది.ప్రపంచ ఆశయాలను సమాజ-ఆధారిత వాస్తవాలలోకి అనువదించడంలో యువత యొక్క ప్రత్యేక పాత్రను హైలైట్ చేస్తుంది.జాతీయ మరియు అంతర్జాతీయ నిబద్ధతలతో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ సమాజ అవసరాలతో వాటిని సమలేఖనం చేయడానికి పని చేస్తున్నప్పుడు, యువకులు కీలకమైన భాగస్వాములు. వారు ఆచరించే విధానం మరియు ఆచరణ మధ్య అంతరాన్ని తగ్గించడంలో సహాయపడే సృజనాత్మకత,అంతర దృష్టి మరియు లోతైన సమాజ సంబంధాలను తెస్తారు.యువతంటే మార్పును ఆశించే నవతరం.అవకాశాలను అందిపుచ్చుకొని భవితకు బాటలు వేసుకునే శక్తి.తలుచుకుంటే ఏదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం.చెడు వ్యసనాలకు బానిసలై కొందరు పెడదోవ పడుతున్నారు.వీరిలో కొందరు యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని కష్టపడుతున్నారు. మరికొందరు లక్ష్యం లేకుండా సరదాలు, సెల్‌ఫోన్లకు, మందుకు, డ్రగ్స్‌కు అలవాటై తమ విలువైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు.పాఠశాల స్థాయిలోనే కొందరు విద్యార్థులు పెడదోవ పడుతున్నారు.వయస్సుతో సంబంధం లేకుండా కొత్తదనపు అనుభూతి కోసం ప్రయత్నిస్తున్నారు. మరికొందరు తమ జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో మత్తువైపునకు వెళుతున్నారు.తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, పాఠశాలలు, కళాశాలలు యాజమాన్యం కూడా పట్టించుకోక పోవడంతో విద్యార్థుల గతి తప్పుతుంది.నేడు ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంది. ఫోన్ చేతిలో ఉంటే సమస్తం ఉన్నట్లే. సెల్‌ఫోన్ కొనివ్వలేదని కొన్ని చోట్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. తల్లిదండ్రుల ప్రేమ కూడా ఒక కారణమైంది. గత రెండు సంవత్సరాలుగా కొవిడ్ నేపథ్యం లో విద్యార్థుల చదువుల పేరిట సెల్‌ఫోన్ వాడడం సాధారణమైంది.అంతే కాకుండా స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల మోజులో పడి నీలి చిత్రాలకు ఆకర్షితులవుతున్నారు.సినిమాలు, సెల్‌ఫోన్ల వినియోగంతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.కొన్నిచోట్ల సంపన్న వర్గాల పిల్లలకు స్పోర్ట్స్ బైక్‌లు, కారులు, చేతి నిండా సొమ్ము ఉండడంతో వినోదాన్ని హద్దులు దాటేస్తున్నారు.మరికొన్ని చోట్ల రేవ్ పార్టీలు చేసుకుంటున్నారు.అలాగే గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారు.కొన్నిచోట్ల మద్యానికి బానిసైన వారు డబ్బులు లేకపోవడంతో హత్యలకు పాల్పడుతున్నారు.చెడు స్నేహాలతో సిగరెట్, మందుకు అలవాటు పడిన వారు మత్తు పదార్థాల వైపు ఖచ్చితంగా వెళ్తారు. వారిని గుర్తించాలి.ఇంట్లో తల్లిదండ్రులు పట్టించుకోకుంటే చాలామంది డిప్రేషన్‌లోకి వెళ్తారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు గుర్తించాలి.చదువులో వెనకబడడం, పరీక్షలు బాగా రాయకపోవడం, ఒంటరిగా ఉండడం, ప్రవర్తనలో మార్పు, ఆలస్యంగా నిద్ర పోవడం, సెల్‌ఫోన్‌తో గడపడం, అబద్దాలడడం వంటి ప్రవర్తనలు తల్లిదండ్రులు గుర్తించాలి.వారిపై ఒక కన్నేసి చూడాలి.గంజాయి తాగే వారి కండ్లు ఎరుపుగా ఉంటాయి.వారిని గుర్తించాల్సి ఉంటుంది.ఒంటరిగా ఉండకుండా చూడాలి.కాసేపు మనసు విప్పి వారితో మాట్లాడాలి.పిల్లలకు అతిస్వేచ్ఛ ఇవ్వవద్దు.నైతిక విలువల పట్ల అవగాహన కలిగి ఉండాలి. పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉండేలా చూడాలి.చదువు,కెరీర్‌పై దృష్టి సారించేలా చూడాలి.మానవత్వం గురించి వివరించాలి.సమస్యలు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించాలి.జీవితమంటే సరదాలు, షికార్లే కాదు.లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగేలా ప్రోత్సహించాలి. ప్రలోభాలకు గురి కాకుండా ఒక కన్నేసి చూడాలి.ఇలా చేసినప్పుడే యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, తాను అనుకున్నటువంటి లక్ష్యాల వైపు ప్రయాణిస్తారు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# సుస్థిరాభివృద్ధిలో యువత

*అంతర్జాతీయ యువజన దినోత్సవం- ఆగస్టు 12 సందర్భంగా*



ఆర్థిక వ్యవస్థకు యువ జనాభా పునాది వంటిది. ప్రస్తుతం పలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువతీ, యువకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని జనాభా దోరణులు పేర్కొంటున్నాయి. వారికి సరైన అవకాశాలు కల్పించి శ్రామికశక్తిలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రపంచ దేశాలు అగ్రగామిగా నిలుస్తా యని నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా యువ జనాభా యొక్క ప్రాముఖ్యతతోపాటు వారి గళాన్ని తెలియడానికి ఐక్యరాజ్యసమితి 2000 ఆగస్టు 12 నుండి ప్రతి ఏటా ప్రపంచ యువజన దినోత్సవం జరుగుతుంది. ప్రపంచ సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రక్రియలలో యువత భాగస్వామ్యాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది. ఈ ఏడాది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, అంతకు మించి సాధనకు స్థానిక యువత చర్యలు అనే ప్రత్యేక నినాదంతో నిర్వహించుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030కల్లా సాధించడానికి యువత పాత్రే కీలకమని ఈ నినాదం నొప్పి చెబుతుంది. ఈ లక్ష్యాలు పేదరికం నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, ఆరోగ్యం, విద్య, సమానత్వం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, స్థిరమైన నగరాలు, వాతావరణ మార్పులను ఎదుర్కో వడం వంటి అంశాలపై దృష్టి పెడతాయి. యువత ఈ లక్ష్యాల సాధనలో క్రియాశీలకంగా పాల్గొంటే, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో సహాయపడుతుంది. భారతదేశంలో యువతను సాధికారతవైపు నడిపించడానికి జాతీయ యువజన విధానం 2022 తీసుకురావడం జరిగింది. ఈ క్రమంలో నాణ్యమైన విద్య, గౌరవం తో కూడిన పని, ఆర్థిక అభ్యుదయం వంటి ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనను జాతీయ యువజన విధానంలో అంతర్భాగం చేశారు.

**యువత అభివృద్ధిలో అంతరాలు**

ఇటీవల కాలంలో యువతకు సరైన మార్గనిర్దేశం లేకపోవడం వల్ల నిరాశ, నిస్పృహలతో జీవిస్తుంది. సామాజిక మాధ్యమాలతో యువత పక్కదారి పడుతుంది. మాదకద్రవ్యాల, మద్యపానం, ధూమపానం లాంటి వ్యసనాలు ఉచ్చులో చిక్కుకొని జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పర్యవేక్షణ కొరవ డడంతో నైతిక విలువలు, క్రమశిక్షణ లోపించి హత్యలు, అత్యాచారాలు, మానభంగాల లాంటి దుస్సంస్కృతికి పాల్పడుతున్నారు. ఇది దేశాభివృద్ధి గొడ్డలి పెట్టు లాంటిది. మన విద్యాసంస్థలు పట్టాలను అందించే ఫ్యాక్టరీలుగానే మారాయి, తప్ప నైపుణ్యవంతులను తయారు చేయలేకపోవడం ఆందోళనకరం. ఇప్పటికీ పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం లాంటి సామాజిక సమస్యలు యువతను పట్టి పీడిస్తున్నాయి. ఇటీవల దేశ యువతలో కుల, మతతత్వ భావాలను నింపుతూ సాధికారతకు దూరం చేస్తున్నారు. ఈ ధోరణి వెనకబడిన దళిత, గిరిజన వర్గాల యువతపై ప్రభావం చూపు తుంది. ఉన్నత విద్యలో సైతం దళిత, గిరిజన విద్యార్థులు నమోదు శాతం తక్కువ ఉంటుందని ఉన్నత విద్యా మండలి అధ్యయనం పేర్కొన్నది. ఆర్థిక ఇబ్బందులు, ప్రీమెట్రిక్, పోస్ట్ పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ సకాలంలో అందకపోవ డమే దీనికి ప్రధాన కారణం. అంతేకాకుండా విద్యాసంస్థల్లో దళిత, గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షత కూడా వారి విద్యా అవకాశాలను దూరం చేస్తుంది. గత కొంతకాలంగా ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలను పరిశీలిస్తే దళిత, గిరిజన, వెనుకబడిన విద్యార్థులే ఎక్కువ ఉంటున్నట్లు క్షేత్రస్థాయి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి యువత అభివృద్ధిలో అంతరాలను ఎత్తిచూపుతున్నాయి.

**ఆధునిక నైపుణ్యాలతోనే అభివృద్ధి**


వికసిత్ భారత్ వైపు నడిపించడానికి సమర్థ మానవ వనరులు గల యువత కీలక పాత్ర పోషించనుంది. ప్రపంచంలో యువ జనాభా అధికంగా ఉన్న దేశాలలో భారత్ మొదటి స్థానం తర్వాత చైనా, అమెరికాలు దేశాలున్నాయి. కానీ మనదేశంలో శ్రామిక శక్తిలో యువ భాగస్వామ్యం తక్కువే. భారతదేశంలో దాదాపు 37 కోట్ల మంది 15%-%29 సంవత్సరాల వయస్సు గల వారు ఉన్నారు, ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇది సానుకూల అంశం. ఈ క్రమంలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించి బహుళ రంగాల్లో ప్రవేశించే విధంగా ప్రోత్సహించాలి. ఇటీవల కాలంలో కృత్రిమ మేధా అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మానవ అవసరాలను భర్తీ చేస్తుంది. ఈ క్రమంలో యువత ఆధునిక సాంకేతికత కోర్సులను అధ్యయనం చేయకపోతే భవిష్యత్తును నిరుద్యోగమనే అంధకారం వెంటాడు తుంది. విద్యాసంస్థలు బాల్య దశనుంచే అనుభవపూర్వక విద్యను అందిస్తూ నైపుణ్యవంతులుగా తయారు చేయాలి. యువతను నైపుణ్యవంతులుగా తయారు చేయడానికి ప్రభుత్వాలు చట్టపరమైన, విధానపరమైన చర్యలతో ముందుకు వెళ్లాలి. స్కిల్ ఇండియా లాంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదు.

సంపదను సృష్టించే సామర్థ్యాలను యువతకు అందించడానికి విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఇటీవల జాతీయ నూతన విద్యా విధానంలోని పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యపై శిక్షణ ఇవ్వాలని పేర్కొనడం హర్షణీయం. యువత కుటీర పరిశ్రమలను నెలకొల్పడానికి ప్రోత్సహించాలి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తగిన శిక్షణ ఇచ్చి, బ్యాంకుల నుంచి సంస్థాగత రుణ సదుపాయాన్ని కల్పించాలి. ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల, ఆర్థిక క్రమశిక్షణ పట్ల యువతీ, యువకులకు అవగాహన కల్పించాలి. యువత వ్యవసాయాన్ని ఉపాధిగా స్వీకరించడానికిహాప్రభుత్వాలు ప్రోత్సహించాలి. యువతకు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి పై పాఠశాల స్థాయిలో నుంచే బోధించాలి.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
9959556367

# ఎన్నికల సంఘం భ్రష్టు పట్టిందా!

## సంస్థాగత విశ్వసనీయతపై చర్చ




రాహుల్ ఆరోపణలు. భారత రాజకీయ రంగంలో ఎన్నికల సంఘం (ఈసీఐ) ఒక స్వతంత్ర సంస్థగా గుర్తింపబడుతుంది, దాని ప్రధాన లక్ష్యం స్వతంత్ర, న్యాయమైన ఎన్నికలను నిర్వహించడం. అయితే, ఇటీవలి కాలంలో, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ సంస్థపై తీవ్రమైన ఆరోపణలు చేశారు, ఇవి భారత ఎన్నికల వ్యవస్థ యొక్క పారదర్శకత, నిష్పక్షపాత పాత్రపై అనేక సందేహా లను లేవనెత్తాయి. గాంధీ ఆరోపణలు, ముఖ్యంగా 2024 లోక్‌సభ ఎన్నికలు అలాగే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి అనుకూలంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలను మార్చిందని, ఇది "ఓటు చోరీ"కి సమానమని, దేశవ్యాప్తంగా చర్చను రేకెత్తించాయి. ఈ వ్యాసం రాహుల్ గాంధీ ఆరోపణలను, వాటి సాధ్యాసాధ్యాలను, వాటి రాజకీయ, సామాజిక పరిణామాలను విశ్లేషిస్తుంది.

రాహుల్ గాంధీ తన ఆరోపణలను బెంగళూరులో జరిగిన 'వోట్ అధికార్ ర్యాలీ'లో ఆగస్టు 7, 2025న న్యూఢిల్లీలో జరిగిన పత్రికా సమావేశంలో స్పష్టంగా వెల్లడిరచారు. ఆయన ప్రధాన వాదనలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: కర్ణాటకలోని "మహదేవపుర" నియోజకవర్గంలో 1,00,250 ఓట్ల "చోరీ" జరిగిందని, ఇందులో 11,965 డూప్లికేట్ ఓటర్లు, 40,009 నకిలీ చిరునామాలు, 10,452 ఒకే చిరునామాకు సంబంధించిన బల్క్ ఓటర్లు, 4,132 అస్పష్టమైన ఫోటోలు, 33,692 కొత్త ఓటర్ల ఫారం-6 దుర్విని యోగం ఉన్నాయని ఆరోపించారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు మరియు విధానసభ ఎన్నికల మధ్య ఐదు నెలల వ్యవధిలో 1 కోటి కొత్త ఓటర్లు జోడిరచబడ్డారని, ఇది అసాధారణమైన పెరుగుదలగా అనుమానం వ్యక్తం చేశారు. ఈసీఐ డిజిటల్ ఓటరు జాబితాలను అందించడానికి నిరాకరించిందని, బదులుగా 7 అడుగుల కాగితపు జాబితాలను అందించిందని, ఇవి ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్)కు అనుకూలంగా లేవని ఆయన ఆరోపించారు. ఇది కంప్యూటర్ ట్యాబిలేషన్ విశ్లేషణకు వీలు లేకుండా చేసింది. ఆధుని క కాలంలో సాంకేతికంగా అభివృద్ధి చెందిన దశలో సమాచార విశ్లేషణకు ఈసీఐ సహకరించి ఉంటే మొత్తం భారత దేశంలో ఎన్నికల ప్రక్రియలో లోపాలను గంటల వ్యవధిలో వెల్లడిరచే అవకాశం ఉండేది. ఎన్నికల ఫలితాలను సవాలు చేయకపోతే 45 రోజుల తర్వాత సీసీటీవీ ఫుటేజ్‌ను నాశనం చేయడానికి ఈసీఐ చట్టాన్ని సవరించిందని, ఇది ఆధారాలను దాచడానికి చేసిన ప్రయత్నమని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం (ఈసీఐ), బీజేపీ తో కలిసి పనిచేస్తూ ఓటరు జాబితాలను మార్చివేసిందని, ఈ చర్య "భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా నేరం చేసినట్లు గా" రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆయన ఈసీఐ అధికారులను "దేశద్రోహం" చేస్తున్నారని హెచ్చరించారు.

రాహుల్ గాంధీ ఆరోపణలను "ఆధారరహితం", "బాధ్యతారహితం" అని తిరస్కరించింది. గాంధీ తన ఆరోపణలను రుజువు చేయడానికి "ఎలక్టర్స్ రిజిస్ట్రేషన్ రూల్స్", 1960లోని రూల్ 20 (3) (ప) కింద ప్రమాణపత్రంతో సహా నిర్దిష్ట ఓటరు వివరాలను సమర్పించాలని లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కోరింది. ఈసీఐ, 2018లో మధ్యప్రదేశ్ కాం గ్రెస్ నాయకుడు కమల్ నాథ్ చేసిన ఇదే విధమైన ఆరోపణలను సుప్రీం కోర్టు తిరస్కరి ంచిన సంఘట నను గుర్తు చేసింది. రాహుల్ గాంధీ ఆరోప ణలను "పాత స్క్రిప్ట్" గా అభివర్ణించింది. కర్ణాట క, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల ము ఖ్య ఎన్నికల అధికారులు గాంధీ ఆరోపణ లకు సంబం ధించిన వివరాలను అందించ మని కోరగా, కాంగ్రెస్ ఎటువంటి అధికారిక అప్పీల్ దాఖలు చేయలేదని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ఆరోపణలు భారత ఎన్ని కల వ్యవస్థ యొక్క పారదర్శకతను అలాగే జవాబుదారీతనంపై కీలకమైన ప్రశ్నలను లేవనెత్తాయి. డిజిటల్ ఓటరు జాబితాలను అందించకపోవడం మరి యు సీసీటీవీ ఫుటేజ్ నాశనం వంటి అంశాలు, నిజమైతే, భారత ఎన్నికల సంఘం యొక్క నిష్పక్షపాతతపై తప్పకుండా సందేహాలను కలిగిస్తాయి. 21వ శతాబ్దంలో డిజిటల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నప్పుడు, కాగిత జాబితాలను అందించడం మ్యాన్యువల్ గా విశ్లేషణను కష్టతరం చేస్తుందన్న రాహుల్ గాంధీ వాదనలో లోతైన నిజం ఉండవచ్చు. అదే సమయంలో, మహారాష్ట్రలో 1 కోటి కొత్త ఓటర్ల జోడిరపు కూడా అసాధారణంగా కనిపిస్తుంది. దీనికి సాధారణ వివరణలు (జనాభా వృద్ధి, ఓటరు నమోదు డ్రైవ్‌లు) ఉండవచ్చు ననే ఎన్నికల సంఘం సమాధానం నమ్మశక్యంగా లేదు. దీనిపై బహిరంగంగా వివరించాల్సి ఉంటుంది. అయితే, రాహుల్ గాంధీ ఆరోపణలు రాజకీయ ఉద్దేశ్యంతో కూడినవిగా కూడా పరిగణించబడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికలలో ఊహించిన ఫలితాలను సాధించలేకపోయింది. అలాగే ఈ ఆరోపణ లు ఓటర్లలో అసంతృప్తిని రేకెత్తించే ప్రయత్నం కూడా కావచ్చు. బీజేపీ నాయకులు రవిశంకర్ ప్రసాద్, అమిత్ మాలవియా రాహుల్ గాంధీని "నిరాశాజనక నాయకుడు"గా విమర్శించారు. ఆయన ఆరోపణలను "బాధ్యతారహితంగా" ఉన్నాయని అభివర్ణించారు. ఈసీఐ యొక్క గత రికార్డు, ముఖ్యంగా కమల్ నాథ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు, రాహుల్ గాంధీ ఆరోపణలను బలహీనపరుస్తుంది. ఎందుకంటే గతంలో ఇలాంటి ఆరోపణలు నిరాధారమైనవిగా తేలాయి కనుక.

రాహుల్ గాంధీ ఆరోపణలు రాజకీయంగా రెండు విధాలుగా పనిచేస్తాయి. ఒకవైపు, అవి కాంగ్రెస్ ఓటరు బేస్‌ను ఉత్తేజపరు స్తాయి. అలాగే ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేస్తాయి. శశి థరూర్, సిద్ధరామయ్య, మరియు కపిల్ సిబల్ వంటి నాయకులు గాంధీకి మద్దతు ప్రకటించడం ద్వారా ఇది రుజువైంది. మరోవైపు, ఈ ఆరోపణలు ఎన్నికల సంఘం యొక్క విశ్వసనీయతను దెబ్బతీస్తా యి. ఇది ఓటర్లలో ఎన్నికల ప్రక్రియపై నమ్మకాన్ని క్షీణింపజేయవచ్చు. ఇది దీర్ఘకాలంలో ఓటరు భాగస్వామ్యాన్ని తగ్గించవచ్చు. సామాజికంగా, ఈ ఆరోపణలు ఎన్నికల సంస్థలపై ప్రజల విశ్వాసా న్ని సవాలు చేస్తాయి. ఈసీఐ ఈ ఆరోపణలకు పారదర్శకంగా స్పందించకపోతే, లేదా డిజిటల్ డేటాను అందించడంలో విఫలమైతే, ఇది సంస్థాగత లోపాలను ఎత్తి చూపుతుంది. అదే సమయంలో, రాహుల్ గాంధీ "ఆటమ్ బాంబ్" అనే పదజాలం, ఎన్నికల సంఘం అధికారులను బెదిరించే విధానం రాజకీయ చర్చను తీవ్రతరం చేస్తుంది. ఇది ఎన్నికల సంఘం విశ్వసనీయతకు పరోక్షంగా దాని ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది.ఎన్నికల సంఘం ఏర్పాటు లోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వం లేకుండా బీజేపీ అత్యవసరంగా చేయటం. కాలపరిమితి కి ముందే చీఫ్ ఎన్నికల సంఘం చైర్మన్ ను తొలగించటం, బీజేపీ, ఆరెస్సెస్ మూలాలు ఉన్న వారిని ఎన్నికల సంఘంలో సభ్యులుగా చేర్చటం ప్రజలను గందరగోళంలో పడేసింది. చివరిగా... రాహుల్ గాంధీ ఆరోపణలు భారత ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను, జవాబుదారీతనం యొక్క అవసరాన్ని హైలైట్ చేసింది. ఎన్నికల సంఘం డిజిటల్ డేటా మరియు సీసీటీవీ ఫుటేజ్‌ను అందుబాటులో ఉంచడం ద్వారా ఈ ఆరోపణలను ఖండిరచవచ్చు. అయితే, రాహుల్ గాంధీ ఆరోపణలు రాజకీయ ఉద్దేశ్యంతో కూడినవిగా కనిపిస్తాయి, వాటిని రుజువు చేయడానికి నిర్దిష్ట ఆధారాలను అందించడంలో విఫలమైతే, అవి కాంగ్రెస్ పార్టీ యొక్క విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. ఈ వివాదం ఎన్నికల సంస్కరణల అవసరాన్ని బలంగా సూచిస్తుంది. ముఖ్యంగా డిజిటల్ యుగంలో ఓటరు జాబితాలు, ఎన్నికలకు సంబంధించిన డేటా యొక్క పారదర్శకతను నిర్ధారించడంలో. భారత ప్రజాస్వామ్యం యొక్క బలం దాని సంస్థల విశ్వసనీయతపై ఆధారపడి ఉంటుంది. రాహుల్ గాంధీ ఆరోపణల పై సుప్రీంకోర్టు సుమోటో కేసు గా పరిగణించి జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తే .. ఎన్నికల సంఘం నిష్పాక్షికత నిగ్గు తేలుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ఫిలాసఫీ అనేది ఒక మహానదియా? అతుకుల బొంతనా?

నిన్నటి తరువాయి భాగం

దోపిడి, పెట్టుబడి, రాజ్యం అని రాసుకుంట, విశ్లేషిం చుకుంట వచ్చారు. దొంగ సొత్తు అనే మాటను ఇన్ని రకాలుగ సాగదీసి చెప్పాడు మార్క్స్. ప్రజలకు ఒకటే తెలుసు మంది సొమ్ముదిని బలిసిండు అంటరు. మా రెక్కల కష్టం దోసుకొని బలిసిండు. అని అంటరు. ప్రజలది తత్వ శాస్త్రం భాష. మార్క్సుది అర్థ శాస్త్రం పరిభాష. మార్క్స్ భావుకుడు. ఊహాత్మక గొప్ప భావుకుడు. భావ వాది. మౌలికంగా మార్క్సు భావవాది. భావ వాదులు సృష్టి ఆది మధ్య అంతం గురించి చెప్తారు. ఏసు చెప్పాడు. మహ్మమ్మద్ ప్రవక్త చెప్పాడు. బ్రాహ్మ ణీయ హిందూ మతం చెప్పింది. స్వర్గం నరకం దైవలోకంఅన్నారు. మార్క్సు కూడా జంతు దశ, అక్కడి నుండి మనిషిగా మారడంలో చేయి నిర్వహిం చిన పాత్ర. ఆదిమ సమాజం, ఫ్యూడల్ సమాజం, పెట్టుబడిదారీ సమాజం, కార్మిక వర్గ సోషలిజంతో సమాజం అంతిమ దశ. అలా స్వర్గం గా ఈ లోకమే మారుతుంది అని సోషాలిజం కమ్యూనిజం మానవాళి అంత్యదశ అని ఛెప్పిన భావుకుడు. అలా మార్క్సుభావవాది. భావవాద తత్వశాస్త్ర వేత్త. అయితే మార్క్సు అర్థశాస్త్రంలో భౌతిక శాస్త్రవేత్త. ఇలా తత్వశాస్త్రంలో భావవాది. అర్థశాస్త్రంలో భౌతిక వాది. సామాజిక శాస్త్రంలో అనేక ఆదర్శాల ఆదర్శవాది. ఉద్యమాల్లో కార్మిక వర్గ వాది. రాజనీతి శాస్త్రంలో కమ్యూనిస్టు.

ఇలా తత్వవేత్తలు చాలా మంది, మతాలు సృష్టి స్థితి లయలు గురించి వివరిస్తాయి. తమకు తోచింది చెప్పాయి. అట్లా చెప్పిన వాల్లకు ముందుకూడ ఈ ప్రపంచం ఉంది. వాల్లు పోయిన తర్వాత కూడా ఈ ప్రపంచం ఉంది. ఇట్లా పోతులూరి వీర బ్రహ్మం కూడా కాలజ్ఞానం చెప్పాడు. ఆమ్ స్టర్ డామన్ కూడ చెప్పాడు. వాల్ల తర్వాత కూడా ప్రపంచం ముందుకు నడిచింది. కత్తుల కాలంలో ఊహించారు కనక కల్కి అవతారం గుర్రం, కత్తి తో చెప్పారు. ఇట్లా మనిషికోతీరు చెప్పారు. అట్లా మార్క్సుకు ముందు ఎందరో వచ్చారు పోయారు. మార్క్సు తర్వాత కూడా ఎందరో వస్తారు. పోయారు. మల్లా కొత్తగా కొత్త తరం వచ్చి కొత్త ఊహలు చేస్తుంది. మార్క్సు మార్క్సిజం కూడా సవాలక్ష భావాల్లో ఒకటి! బౌద్ధమే ఆఖరు అనుకున్నారు! అక్కడికి ఆగిందా? మార్క్సిజం , అదే ఆఖరు అంటే ఆగుతుం దా? నాలాగ ఇంకా ఎందరో పుడుతారు. వస్తారు. పోతారు. ఏదీ శాశ్వతం కాదు. శాశ్వతమన్నది ఏదీ శాశ్వతంగా నిలిచి పోలేదు. నిలిచి పోదు. అంతా మారుతుంది. మార్పు నిరంతరమైనది. నిరంతర చలనమే దాని స్వభావం. మార్క్సు మార్క్సిజం నిరంతర చలనం, మార్పులగురించి మాట్లాడి నప్పటికీ సోషలిజం, కమ్యూనిజం తిరుగలేని మార్పు లేని సత్యాలనుతాయని, అవ్వాలని ఊహించారు. ఆశించారు. అది వారి ఆదర్శ వాదం. ప్రౌధాన్ కు, బకూనిన్ కు, ట్రాట్స్కీ కు, కొలొంటాయ్ కు, సైమన్ ది బోవర్‌కు, ఫూలేకు, సావిత్రి బాయి ఫూలేకు, అంబేద్కర్ కు, పెరియార్ కు, కాన్షీరాం కు కొన్ని ఆదర్శ భావాలున్నాయి.

**మార్క్సుకు ఒక బలహీనత వుంది.**

ఎవరినుంచి తీసుకుంటారో వారిని క్షమించడం కష్టం అంటాడు తెలుగు సాహితీ వేత్త చలం. కృతజ్ఞత చూపలేనపుడు, గురువుని నమస్కారంతో గౌరవించి ముందుకు పోతే ఈ సమస్య ఉత్పన్నం కాదు.

మార్క్సు ఎవరి నుంచి తీసుకున్నాడో వారందరిని విమర్శించి కించ పరిచే పని చేశాడు. ఈ స్వభావం మార్కసిస్టుల్లో ఇప్పటికీ కొనసాగుతున్నది. కుల సమస్య, దళిత సమస్య, ప్రాంతీయ అసమానతల సమస్య, స్త్రీ పురుషుల అసమానతల సమస్య , వారి పీడన అణిచి వేత, అంతర్గత వలసాధిపత్యం వంటి వాటిని మొదట లేవ నెత్తిన వారిని తిట్టి తిట్టి పూర్వ పక్షం చేయ బోయి, తామే వెనకబడి పోయామని గుర్తించాక మొదట కృషి చేసిన వారిని అపుడైనా గౌరవించకుండా అకస్మాత్తుగా తమకే జ్ఞానోదయం జరిగినట్టు చెప్పుకుంటారు. వామ పక్ష వాదులకు ఈ స్వభావం మార్క్సు నుండి అంటు వ్యాధిలా కొనసాగుతున్నది. ఇలా అనేకుల సిద్ధాంతాలను, వ్యూహం ఎత్తుగడలను కలుపుకుంటూ సాగిన మహా నదీ ప్రవాహం/ అంతర్జాతీయ బ్యాంకు, / అతుకుల బొంత గా ఎదుగుతూ వస్తున్నది.

పేదల నుండి ఎదిగిన వారంటే మార్క్సుకు చాలా చిన్న చూపు. ఈసడింపు. ప్రౌధాన్ ను విమర్శించి దూరం చేయడంతో అంతర్జాతీయ సోషలిస్టు క్యాంపు రెండుగా చీలి పోయింది. ఒకరు మార్క్సిస్టుల య్యారు. మరొకరు ఫ్రెంచి సోషలిస్టులయ్యారు. సివేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే భావం ఫ్రెంచి సోషలిస్టులది. భారత దేశంలో రామ్ మనోహర్ లోహియా, జయ ప్రకాశ్ నారాయణ్, మధులిమయే, మొదలైన వారు ప్రౌధాన్, సోషలిస్టుల క్రమానికి చెందిన వారు. ప్రౌధాన్ కు చరిత్రలో ప్రధాన్యత తగ్గించడం వల్ల సోషలిస్ట శిబిరమే చీలికలైంది. మార్క్సు లోని ఇగోయిస్టిక్ బలహీనతే ఇందుకు ప్రధాన కారణం అనుకుంటాను. ప్రౌధాన్ ఒక సోషలిస్టు, తత్వవేత్త. పరస్పర తత్వ శాస్త్రం స్థాపించాడు. ఆర్థిక వేత్త. 1848 ఫ్రాన్సు విప్లవం తర్వాత ఒ ప్రౌధాన్ ఫ్రెంచ్ పార్లమెంటు సభ్యుడయ్యాడు. తనను తాను సమైఖ్య వాదిగా పేర్కొన్నాడు. స్వేచ్ఛ సమాజం, వ్యక్తి వాదం యొక్క సంశ్లేషణ అని పేర్కొన్నాడు. దీనిని వ్యక్తి వాద అరాచక వాదం , సామాజిక అరాచక లాదం అని పిలిచారు. బెనాస్కాన్ లో జన్మించిన ప్రౌధాన్ పుస్తకాలు బాగా ముద్రించడానికి తనకు తానుగా లాటిన్ నేర్చుకున్నాడు. వాటీజ్ ప్రాపర్టీ పుస్తకం 1840 లో ప్రచురించాడు. ఆస్తి అనేది దొంగతనమే అన్నాడు. దాన్ని చదివి మార్క్సు ప్రౌధాన్ తో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభించాడు.ఇద్దరూ ఒకరినొకరు ప్రభావితం చేసుకున్నారు. మార్క్సు బహిష్కరణకు గురైనపుడు ఫ్రాన్సు చేరి ప్రౌధాన్ ను కలుసుకున్నాడు. సిస్టం ఆఫ్ ఎకనమిక్ కాంట్రడిక్షన్ అనేవిషయాన్ని ప్రౌధాన్ ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ అని రాసాడు. దానికి మార్క్సు సౌమ్యంగా కన భావాలను వివరించే బదులుగా రెచ్చగొట్టే శీర్శికతో " ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ " రాసాడు. దాంతో వారి స్నేహం ముగిసింది. ఈ వివాదం అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ యొక్క అరాచక వాదం మరియు మార్క్సిజం మధ్య చీలికకు మూలాలలో ఒకటిగా మారింది. ప్రౌధాన్ కార్మిక మండళ్లు, సహకార సంఘాలను స్థాపించాడు. వ్యక్తిగత రైతు ప్రయివేటు యాజమాన్యం శాంతియుత సామాజిక విప్లవం పద్దతిలో సాధించ వచ్చని భావించాడు. వడ్డీ లేని రుణాలిచ్చే జాతీయ బ్యాంకు ఏర్పాటు చేయాలని భావించాడు. ప్రౌధాన్ కు తల్లి చదువు నేర్పింది. కష్టపడి కన్సెషన్ ఫీజు మీద తల్లి కాలేజీ లో చేర్పించింది.. ధన వంతుల పిల్లలచే అతను అవమానాలు తిరస్కారాలు ఎదుర్కున్నాడు. పుస్తకాల లైబ్రరీలో చదవడం ! 1827 లో ప్రింటింగ్ ప్రెస్ లో అప్రెంటిస్ గా ప్రారంభం! తరువాతి సంవత్సరం అతని స్కూల్ మేట్ ఆంటోనియన్ గౌథియర్ కుటుంబానికి చెందిన బైసాన్ కాలో చేరాడు. మతపరమైన సాహిత్యం చదివి చదివి వాటిని ప్రశ్నించడం ప్రారంభించాడు. చివరకు క్రైస్తవాన్ని వదిలేసాడు. ఆస్తి అంటే ఏమిటి పుస్తకంలో తన మత పరమైన ప్రయాణం ప్రొటెస్టెంటిజంతో మొదలై నియో క్రిస్టియనిజంగా ముగిసిందన్నాడు. ప్రౌధాన్ క్రమంగా పుస్తకాల ప్రూఫ్ రీడర్‌గా ఎదిగాడు. 1829 నాటికి మతం కంటే సామాజిక సమస్యలపై దృష్టి పెంచుకున్నాడు. చార్లెస్ ఫోరియర్ తో పరిచయం జరిగింది.

ఆయన తన పుస్తకం ముద్రణ కోసం వస్తే ఆ పుస్తకం ప్రూఫులు ముద్రణ పని చూసాడు ప్రౌధాన్. అతని పుస్తకం, అతనితో చర్చలు జీవితాంతం ప్రభావం వేసాయి. ఇలా ప్రాక్టికల్ జీవితం నుండి అధ్యయనం అవగాహన వికసించింది. అవగావన.. పెరగడంలో గుస్తావ్ ఫాలోట్, మైఖేల్ డి మోంటైగ్నే , ఇతర ఫ్రెంచ్ సాహిత్యం చదివాడు. సెప్టెంబర్ 1830 లో ట్రావెలో మాన్ కంపోజిటర్ గా సర్టిఫికేట్ పొందాడు. ఆతరువాత ప్రౌధాన్ జీవితం నిరుద్యోగం పేదరికం. ఫాలోట్ అర్థశాస్త్రం అధ్యయనం చేయడానికి ప్రౌధాన్ ఫ్రాన్సుకు వస్తే ఆర్థిక సాయం చేసాడు. ఫాలోట్ మిత్ర బృందంతో సన్నిహితుడయ్యాడు. ఫాలోట్ కలరాతో చని పోయాడు. 1838 లో ప్రింటింగ్ వ్యాపారం విఫలమ య్యాక పండిత కార్యక్రమాలకు అంకితం కావాలనుకున్నాడు. 1863లో తన భావాలను కొంత సవరించుకున్నాడు. ది ప్రిన్సిపల్ ఆఫ్ ఫెడరేషన్ 1863) లో రాజ్య వ్యతిరేకతను సవరించుకున్నాడు. అరాచకత్వా న్ని స్వయంగా నియంత్రిం చునే ప్రభుత్వం అని సవరించాడు. అరాచక వాదం అని కావాలని తప్పుడు అన్వయంతో చితక బాది చివరకు మార్క్సు అదే స్వీకరించి దాన్ని కొత్త పదాల్లో రాజ్యం క్రమంగా అదృశ్యమవుతుంది అన్నాడు.






- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనంసాక్షి) :** ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులు సమన్వయంతో పని చేస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంగరకలాన్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో విఐపిలు అధికారులు మీడియా ఇతరులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు త్రాగునీరు పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్య అతిధి సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని తెలిపారు. వేడుకలకు వచ్చే అతిథికి పోలీసు గౌరవ వందనంతో పాటు వేడుకలలో పోలీసు బందో బస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు వేదికను ఏర్పాటు చేయాలని సూచించారు విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డిఈఓ ను ఆదేశించారు వేడుకల్లో శకటాలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి కె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత కలెక్టరేట్ ఏఓ . సునీల్ కుమార్ జిల్లా పరిషత్ సిఈఓకృష్ణారెడ్డి జిల్లా అధికారులు పోలీసు శాఖ అధికారులు అగ్నిమాపక శాఖ అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సఖి కేంద్ర మహిళల హక్కులపై అవగాహన కల్పించండి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రాలు
- జిల్లా కేంద్రంలో భరోసా, సఖి సెంటర్స్‌ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) :** సఖి కేంద్రాల ద్వారా మహిళల హక్కుల పై అవగాహన కల్పించాలని,లైంగిక దాడికి గురైన బాధితులకు అండగా భరోసా సెంటర్స్ రక్షణ కల్పిస్తాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గల భరోసా , సఖి సెంటర్స్ ను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ముందుగా భరోసా సెంటర్స్ సందర్శించి లీగల్, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్మెంట్ రికార్డింగ్ చేయు గదులను పరిశీలించి భరోసా సెంటర్ నిర్వాహణ తీరును ఆరా తీశారు . బాధితులకు నైపుణ్యాలు నేర్పించి సమాజంలో ఉన్నతంగా జీవించేలా భరోసా సెంటర్స్ దోహదపడతాయి అన్నారు. అనంతరం సఖి సెంటర్‌ను సందర్శించి నిర్వహణ తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ ద్వారా ఇప్పటివరకు 1391 కేసులు పెట్టామని 1131 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు,నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు భరోసానిచ్చి న్యాయం అందించేలా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకులు రేణుక, లీగల్ కౌన్సిలర్ నిర్మల, ఐపీ అసిస్టెంట్ ఎన్ రమేష్, మల్టీపర్పస్ వర్కర్ ఉమామహేశ్వరి సిబ్బంది భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో నైపుణ్యాలను ప్రదర్శించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




**వనపర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి) :** క్రీడాకారులు నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా విజయాలను సొంతం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఉద్బోధించారు. హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల ఆగస్టు 3, 4వ తేదీలలో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో మెడల్స్ సాధించిన అథ్లెట్స్‌ను కలెక్టర్ సోమవారం అభినందించారు. వనపర్తి జిల్లాకు చెందిన కేశపగా లావణ్య, హై జంప్‌లో గోల్డ్ మెడల్ ,బద్దు నాయక్ 5000 మీటర్స్ రేస్ వాక్ లో సిల్వర్ మెడల్, జంగం సాయి సాత్విక్ 60 మీటర్స్‌లో సిల్వర్ మెడల్, సుచిత్ర, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో సిల్వర్ మెడల్, శంకర్ నాయక్ జావెలిన్‌త్రోలో బ్రాంజ్ మెడల్ , సురేష్ నాయక్ కిడ్స్ జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించి నందుకు వనపర్తి జిల్లా గౌరవ కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు వాకిటి శ్రీధర్ అథ్లెట్స్ కు సన్మానం చేసి మెడల్స్ అందజేస్తూ జిల్లా కు మరిన్ని మెడల్స్ సాధించి మంచి పేరు తీసుకురావాలి అని ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా డీవైఎస్ఓ శ్రీ సుధీర్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి, నందిమల్ల శ్రీకాంత్ , పీఈటీలులు ఆంజనేయులు, నవీన్ పర్వతాలు పాల్గొన్నారు.

# ఉప్పల్ నారపల్లి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయండి

- మంత్రి కోమటిరెడ్డిని కలిసిన మేడ్చల్ కాంగ్రెస్ నేతలు

**బోడుప్పల్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి నారాపల్లి వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. స్థానికులు ప్రతీ రోజు రహదారి దుస్థితి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో గుంతలు, ట్రాఫిక్ జాములు, ప్రమాదాల భయం మరింత పెరిగింది.ఈ పరిస్థితిని మార్చాలని కోరుతూ మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జులు తోటకూర వజ్రేష్ యాదవ్, మందమల్ల పరమేశ్వర్ రెడ్డి సోమవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ప్రత్యక్షంగా కలిశారు. ప్రాజెక్ట్ ను మళ్లీ వేగవంతం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.దీనికి స్పందించిన మంత్రి వెంటనే రహదారి మరమ్మత్తు పనులను తక్షణం చేపట్టమని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే, ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన సహకారం కోసం కేంద్రమంత్రితో త్వరలో చర్చిస్తానని హామీ ఇచ్చారు.



# శ్రీరామ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్‌నగర్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, నియోజకవర్గ అభివృద్ధి తమ ఏకైక లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ భారస అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్ర యాదగిరి నేత, కాలనీ అధ్యక్షులు కొప్పుల ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి మోహన్ రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి




**కొడంగల్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యుఏసి ఆధ్వర్యంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల న్యాక్, ఐ.ఎస్.ఓ గుర్తింపుతో అనుభవజ్ఞులైన అధ్యాపకులను కలిగి గ్రామీణ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నదని, విద్యార్థులు తమ యొక్క జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఉన్నత స్థాయిలను అధిరోహించాలని విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వం అలవర్చుకోవాలని తెలియజేయడం జరిగింది.డిగ్రీ మరియు సి బి సి ఎస్ విధానం గ్రేడింగ్ పద్ధతి, సెమిస్టర్ నిర్వహణ, స్కాలర్ షిప్స్ మరియు ఇతర అంశాల గురించి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐక్యుఏసి కోఆర్డినేటర్ టి . రాంబాబు,వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం మరియు అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజనం అందించాలి

- నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ
- పాల్గొన్న ఎంపీడీవో కృష్ణయ్య



**ఉర్కొండ, ఆగస్టు 11 (జనంసాక్షి) :** నులిపురుగుల నివారణ చర్యలు చేపడితే అనారోగ్య సమస్యలతో పాటు రక్తహీనత ను నియంత్రించడం సాధ్యమవుతుందని ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు. మండలంలోని తిమ్మన్నపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా నైపుణ్యాలను పరీక్షించడం జరిగింది. అన్ని తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించడం జరిగింది. నాణ్యమైన విద్య, భోజనం అందించుటకు ప్రధానోపాధ్యాయురాలుకు సూచించడం జరిగింది. ఆ గ్రామ ఆశ వర్కర్ సూచనల మేరకు ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఆ పాఠశాల విద్యార్థులకు వేయడం జరిగింది. అనంతరం గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించడం జరిగింది. మంజూరైన అన్ని ఇండ్లను త్వరగా నిర్మించుకొనుటకు లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఆశ వర్కర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నిమ్జ్ ప్రాజెక్టుకు స్వచ్ఛందంగా భూములిస్తాం

- జనరల్ అవార్డు కింద..పరిహారం అందించండి చాలు
- కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందించిన భూ నిర్వాసితులు



**న్యాల్‌కల్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న జాతీయ ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టుకు మేము ఎంత మాత్రం వ్యతిరేకం కాదని, ప్రాజెక్టు ఏర్పాటుకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని.. ఐతే భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు నష్టపరిహారం మాత్రం "జనరల్ అవార్డు" కింద పరిహారం అందించాలని బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన "ప్రజావాణి"కి న్యాల్ కల్ మండలం, హదునూర్ గ్రామానికి చెందిన పలువురు భూ నిర్వాసితులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన దాదాపు 30 35 మంది పట్టా భూములు కలిగిన రైతులు 140, 150 ఎకరాల మేరకు జనరల్ అవార్డు కింద ప్రాజెక్టుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని భూ నిర్వాసితులు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో భూ నిర్వాసితులు జైపాల్ రెడ్డి, నర్సారెడ్డి, షబ్బీర్ ఖాన్, సంగారెడ్డి, రాజు, ఆనంద్ రెడ్డి, సంజీవరెడ్డి, దేవేందర్, తదితరులు ఉన్నారు.

# విద్యారంగా అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

- విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు
- డైనింగ్ హాల్, అదనపు గదుల నిర్మాణం
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, ఆగస్టు 11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం జడ్చర్ల మండలంలోని గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, పాఠశాలల్లో ఆరోగ్య పరిరక్షణకు ఈ తరహా కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తామని, నట్టల వల్ల కలిగే సమస్యలు, వాటి నివారణపై విద్యార్థులు, తల్లిదండ్రులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతప్ప అభ్యర్థన మేరకు డైనింగ్ హాల్, అదనపు గదుల నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే జడ్చర్ల నియోజకవర్గంలో పెద్దయిపల్లి దగ్గర ఇంటిగ్రేటెడ్, నవోదయ పాఠశాల మంజూరు చేయించామని, అలాగే ట్రిబుల్ ఐటీ కళాశాల కూడా జడ్చర్ల సమీపంలో మంజూరు కావడం నియోజకవర్గ ప్రజలకు గర్వకారణమని అన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లుగానే విద్య మరియు వైద్యం రంగాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నానని, ఇప్పుడు విద్యార్థులు రాఖీ కట్టడం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో గంగాపూర్ గ్రామాన్ని ఒక రోల్ మోడల్‌గా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, మండల విద్యాధికారిణి మంజులా దేవి, పాఠశాల సిబ్బంది, నాయకులు జనార్ధన్ రెడ్డి, గోపాల్ యాదవ్, ప్రసాద్ యాదవ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సునీల్, శివకాంత్, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి



**మెదక్, ఆగస్టు 11 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ నందు అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై వివిధ సమస్యలపై ప్రజలు అందించిన భూ సమస్యల- 36, ఇందిరమ్మ ఇండ్లు -10 ఇతర సమస్యలు-20 మొత్తం 66 దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
12 ఆగస్టు 2025

# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి) : స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్, సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని, వర్షాలు కురుస్తున్నందున వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని,108 అంబులెన్స్ ను వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి




కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. రెవిన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, పురపాలక, ఫారెస్ట్, పశు సంవర్ధక, తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సిపిఓ బాలశౌరి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం పనులు పూర్తి చేయాలి

- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీద ఫ్యాక్టరీ ప్రారంభం
- జిల్లా కలెక్టర్ కె.హైమావతి



నంగునూరు, ఆగస్టు 11 (జనం సాక్షి) : నంగునూర్ మండలంలోని నర్మేట గ్రామంలో 300 కోట్లతో నిర్మాణం చేస్తున్న ఆయిల్ ఫామ్ ప్యాక్టరీనీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అతి త్వరలో ప్రారంభానికి ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ లోపల బీటీ రోడ్ నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. రోడ్ వెంబడి చెట్ల పొదలు తొలగించాలి. పబ్లిక్ మీటింగ్ ప్లేస్ సంబంధించి జంగల్ క్లియరెన్స్ తీసుకోవాలి. పబ్లిక్ మీటింగ్ కి వివిధ జిల్లాల నుండి ప్రజల సమీకరణ కోసం వాహనాల ఏర్పాటు, ఫ్యాక్టరీ దగ్గర పార్కింగ్ కోసం స్థల అన్వేషణ, ఫ్యాక్టరీ ఆవరణ లో పొదలను తొలగించాలని తెలిపారు. ప్రారంభానికి సంబంధించిన వేగంగా పనులను పక్కా ప్రణాళికలతో పగడ్బందిగా సిద్ధం కావాలని ఆయిల్ ఫ్రైడ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆయిల్ ఫామ్ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.

## రాహుల్ గాంధీని అరెస్టు చేస్తే సహించేది లేదు

**మోడీ దిష్టిబొమ్మ శవయాత్ర, దహనం**



వనపర్తి టౌన్, ఆగస్టు 11 (జనంసాక్షి) : దొంగ ఓట్లను ప్రోత్సహిస్తూ ప్రతిపక్షాల మద్దతుతో గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలన చేస్తుందని వనపర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విమర్శించారు.వనపర్తి శాసనసభ్యులు తూడిమేగా రెడ్డి ఆదేశానుసారం సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన మోడీ శవయాత్ర దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.దొంగ ఓట్లు ఉన్నాయని ఆధారాలతో సహా నిరూపించి వాటిని తొలగించాలని శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధినేత గౌరవ శ్రీ రాహుల్ గాంధీ గారిని, ప్రియాంక గాంధీ గారిని అరెస్టు చేసి బిజెపి తన వక్ర బుద్ధిని ప్రదర్శించిందని వారు పేర్కొన్నారు.ప్రజల కోసం అహర్నిశలు పరితపించే తమ నాయకుల పై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.గత పది రోజుల క్రితం దేశంలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయి ఉన్నాయని వాటిని తొలగించాలని గౌరవ శ్రీ రాహుల్ గాంధీ గారు డిమాండ్ చేస్తే అందుకు స్పందించిన బిజెపి ప్రభుత్వం ఆధారాలతో నిరూపించాలని నోటీసులు జారీ చేసిందని, అందుకు సానుకూలంగా స్పందించిన గౌరవ రాహుల్ గాంధీ ఆధారాలతో సహా దొంగ ఓట్ల జాబితాలు బహిర్గతం చేశారు.వెంటనే దొంగ ఓట్లను తొలగించాలని సోమవారం ఢిల్లీలో శాంతియుత నిరసన చేపట్టిన రాహుల్ గాంధీ గారిని ప్రియాంక గాంధీ గారిని అరెస్టు చేయడం బిజెపి దుర్మార్గపు పాలన చాటి చెబుతుందన్నారు.ప్రతిపక్షాల మద్దతుతో గద్దెనెక్కిన బిజెపి పార్టీకి ఇదే చివరి అవకాశమని రానున్న కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా..

- పెద్దగుట్టపై మరిన్ని వసతులు కల్పిస్తాం..
- నల్లకుంటలో మరోసారి సర్వే..
- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి..

జడ్చర్ల, ఆగస్టు 11 (జనంసాక్షి) : జడ్చర్ల నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. బాదేపల్లి పెద్దగుట్టపై గల శ్రీ రంగనాయక స్వామి శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, సేవ, అభివృద్ధి మూడు మార్గాల్లో ముందుకు సాగుతామని, శ్రీ రంగనాయక స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని, భక్తుల సౌకర్యార్థం పెద్దగుట్టపై వసతులు కల్పిస్తామని తెలిపారు. శ్రావణమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రామిరెడ్డి రాధిక దంపతులకు, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ రంగనాయక స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.

పార్టీ పరిధిలోని 14వ వార్డు పరిధిలో ఉన్న నల్లకుంటలో మరోసారి సర్వే చేపడతామని, వర్షాకాలంలో పైనుండి వస్తున్న



వరద ప్రవాహానికి నల్లకుంటలో మీరు నిలవకుండా నేరుగా డ్రైనేజీ ద్వారా బయటికి వెళ్లడం వల్ల నేతాజీ రోడ్డుపై నీళ్లు నిలిచి, సమీప కాలనీలు జలమయమవుతున్నాయి. అందుకు నల్లకుంట మధ్యలో ఉన్న డ్రైనేజీ కాలువను అవసరమైతే తొలగిస్తామని, నల్లకుంట నిండిన తరువాతే వరద నీరు బయటికి వెళ్లాలని అందుకు అధికారులు సర్వే చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు చైతన్య చౌహన్, రాజు, నాయకులు నిత్యానందం, లక్ష్మణ్, వంశీధర్ రెడ్డి, బాలకృష్ణ, రఘు, కృష్ణయ్య, వంశి చారి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్‌మేవాను రద్దు చేస్తాననడం అవివేకం

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫరూక్ హుసేన్

వనపర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి) : బైలాస్ ప్రకారం పనిచేస్తున్న తమ సంఘాన్ని రద్దు చేస్తానని మూసా అనే వ్యక్తి ప్రకటించడం అవివేకం, హాస్యాస్పదమని ఆల్ మైనార్టీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్ మేవా)రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుసేన్, డాక్టర్ సయ్యద్ వహీద్ షాహ్ ఖాద్రి ఓ లిఖితపూర్వక ప్రకటనలో పేర్కొన్నారు.రిజిస్టర్ సొసైటీల నిబంధనలకు అనుగుణంగా మూసా వియ్యంకుడు తమ కార్యవర్గాన్ని ఎంపిక చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికలను రంగారెడ్డి జిల్లా పరిషత్ హాలులో అప్పటి తెలంగాణ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమురద్దిన్ అని, ఈయన మూసా స్వయాన వియ్యంకుడు అనే విషయాన్ని గుర్తించాలని ఆ ప్రకటనలో తెలిపారు. సంఘ రిజిస్ట్రేషన్ బాధ్యతలను తీసుకున్న మూసా దానిని సమర్థ వంతంగా నిర్వహించలేదని గుర్తించిన అప్పటి అధ్యక్షుడు దివంగత ఘాజియుద్దీన్ అతణ్ణి సంఘ కార్యక్రమాలకు దూరంగా ఉంచారని వెల్లడించారు. అధ్యక్షుడు చనిపోవడంతో హైదరబాద్లోనే ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మళ్లీ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యములో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నమని, అట్టి ఎన్నికల్లో భయపడి కనీసం పోటీ కూడా చేయని మూసా కు సంఘం గురించి మాట్లాడే అర్హత లేదనిఅన్నారు.

ఆనాటి నుంచి నేటివరకు సంఘంలో ఎలాంటి సంబంధం లేకుండా ఉన్నాడని, దాన్ని విస్మరించి రాష్ట్ర కమిటీని రద్దు పరుస్తున్నట్లు ప్రకటించడం ఆయన తెలివి తక్కువ తనానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.తెలంగాణలో మైనార్టీ ఉద్యోగస్తుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించే విధంగా అనేక కార్యక్రమాలు తాము చేపడుతున్నట్లు దీన్ని జీర్ణించుకోలేని కొంతమంది స్వార్థపరులు, తమ ప్రయోజనాల కోసంసంఘ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని సంఘంలో వారికి ఎలాంటి స్థానం లేదని వారు ఈ సందర్భంగా పేర్కొంటూ మూసా కుటుంబ విభేదాలు సంఘంపై రుద్దే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 40 దరఖాస్తులు



సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి) : ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 40 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. అందిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ... ప్రజావాణి లో అందిన ప్రతీ దరఖాస్తుపై రికార్డు నిర్వహణ చేపట్టి ,ప్రతి ఫిర్యాదు పరిష్కారం అయ్యేవరకు ఫాలోఅప్ అని తెలిపారు. ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారం కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణికి 22 ఫిర్యాదులు



నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదు లకు ప్రాధాన్యతనిస్తూ త్వరి తగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 దరఖాస్తులు ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతా ల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కలెక్టర్ సిక్త పట్నాయక్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్ శ్రీను ను విన్నవిస్తూ అర్జీ లు సమర్పించారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపు తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్ చౌరస్తా వంద పడకల ఆసుపత్రిలోకి వర్షపు నీరు

- బకెట్లతో నీటిని తొలగించిన సిబ్బంది..?

మానవపాడు, ఆగస్టు 11 (జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవెల్లి మండలం.. అలంపూర్ చౌరస్తాలో రూ 21 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలోకి వర్షపు నీరు చేరింది.. రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తయిన ఈ ఆస్పత్రి, ఇటీవలే వినియోగంలోకి వచ్చింది.. అయితే నిర్మాణ నాణ్యత లోపాల కారణంగా చిన్నపాటి వర్షాలకే భవనం కారుతుందని సిబ్బంది తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుండి కురిసిన వర్షానికి ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ లోకి నీరు రావడంతో సిబ్బంది బకెట్లు పెట్టి జాగ్రత్త పడ్డారు.. దీంతో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు వారి బంధువులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉన్నది. వైద్యం కోసం వచ్చిన ప్రజలు వర్షం నీటి వల్ల కింద పడుతున్నారు కాంట్రాక్టర్లు చేసిన నామమాత్రపు పనులతో ఆస్పత్రి సిబ్బంది బకెట్లతో వర్షపు నీటిని తొలగించాల్సిన పరిస్థితి స్పష్టంగా ప్రజలకు కనిపిస్తుంది.. 100 పడకల ఆసుపత్రిలో జనరల్ ఓపీ సేవలు ప్రారంభమైన షిఫ్ట్ డ్యూటీలకు వచ్చే డాక్టర్లు విధులకు సరిగా హాజరు కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరైనా క్యాజువాలిటీ సేవల కొరకు వస్తే అక్కడే ఉండే సిబ్బంది డాక్టర్లకు ఫోన్లో సమాచారం ఇచ్చి రాపించుకొని వైద్యం చేసి పంపిస్తున్నారని ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు,



ప్రజాప్రతినిధులు, వెంటనే స్పందించి వంద పడకల ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించడంతోపాటు ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గ్రంథాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి



భూత్పూర్, ఆగస్టు 11 (జనంసాక్షి) : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠకులకు అన్ని విధాల సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామస్తుల కోరిక మేరకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం గ్రంథాలయం లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రంథాలయ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్,ప్రహరీ గోడ,మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పించాలని కాంగ్రెస్ నాయకులు చైర్మన్‌కు వివరించారు. ఈ సందర్భంగా తొలిసారి గ్రంథాలయానికి వచ్చిన జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డిని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది,కాంగ్రెస్ నాయకులు రాకేష్ పటేల్, వెంకటేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# సీపీఆర్ విధానాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి) : ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా మనుషులు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలాంటి విపత్కర పరిస్తితుల్లో ప్రాణాలు కాపాడగలిగె సిపిఆర్ (కార్డియాక్ పల్మనరి రిసెక్రియేషన్) విధానాన్ని ప్రతి ఒక్కరు నేర్చుకొని అవసరం ఉన్నప్పుడు ప్రయోగించి సాటి మనిషి ప్రాణాలు కాపాడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు డాక్టర్ రఘు సి.పి.ఆర్ పై నమూనా శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సి.పి.ఆర్ చేసే విధానం భారత దేశంలో కేవలం 1-2 శాతం ప్రజలకు మాత్రమే అవగాహన ఉందని, అదే ఇతర దేశాల్లో 30 శాతం ప్రజలకు సి.పి.ఆర్. ఎలా చేయాలో శిక్షణ పొందుతారన్నారు. ఈ మధ్య




కాలంలో ఎక్కడో ఒక చోట వయసుతో సంబంధం లేకుండా అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం, ఊపిరితిత్తులు పనిచేయకపోవడం వల్ల చనిపోతున్నారని, ఇలాంటి వారికి కొన్ని క్షణాల లోపు సి.పి.ఆర్ విధానం చేయడం వల్ల 85 శాతం తిరిగి బతికించే అవకాశం ఏర్పడుతుందన్నారు. నిత్యజీవితంలో ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎవరికైన వచ్చి ఎవరైనా చూస్తే వెంటనే సి.పి.ఆర్ చేసి ఒక నిండు ప్రాణం కాపాడిన వారవుతారని, అందువల్ల జిల్లాలో ప్రతి ఒక్కరు సి.పి.ఆర్ విధానాన్ని నేర్చుకోవాలని సూచించారు. దీనికోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విభాగం వారిగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారిని ఆదేశించారు.పోలీస్, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విలేకరులు, ఇతర శాఖల సిబ్బందికి సైతం శిక్షణ ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు ను ఆదేశించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. కీమ్య నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య అడిషనల్ ఎస్పీఆర్ వీరారెడ్డి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీనివాసులు ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామచంద్రరావు, మహబూబ్ నగర్ వైద్య విభాగం నుండి డా. రఘు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల సాగు భూములకు అసైన్మెంట్ చేయాలి

- ఆదివాసీ రైతులకు వ్యవసాయ బోర్లు ఫ్రీ పేస్ కరెంట్ ఇవ్వండి
- జై కిసాన్ ఎత్తి పోతల ప్రాజెక్ట్‌ను బాగు చేయించండి
- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కలిసిన ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు కోర్స నరసింహ మూర్తి, వాసం నాగరాజు
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలని వేడుకోలు



**నూగూర్ వెంకటాపురం, ఆగస్టు 11 (జనంసాక్షి)** : షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల సాగు భూములకు అసైన్మెంట్ చేయాలని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు కోర్స నరసింహ మూర్తి, వాసం నాగరాజు కోరారు. ఎన్నో ఏళ్ల సాగు నీటి కష్టాలను తీర్చాలని కోదండ రెడ్డిని పలు సమస్యల పైన హైదరాబాద్ లోని బూర్గుల రామకృష్ణారావు భవనం లోని తన కార్యాలయంలో సోమవారం కలిశారు. మొక్కజొన్న సాగు చేసి బహుళ జాతి కంపెనీల చేతిలో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించి నష్టపరిహారం ఇప్పించినందుకు కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు రైతులతోపాటు కృతజ్ఞతలు తెలిపారు. నర్సింహా మూర్తి నాగరాజు మాట్లాడుతూ విదేశీ విత్తనోత్పత్తి కంపెనీల చేతిలో మోస పోయిన రైతులకు ఐదు కోట్ల రూపాయలు నష్టపరిహారం ఇప్పించినందుకు గ్రామాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కోదండ రెడ్డి కి తెలిపారు. నిజమైన రైతు ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మే అని కొనియాడారు. వ్యవసాయ మంత్రి తుమ్మల, జిల్లా మినిష్టర్ సీతక్క మాకు న్యాయం జరిగేలా చేశారని రైతులు అన్నారు. ఉమ్మడి ఖమ్మం, ములుగు జిల్లాల్లో దశాబ్దాలుగా ఆదివాసీ రైతులు భూములను సాగు చేస్తూ ఉన్న వారికీ గత ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వలేదని కోదండ రెడ్డి ముందు వాపోయారు. పట్టాలు లేక పోవడం తో ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రైతు భీమా, వ్యవసాయ రుణాలు అందడం లేదన్నారు. బ్యాంక్ రుణాలు కూడా రాకపోవడంతో దళారుల దెగ్గర అధిక వడ్డీలకు తెచ్చుకొని అప్పుల పాలు అవుతున్నారని తెలిపారు. అసైన్మెంట్ చేసి పట్టాలు ఇవ్వాలని ఆయన్ని కోరినారు. పాలెం వాగు కాలువకు విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలనీ విద్యుత్తు శాఖా వారిని ఇరిగేషన్ శాఖా వారిని ఆదేశించించమి ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు కోదండ రెడ్డి ని కోరినారు. దీనివల్ల రాచపల్లి, నూగురు,ఒంటి మామిడి, చినగంగారం, జెల్లా కాలని, బర్లగూడెం, రామవరం, చిరుతపల్లి రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలోని రైతులకు ఉపయోగబడే విధంగా రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి జై కిసాన్ ఎత్తి పోతల పథకం ప్రారంభించారన్నారు. అది నేడు నిరప యోగంగా మారిందన్నారు. జై కిసాన్ ఎత్తి పోతల ప్రాజెక్ట్ ని బాగు చేయాలనీ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ని కోరిన వెంటనే సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కరించా లన్నారు. పోడు భూములకు బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వడం లేదని కూడా తెల్పినారు. అన్ని సమస్యలను క్షుణ్ణంగా విన్న తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడారు. ములుగు ఏజెన్సీ ఆదివాసీ రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారిణి చిత్ర మిశ్రా, ములుగు ఆర్ డి ఓ వెంకటేష్ తో చరవాణి ద్వారా చర్చించగా తక్షణమే ఎస్సైన్మెంట్ సర్వే మొదలు పెట్టి పట్టాలు ఇస్తామని ఆర్‌డిఓ వెంకటేష్ తెలిపారు. కొందండ రెడ్డి కలిసిన వారిలో రాచపల్లి, చిరుత హాపల్లి, రామవరం, యోగితానగర్ గ్రామాలకు చెందిన రైతులు శ్యామల గోపి, రాంబాబు, కుర్సం రాము, ఇతర రైతులు ఉన్నారు..

# ప్రజావాణి ఫిర్యాదులకు వారంలోగా పరిష్కారం చూపాలి

- బల్దియా ప్రధాన కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం
- ప్రజల నుండి.వినతులు స్వీకరించిన జీ డబ్ల్యూ ఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 24 గం.లోగా శానిటేషన్ ఫిర్యాదులు పరిష్కారం చేయాలి
- వివిధ విభాగాలకు సంబంధించి 91 దరఖాస్తుల స్వీకరణ



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 11(జనంసాక్షి):** ప్రజావాణి ఫిర్యాదులకు వారం లోగా పరిష్కారం చూపాలని జీ డబ్ల్యూ ఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు. ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా విభాగాల ఉన్నతాధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తూ పెండింగ్‌లో ఉండకుండా చూడాలని, 24 గంటల్లోగా శానిటేషన్ విభాగానికి అందిన ఫిర్యాదులు పరిష్కారం కావాలని, గార్బేజ్ బిన్ లు లిఫ్ట్ చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, వెంటనే ఆ సమస్య పట్ల దృష్టి సారించాలని అన్నారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగానికి చెందిన ఈ వారం లో స్వీకరించిన ఫిర్యాదులు పెండింగులో ఉండకుండా వచ్చేవారం లోగా పరిష్కరించబడాలని తెలిపారు. ఓపెన్ ప్లాట్స్ లో పిచ్చి మొక్కలు చెత్తాచెదారం ఉండడం వల్ల వర్షాకాలం నేపద్యం లో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అలాంటి ప్లాట్ లను శుభ్రం చేసుకునేలా యాజమాన్యాలకు సూచిం చాలని తెలి పారు. ఈనెల 21 వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో బోనాలు పండుగలు జరుగుతున్న నేపథ్యం లో సంబంధిత ఆలయ ల వద్ద ఎలక్ట్రికల్ శానిటేషన్ ఏర్పాట్ల తో పాటు డస్ట్, పారిశుద్ధ్యం నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమన్వయం తో పనిచేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భం గా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా.. ఇంజనీరింగ్23, హెల్త్, సానిటేషన్ 11,ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)9, టౌన్ ప్లానింగ్44, హార్టికల్చర్ 2, ఎలక్ట్రికల్2, మొత్తంగా 91 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్చార్జి ఎస్ ఈ, సిటీ ప్లానర్‌లు మహీందర్ రవీందర్ రాడేకర్, సిహెచ్ఓలు రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి

**ఇంచార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** ప్రజావాణిలో వచ్చిన ప్రజా వినతుల దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, ఇంచార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో (రెవెన్యూ)అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తో కలిసి గ్రీవెన్స్ లో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు బయ్యారం మండలానికి చెందిన షబీరుద్దీన్ తను ఉన్నత విద్యను చదివి ఉన్నానని బయ్యారంలో మీ సేవా ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. డోర్నకల్ మండలం ఎర్రమట్టి తండ కు చెందిన జి.పద్మ ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరారు. కేసముద్రం మండలానికి చెందిన జాహేద తన భర్త గుండెపోటుతో మరణించారని తన పిల్లలను సాదుకోవడం ఇబ్బందిగా ఉందని తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సెక్యూరిటీ గా విధులు నిర్వహిస్తున్నానని 11 నెలలుగా జీతం ఇవ్వకుండా ఉద్యోగం నుండి తీసివేసారని తనకు తన ఉద్యోగంతో పాటు జీతం ఇప్పించాలని కోరారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో వివిధ శాఖలకు సంబంధించి 84 వచ్చాయి. ఆ ధరఖాస్తులను ఆయా శాఖ అధికారులకు సత్వర చర్యలకై ఆదేశించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో జెడ్‌పి సీఈఓ పురుషోత్తం, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఉద్యాన వన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న, డిపిఓ హరిప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల, పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, డి.డి.గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, ఎల్‌డిఎం పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, మత్స్య శాఖ అధికారి వీరన్న, మెప్మా అధికారి విజయ కలెక్టరేట్ పలు సెక్షన్‌ల సూపరింటెండెంట్ లు మదన్ మోహన్, వినోద్, రాఘవరెడ్డి, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 11(జనంసాక్షి) :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ను రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జనరల్ హాస్పిటల్ వార్డులను, చికిత్స పొందుతున్న రోగులను, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా ఇటీవల క్యాన్సర్ ఆపరేషన్ అయిన వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జనరల్ హాస్పిటల్ సూపరిన్ డెంట్ వి రాజేంద్ర శేఖర్ డాక్టర్లను, హాస్పటల్ సిబ్బందిని అభినందించారు. జనరల్ విభాగంలో ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించడానికి బిల్డింగ్ పై అంతస్తు నిర్మాణం చేపడతామని, ములుగు జిల్లాలో అన్ని రకాల ఆపరేషన్లు జనరల్ హాస్పిటల్ లోనే జరిపించడానికి అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జనరల్ హాస్పిటల్ సూపరిన్ డెంట్ వి చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ గఫర్, ఆర్ఎంఓ సంపత్ హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమం లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని సబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 41 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులు నిశితంగా పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని అధికారు లకు మెమోలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్, గైర్హాజరైన అధికారుల జాబితాను పరిశీలించి, సంబంధిత అధికారికి వెంటనే మెమోలు జారీ చేయాలని ఏఓను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కల్లెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

**సమస్య ఉంటే 8712659973 కి వాట్సాప్ చేయండి**

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రతీ పోలీసు, పోలీసు అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీకి, జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎస్పీతో తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి ప్రజా సమస్యలనకు సిబ్బందిని కేటాయించి త్వరితగతిన సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను విన్నవించిన ఫిర్యాదులలో ముఖ్యంగా భూ సమస్యలు, ఫోర్జరీ సమస్యలు, కుటుంబ కలహాల సమస్యలు, భార్యాభర్తల మధ్య గొడవ, తండ్రి కొడుకులు సమస్యలు, కేసుల పురోగతి, కేసుల దర్యాప్తు వంటి సమస్యలను నేరుగా ఫిర్యాదులను అందించి సమస్యలను విన్నవించుకున్నారు. దాదాపు 43 మంది ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను తెలియజేయడం జరిగింది. సుదూర ప్రాంతాల వారు మరియు ఎస్పీకి నేరుగా సమాచారం అందించాలనుకునే వారు నేరుగా వాట్సప్ ద్వారా తమ సందేశాన్ని 8712659973 నెంబర్ కు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు11 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంట వెంటనే అప్డేట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి , ఆగస్టు 11 (జనంసాక్షి) :** నులి పురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, ఉప వైద్యాధికారి డా. అనిత లతో కలిసి హాజరై విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను తినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యం కొరకు అందరూ కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 58 వేల 480 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ మాత్రలను తినిపించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 930 అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో పిల్లలందరికీ మాత్రలు అందించడం జరుగుతుందని, వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ శాఖలు, మున్సిపల్, గ్రామపంచాయతీ ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. నులి పురుగుల నిర్మూలనతో రక్తహీనత తగ్గి పిల్లలను పోషణ మెరుగుపడుతుందని, మానసిక, శారీరక అభివృద్ధి జరిగి అభ్యాసన సామర్థ్యం, పాఠశాలలో హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు. పిల్లలందరికీ మాత్రలు తినిపించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది పిల్లలందరికీ మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. ఎ. ప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య, వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు ఆగమాగం!

- లబ్ధిదారులకు గడువు దాటిన బాలామృతం, కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ
- అడిగిన వారిపై అతి తెలివి ప్రదర్శన
- కొన్ని గ్రామాల్లో రిజిస్టర్లో ఫోర్జరీ సంతకాలు వెలుగులోకి..
- తూ తూ మాత్రంగా సూపర్వైజర్ తనిఖీలు

**రేగొండ, ఆగష్టు 11 (జనంసాక్షి):**



మండలంలోని అంగన్వాడీల నిర్లక్ష్యం రోజురోజుకు తారాస్థాయికి చేరుతుంది. గ్రామంలోని ప్రతి గర్భిణీకి,చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ దీనికి విరుద్ధంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కార్చే విధంగా అంగన్వాడి కార్యకర్తలు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారు. దీనికి అద్దం పట్టే విధంగా సోమవారం మండలంలోని రాయపల్లి గ్రామ అంగన్వాడీ సెంటర్లో గడువు దాటిన బాలామృతం ప్యాకెట్ల పంపిణీ వ్యవహారం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామంలోని ఓ లబ్ధిదారి మహిళలకు గడువు దాటిన బాలామృతం ప్యాకెట్ ఇచ్చారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన సదరు మహిళపై అంగన్వాడి కార్యకర్త అతి తెలివి ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కాగా సదరు అంగన్వాడీలో అంగన్వాడి సెంటర్ ఆయాలపై వదిలి వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారని... వచ్చిన సరుకును ఎప్పటికప్పుడు పంపిణీ చేయకుండా లబ్ధిదారుల సంతకాలు ఫోర్జరీ చేసి సరుకులు మాయం చేస్తున్నట్లు కొన్ని గ్రామాల ప్రజలు చెప్తుండటం



గమనార్హం.

### ఆకస్మిక తనిఖీల జాడేది...?

అంగన్వాడి సెంటర్ కార్యకర్తల పనితీరుపై ఆకస్మిక తనిఖీ చేసే సూపర్వైజర్లు ముందస్తు సమాచారం ఇస్తూ స్నేహ పూరితంగా అతిథి మర్యాదలు స్వీకరిస్తూ తూ తూ మంత్రంగా తనిఖీ చేస్తున్నారని అదే వీటన్నిటికి మూల కారణం అని ప్రజల్లో చర్చ నడుస్తుంది.ఇంత తతంగం నడుస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వీడి అంగన్వాడి కార్యకర్తలపై ఓ కన్నేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటారా...కడుపులో పెట్టుకొని కాపాడుకుంటారా అన్నది వేచి చూడాలి మరి.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 12 ఆగస్టు 2025

# నులిపురుగుల నివారణకు అల్బెండోజల్ మాత్రలు వేయడం తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) :** ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా అల్బెండ జోల్ మాత్రలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. పిల్లల్లో మానసిక, శారీరక పెరుగుదలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల పిల్లల్లో ఎదుగుదల ఆగిపోతుందని, ఇది రక్తహీనతతో పాటు, కడుపునొప్పి, ఇతర రకాల నొప్పులకు, మానసిక వైకల్యానికి దారి తీసే ప్రమాదం ఉందని, ఎత్తు, బరువు మూర్తిమత్వం ఎదుగుదల ఉండదని, అందువల్ల ఒకటి నుండి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని చెప్పారు. అంతే కాకుండా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదని, భోజనం తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలని, జిల్లాలో 19 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలందరికీ నూటికి నూరు శాతం అల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆమె ఆదేశించారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీ ల ఆధ్వర్యంలో డాక్టర్ల పర్యవేక్షణలో ఈ మాత్రలు వేయటం జరుగుతుందని, అందువలన ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, మాత్రలు వేసుకున్న తర్వాత 30 నిమిషాలు పరిశీలనలో ఉంచడం జరుగుతుందని, ఎవరికైనా ఇబ్బందులు ఏర్పడినట్లయితే తక్షణమే వైద్యుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గతంలో ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు ఈ మాత్రలను వేసేదని, ఇప్పుడు సంవత్సరంలో ఒకసారి మాత్రమే వేస్తున్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ మాత్రలు తప్పకుండా వేసుకునేలా చూడాలని, ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నానికి పిల్లలతో పాటు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని, దీని వల్ల రక్తహీనత వంటివి రాకుండా ఉంటాయని, నులిపురుగులు మానసికంగా ఎదగనీయకుండా చేస్తాయని అందువల్ల ఈ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కాగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నల్గొండ జిల్లాలో మూడు లక్షల 86,134 మంది 1-19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నది లక్ష్యం. ఇందులో 2093 అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు, 1552 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు, 404 ప్రైవేట్ స్కూల్లో చదివే విద్యార్థులకు, 13 జూనియర్ కళాశాలలు, 61 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఐదు టెక్నికల్ కళాశాలల్లో 11 ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు ఈ మాత్రలు ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నది. ఇందుకుగాను జిల్లాకు 4 లక్షల 15800 అల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉన్నాయి. నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సవ్యంగా నిర్వహించేందుకుగాను వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్ని అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా వేయించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఇందుకుగాను ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సైతం ఏర్పాటు చేయడమే కాకుండా, విద్యాశాఖ ,మహిళ శిశు సంక్షేమ, ఇతర శాఖల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగింది. ఏదైనా కారణం చేత 11 న ఆల్బెండజోల్ మాత్రలు వేయించుకోని పిల్లలు ఈ నెల 18న నిర్వహించే మాప్ అప్ కార్యక్రమంలో మాత్రలు వేయించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్, రవి, రేణుక, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతి రావ్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్తీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

- నిర్లక్ష్యంపై చేస్తే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం
- బస్తీల క్షేత్ర సందర్శనలో మేయర్ గద్వాల విజయలక్ష్మి



**హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని బస్తీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం మేయర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి జూబ్లీ హిల్స్ సర్కిల్‌లోని అంబేద్కర్ నగర్, ఉదయ్ నగర్ బస్తీల్లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందికి మేయర్ ఆదేశాలు జారీ చేశారు. వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం ప్రదర్శించే పారిశుద్ధ్య సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్తీల్లో నిర్మాణ వ్యర్థాలు ఇష్టారీతిన పడేసే వారిని కఠినంగా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. అంబేద్కర్ నగర్‌లో నాలా వద్ద కొంత భాగం కూలిన రక్షణ వాల్ వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తక్షణ ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ చెప్పారు. ఈ రెండు బస్తీల్లో రోడ్ల వెంబడి ఉన్న నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులు,సిబ్బంది నీ ఆదేశించారు.

### వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించండి

బంజారాహిల్స్ 1 రోడ్డు మార్గంలో విరించి ఆసుపత్రికి సమీపంలో మహేశ్వరి టవర్స్ ప్రాంతంలో ఇటీవలే రోడ్డు పైన స్లాబ్ కుంగిపోయి, భూమి లోపలికి కూరుకుపోయిన ప్రదేశాన్ని మేయర్ పరిశీలించారు. రూ.65 లక్షలతో 19 మీటర్ల మేర ఆర్ సీసీ స్లాబ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినందుకు వెంటనే పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సత్వరమే స్పందించి పునరుద్ధరణ పనులకు నిధులు మంజూరు చేసిన మేయర్ కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర సందర్శన లో మేయర్ వెంట చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తదితరులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**పెద్దకొడపగల్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సోమవారం జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మీకాంతారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థుల, అధ్యాపకుల సంఖ్యను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ హాస్టల్ లో సమస్యలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి ప్రిన్సిపల్, సిబ్బందితో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తదనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసిల్దార్ దశరథ్, ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై అరుణ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) :** మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను,ఇతర ప్రభుత్వ సంస్థలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల ప్రత్యేక అధికారులపై ఉందని అన్నారు. వారి పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలను తరచూ ప్రత్యేక అధికారులు తనిఖీ చేయడమే కాకుండా, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షిస్తూ మండలాల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని ప్రభుత్వ కార్యక్రమాలు, సంస్థలను తనిఖీ చేసినప్పుడే ప్రభుత్వ పథకాల అమలు తీరు తెలుస్తుందని, అందువల్ల ఇకపై తప్పనిసరిగా ప్రతి ప్రత్యేక అధికారి రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలతో పాటు, ఇతర సంస్థల ను సందర్శించి ప్రభుత్వ ప్రాధామ్య పథకాల అమలు తీరును తప్పనిసరిగా తనిఖీచేయాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల సందర్శన సందర్భంగా సీజనల్ వ్యాధుల తో పీహెచ్సీ లకు వస్తున్న రోగులు, అందిస్తున్న సేవలు, మందుల అందుబాటు వంటి వివరాలను తనిఖీ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పై రూపొందించిన "హర్ ఘర్ తిరంగా హార్ ఘర్ స్వచ్ఛత" గోడపత్రికను ఆవిష్కరించారు. అదే విధంగా రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు,ఇంచార్జ్ డి ఆర్ ఓ నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,ఆర్ డి ఓ లు రమణారెడ్డి, శ్రీదేవి ,గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 46, ఇతర శాఖలకు 26 మొత్తం కలిపి 72 అర్జీలు వచ్చాయి.

## డీసీసీబీ బ్యాంక్‌ను ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



**మణుగూరు, ఆగస్టు 11 (జనం సాక్షి) :** వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు సోమవారం మణుగూరు మండలం అశోక్ నగర్ లో డిసిసి బ్యాంకును ప్రారంభించారు. ఇతర విభాగాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి ఒకే పంట వేయకుండా మిశ్రమ పంటలు వేసి అధిక లాభాలను పొందాలని వాటికి సంబంధించిన రుణాలు బ్యాంకు ద్వారా రైతులకు అందజేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు రైతుబంధు రైతు భరోసా రైతు బీమా రూపంలో లక్షల కోట్లని రైతులకు అందచేస్తోంది. తెలపాక నియోజకవర్గం లో లబ్ధి పొందిన రైతులు 46027 రైతు భరోసా రైతు బీమా పథకం కింద రూ 85,78,332 ను రైతుల ఖాతాలో జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు అండగా నిలిచింది. పినపాక నియోజకవర్గం లో మారేడ్లపల్లి ఎత్తిపోతల పథకం ఈ మధ్యనే ప్రారంభించాం దీనివల్ల ఎంతోమంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. అలాగే పులుసు బొంత ప్రాజెక్ట్ అటవీ శాఖ అనుమతులు పూర్తయితే త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణం చేపడతమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 25 నుంచి 30 వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. భూగర్భ జలాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో పామాయిల్ సాగు చేయటం వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. బ్యాంకు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.జిల్లా కలెక్టర్ జితీష్ వి పాటిల్. చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య.బ్యాంకు సీఈఓ ఎన్ వెంకట ఆదిత్య బ్రాంచ్ మేనేజర్.వి. బాలరాజు, తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు వ్యవసాయ సంచాలకులు తాతారావు, కాంగ్రెస్ మండల నాయకులు ,సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, వెంకటప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి



**శామీర్‌పేట్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** అలియాబాద్, మూడు చింతల పల్లి, ఎల్లంపేట్ మున్సిపల్ కార్మికుల రెండు నెలల జీతాలు చెల్లించలేదని సీఐటియు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అన్నారు. విలీనమైన గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు బకాయిలు వెంటనే విడుదల చేయ్యా లన్నారు. సోమవారం రోజు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ లలో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలల జీతాలు ఇప్పటికీ రాలేదని తెలిపారు. విలీనమైన గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు బకాయిగా ఉన్నాయి. మొత్తం ఐదు నెలల జీతాలు ఇవ్వకుండానే వారు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ధర్నా సమయంలో ప్రజావాణి వద్ద అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాను కలుసుకోగా ఈ వారంలో మున్సిపల్ జీతాలు చెల్లిస్తామని, గ్రామపంచాయతీ వేతనాలు కూడా త్వరలో అంద జేస్తామని హామీ పొందారు. సీఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల జీతాలు చెల్లించకపోవడం సరియైన చర్య కాదని హెచ్చరించారు. ఇలాగే ఉంటే పోరాటం తీవ్రతరం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మున్సిపల్ కార్మికులకు 18,000 రూపాయల జీతాలు ఇచ్చేందుకు హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికీ కార్మికుల హక్కులను కాల రాస్తుందన్నారు. వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మున్సిపల్ నాయకులు ప్రశాంత్, బిక్షపతి, మల్లయ్య, శీను, కార్మికులు బాల్కొండ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ పెంచి ఇస్తావా... రాజీనామా చేస్తావా..

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



**తుంగతుర్తి ఆగస్టు 11 (జనం సాక్షి) :** పెన్షన్లు పెంచి ఇస్తావా.. రాజీనామా చేస్తావా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు సోమవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో సెప్టెంబర్ మూడున హైదరాబాదులో నిర్వహించే పెన్షన్ల పెంపుపై వికలాంగుల మరియు చేనేత పెన్షన్ దారుల సన్నాక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు వికలాంగులకు వృద్ధులకు పెంచుతామన్న పెన్షన్ 20 నెలల అయినప్పటికీ ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పెన్షన్లు పెంచడంలో పూర్తిగా విఫలమైందని. ఈ విషయాన్ని ప్రశ్నించడంలో ప్రతిపక్షం కూడా పెన్షన్ల పెంపుపై ప్రశ్నించక పూర్తిగా అసమర్థతతో ఉందని అన్నారు ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలు బడ్జెట్లో పెంచుతున్న వికలాంగులకు వృద్ధులకు పెన్షన్లు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే అన్ని రకాల పెన్షన్ లు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు . రేవంత్ రెడ్డి కేసీఆర్ ఇద్దరు కూడా భూస్వాములకే కొమ్ము కాస్తున్నారని అన్నారు భూస్వామి వర్గంలో పుట్టిన ఇరువురు పేద ప్రజల కష్టాలు తెలియవని అన్నారు 2007 నుంచి వికలాంగులకు అండగా ఉండేది ఒక ఎమ్మార్పీఎస్ అని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి వికలాంగులకు 6000 వృద్ధులు వితంతువులు చేయూత పెన్షన్ 4000 రూపాయలు పూర్తి అంగవైకల్యం చెందిన వికలాంగులకు 15 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టోలో పెన్షన్లు పెంచుతామని చెప్పారని ఇంతవరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు అత్యంత పేద వర్గాల సమస్యలపై ఎమ్మార్పీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తుందని అన్నారు తనకు కులం . మతం కంటే మానవత్వమే గొప్పదని అన్నారు పేదలు పెన్షన్ మీదనే ఆధారపడి జీవన పోరాటం కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వచ్చి 20 నెలలైనా పెన్షన్లు పెంచలేదని అంతేగాక కొత్తగా పెన్షన్లు కూడా ఇవ్వడం లేదని ఒక్క రాష్ట్రంలో ఒక్కడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో పెన్షన్లు పెంచి ఇస్తున్నాడని అన్నారు. మరి ఇక్కడ ముఖ్యమంత్రి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. దేశం మొత్తంలో పేదలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కేసీఆర్ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలదీయడం లేదని కనీసం అసెంబ్లీకి పోకుండా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ఫామ్ హౌస్ పరిమితం అయ్యాడని అన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ ఇద్దరు కూడా పేదోళ్ల బాధలు ఏమి తెలుసు అని వ్యంగంగా అన్నారు ఆరోజు చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్ చేయాలని తాను హైదరాబాదులో పోరాటం చేస్తే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్రెడ్డి స్పందించి ఆరోగ్యశ్రీ అమలులోకి తెచ్చాడని అన్నారు ఎమ్మార్పీఎస్ చేసిన పోరాట ఫలితంగానే తెల్ల రేషన్ కార్డులకు నాలుగు కిలోల నుండి 6 కిలోల బియ్యం ఇస్తున్న ఘనత ఎమ్మార్పీఎస్‌కే చెందిందని అన్నారు పెన్షన్ల పెంపుపై సెప్టెంబర్ మూడున హైదరాబాదులో జరిగే వికలాంగులు చేయూత. పెన్షన్ దారుల మహాగర్జన సభను అన్ని మండలాల నుండి భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి బచ్చుల కూర వెంకటేశ్వర్లు మాదిగ. ఎమ్మార్పీఎస్ జిల్లా అనుబంధ సంఘాల జిల్లా ఇన్చార్జి రుద్ర పోగు సురేష్ మాదిగ. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గడ్డం ఖాసీం. ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చింత వినయ్ బాబు మాదిగ. విహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి జహీర్ భాయ్. విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు గుండాల కొమరయ్య. ఎం ఎస్ పి నియోజకవర్గ ఇన్చార్జ్ పాల్వాయి బాలయ్య. మండల ఇన్చార్జి కొండగడుపుల శ్రీనివాస్ మాదిగ వితంతు మహిళా విభాగం నాయకురాలు పులుసు సరిత. ఒంటరి మహిళ విభాగం నాయకురాలు జయమ్మ. ఎల్లమ్మ. యాదయ్య. నాయకులు పోలపాక మధు. చంద్రయ్య. జయకృష్ణ. బిక్షపతి శ్రీరాములు తోపాటు వికలాంగులు వృద్ధులు ఒంటరి మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అల్బెండజోల్ మందుల పంపిణీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ఆగస్టు 11 (జనం సాక్షి) :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ఎన్ఎస్పీ క్యాంప్ రోడ్ లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యా, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను స్వయంగా అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న 3,11,317 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నులిపురుగుల నివారణ పంపిణీ కోసం జిల్లాలో మొత్తం 3458 విద్యాసంస్థలలో ఏర్పాట్లు చేశామన్నారు. పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకొని నులిపురుగుల బారి నుండి రక్షణ పొంది, ఎనిమియా తదితర జబ్బులు రాకుండా మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని అన్నారు. వ్యక్తిగత పారిశుద్ధ్యం పట్ల జాగ్రత్త వహించాలని, అంటు వ్యాధులను నివారిస్తూ ఆర్యోగంగా ఉండాలని సూచించారు.జిల్లాలోని అన్ని సామాజిక, ప్రాథమిక ఆరోగ్య వైద్యశాలలు, అంగన్ వాడి కేంద్రాలలో, ప్రభుత్వ , ప్రభుత్వేతర పాఠశాలలో, జూనియర్ కళాశాలలో, సాంకేతిక కళాశాలలో మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. నేడు నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఆగస్టు 18న మరోమారు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.విద్యార్థులు వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, చిన్న వయసు నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఆరోగ్యవంతమైన నడవడికతో మంచిగా చదువుకోవాలని తెలిపారు. నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అందరు సద్వినియోగం చేసుకోవాలని , తప్పనిసరిగా 19 సంవత్సరాలలోపు వయస్సు కల్గిన ప్రతి ఒక్కరు నివారణ మందులు వేసుకోవాలని అన్నారు. జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని 1నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఒక మాత్ర చొప్పున వేసుకొని పూర్తిగా నమలమని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా. కళావతిబాయి, ఉపాధ్యాయులు, వైద్యాధికారులు, అధికారులు తదితరులు ఉన్నారు.

# విపణి




## ఢిల్లీలో టెస్లా రెండో షోరూం

**అన్నట్లే టెస్లా ముంబైలో తన మొదటి షోరూం ప్రారంభించి.. ఇండియన్ మార్కెట్లో 'మోడల్ వై' ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసింది. ఇప్పుడు ఢిల్లీలో రెండో షోరూమ్ ప్రారంభించింది. భారతదేశంలో రెండవ టెస్లా అవుట్‌లెట్ ఢిల్లీలోని ఏరోసిటీలోని వరల్డ్‌మార్క్ 3 వద్ద ఉంది.**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** టెస్లా ముంబైలో తన మొదటి షోరూం ప్రారంభించి.. ఇండియన్ మార్కెట్లో 'మోడల్ వై' ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసింది. ఇప్పుడు ఢిల్లీలో రెండో షోరూమ్ ప్రారంభించింది. భారత దేశంలో రెండవ టెస్లా అవుట్‌లెట్ ఢిల్లీలోని ఏరో సిటీలోని వరల్డ్‌మార్క్ 3 వద్ద ఉంది. 8,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కొత్త షోరూమ్ వద్ద, నాలుగు సూపర్‌చార్జర్‌లు కూడా ఉన్నాయి. నోయిడా, హోరిజన్ సెంటర్, సాకేత్ వంటి ప్రదేశాలలో సూపర్‌చార్జర్‌లను ఏర్పాటు చేయడానికి కూడా టెస్లా సన్నద్ధమవుతోంది. ముంబై, ఢిల్లీలలో తన షోరూంలను ప్రారంభించిన టెస్లా తన నెట్‌వర్క్‌ను హైదరాబాద్, పూణే, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, జైపూర్ వంటి నగరాలకు కూడా విస్తరించాలని యోచిస్తోంది. టెస్లా మోడల్ వై అనేది.. ప్రస్తుతం భారత మార్కెట్లో అందుబాటులో ఉన్న టెస్లా ఏకైక మోడల్. ఎంట్రీ లెవల్ మోడల్ రియర్-వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు (ఎక్స్-షోరూమ్), లాంగ్ రేంజ్ వెర్షన్ రూ. 67.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. రెండు మోడళ్ల డెలివరీలు 2025 మూడవ త్రైమాసికంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. స్టాండర్డ్ మోడల్ బ్యాటరీతో.. ఒక ఛార్జ్‌పై 500 కిమీ రేంజ్ అందిస్తుంది. కాగా లాంగ్ రేంజ్ వేరియంట్ 75 %ఎౌష్ట్ర% బ్యాటరీ ఒక ఛార్జ్‌పై 622 కిమీ రేంజ్ అందిస్తుంది. రెండు వెర్షన్‌లు దాదాపు 295 హార్స్‌పవర్‌ను ఉత్పత్తి చేసే ఒకే ఎలక్ట్రిక్ మోటారు ద్వారా శక్తిని పొందుతాయి. పర్ఫామెన్స్ విషయానికి వస్తే.. టెస్లా మోడల్ వై బేస్ మోడల్ 5.9 సెకన్లలో 0 నుంచి 100 కిమీ/గం వేగాన్ని అందుకుంటుంది, అయితే లాంగ్ రేంజ్ వెర్షన్ కొన్ని 5.6 సెకన్లలో ఈ వేగాన్ని చేరుకుంటుంది. అయితే వీటి టాప్ స్పీడ్ 201 కిమీ/గం.



## ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ రూ. 50వేలు

### • స్పందించిన ఆర్‌బీఐ గవర్నర్

**జనంసాక్షి:** సేవింగ్స్ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ రూ. 50వేలు ఉండాలని, ఐసీఐసీఐ బ్యాంక్ సంచలన ప్రకటన చేసింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. బ్యాంకుల మినిమమ్ బ్యాలెన్స్ విషయంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ 'సంజయ్ మల్హోత్రా' స్పందించారు. ఒక ఖాతాదారుడు తన ఖాతాలో ఎంత మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ చేయాలనేది పూర్తిగా ఆ బ్యాంకుల పరిధిలోకే వస్తుంది. కొన్ని బ్యాంకులు మినిమమ్ బ్యాలెన్స్‌ను రూ. 50వేలు, మరికొన్ని రూ. 10వేలు, ఇంకొన్ని రూ. 2వేలుగా నిర్ణయించుకున్నాయి. కొన్ని బ్యాంకులైతే మినిమమ్ బ్యాలెన్స్ విషయంలో ఎలాంటి నియమాలను సూచించదు. ఇదంతా సదరు బ్యాంక్ తీసుకునే నిర్ణయమే అని, ఈ అంశం ఆర్‌బీఐ పరిధిలోకి రాదని సంజయ్ మల్హోత్రా గుజరాత్‌లో జరిగిన ఆర్థిక చేరిక సమావేశంలో స్పష్టం చేశారు.


**ఐసీఐసీఐ బ్యాంక్ మినిమమ్ బ్యాలెన్స్**

మెట్రో, పట్టణ శాఖలలోని వినియోగదారులు తమ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ రూ. 50వేలు ఉండేలా చూడాలి. సెమీ అర్బన్ ప్రాంతాలలో వినియోగదారులు తమ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ రూ. 25,000 ఉండేలా చూడాలి. గ్రామీణ ఖాతాదారులు తమ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ రూ. 10,000 ఉంచాలి.



## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**జనంసాక్షి:** సోమవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాలను చవిచూశాయి. సెన్సెక్స్ 746.29 పాయింట్లు లేదా 0.93 శాతం లాభంతో 80,604.08 వద్ద, నిఫ్టీ 198.85 పాయింట్లు లేదా 0.82 శాతం లాభంతో 24,562.15 వద్ద నిలిచాయి. టాప్ గెయినర్స్ జాబితాలో సీఎల్ ఎడ్యుకేట్, యాత్ర ఆన్‌లైన్, మైక్రో ఎలక్ట్రానిక్స్, ఎన్డీఎల్ వెంచర్స్,



ప్రజయ్ ఇంజనీర్స్ సిండికేట్ వంటి కంపెనీలు చేరాగా.. పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, ఫేజ్ త్రీ, ఆరోన్ ఇండస్ట్రీస్, గార్వేర్ హై-టెక్ ఫిల్మ్స్, బెస్ట్ ఆగ్రోలైఫ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

## హాస్టల్ ఫీజు చెల్లిస్తున్నారా?

**జనంసాక్షి:** యూపీఐ చెల్లింపులు ఆన్‌లైన్ లావాదేవీలు చేసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటే.. డబ్బు స్వీకరించేవారికి మాత్రం ఇబ్బందులు తెచ్చి పెడుతుందనే వాదనలున్నాయి. ఇటీవల బెంగళూరులోని వీధివ్యాపారులకు వారి యూపీఐ లావాదేవీల ఆధారంగా జీఎస్టీ నోటీసులు అందడంతో చాలామంది జాగ్రత్త పడుతున్నారు. బెంగళూరులోని ఓ పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహం రెంట్ నగదు రూపంలోనే చెల్లించాలని, ఆన్‌లైన్ లావాదేవీలపై 12 % జీఎస్టీ ఉంటుందని పోస్టర్లు వెలిశాయి. రెడ్డిట్‌లో వెలసిన ఈ పోస్ట్ లోని వివరాల ప్రకారం.. 'అద్దె నగదు రూపంలోనే చెల్లించాలి. ఆన్‌లైన్ పేమెంట్‌పై 12 శాతం జీఎస్టీ ఉంది' అని పీజీ ముందు పోస్టర్ వేసినట్లు ఫోటో తీసి పోస్ట్‌లో అప్‌లోడ్ చేశారు. ఎస్కేడీజీక్ అనే హ్యాండిల్ నుంచి షేర్ చేసిన ఈ పోస్ట్‌కు 31వేల వ్యూస్ వచ్చాయి. దీనిపై నెటిజన్లు విభిన్నంగా స్పంది స్తున్నారు. చాలా మంది నెటిజన్లు ఈ పద్ధతి చట్టవి రుద్ధమని, దర్యాప్తు చేసి కఠినమైన శిక్షలను అమలు చేయాలని అధికారులను కోరారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 4.70 | ₹ 4.72 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్


| ₹ 93,750 (22 క్యారెట్లు) | ₹ 1,02,280 (24 క్యారెట్లు) |
| --- | --- |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,27,000

## నీతా అంబానీ రూ.100 కోట్ల కారు

### దీని స్పెషాలిటీ ఏంటంటే?

**జనంసాక్షి:** భారతీయ కుబేరుడు రిలయన్స్ చైర్మన్ 'ముకేశ్ అంబానీ', వారి కుటుంబం విలాసవంతమైన జీవితం గడుపుతారని అందరికీ తెలుసు. ఈ కారణంగానే వీరు ఖరీదైన బంగ్లాలో నివసిస్తూ.. లగ్జరీ కార్లలో తిరుగుతూ ఉంటారు. ఇప్పటికే లెక్క లేనన్ని కార్లను కలిగి ఉన్న అంబానీ గ్యారేజిలోకి రూ.



100 కోట్ల విలువైన కారు చేరినట్లు తెలిసింది. నీతా అంబానీ రూ. 100 కోట్ల ఖరీదైన 'ఆడి ఏ9 క్యామెలియాన్' సొంతం చేసు కున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని అంబానీ ఫ్యామిలీగానీ, ఆడి కంపెనీ గానీ అధికారికంగా ధ్రువీకరించలేదు. కానీ సోష ల్ మీడియాలో మాత్రం నీతా అంబానీ ఆడి ఏ9 క్యామిలియెన్ కొనుగోలు చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆడి ఏ9 క్యామెలియాన్ పేరుకు తగ్గట్టుగానే ఊసరవెల్లి మాదిరిగా రంగులు మార్చే టెక్నాలజీని కలిగి ఉండటం దీని ప్రత్యేకత. ఈ మోడల్ కార్లు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కేవలం 11 మాత్రమే ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఇది ఎంత అరుదైన కారు అనే విషయం స్పష్టమవుతుంది.

# రతన్ టాటా ఉండి ఉంటే ఇలా జరిగేది కాదు

### బాధిత కుటుంబాలకు సాయం అందడంలో జాప్యంపై అమెరికాకు చెందిన న్యాయవాది మైక్ ఆండ్రూస్ ఆసక్తికర వ్యాఖ్యలు



**జనంసాక్షి:** భారత దేశ చరిత్రలో అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై అత్యంత విషాదకరమైన ఘటనగా నిలిచింది. ఈ ఘటనపై అమెరికా న్యాయవాది ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది జూన్ 12వ తేదీ మధ్యాహ్నం సమయంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ వెళ్లాల్సిన విమానం కొద్దిసెకన్లకే కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో 260 మంది మరణించారు. అందులో 229 మంది ప్రయాణికులు.. 12 మంది సిబ్బంది.. కింద ఉన్న మరో 19 మంది దుర్మరణం పాలయ్యారు. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో బాధిత కుటుంబాలకు సాయం అందడంలో జాప్యంపై అమెరికాకు చెందిన న్యాయవాది మైక్ ఆండ్రూస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాటా కంపెనీ మాజీ చైర్మన్, దివంగత రతన్ టాటా బతికి ఉండి ఉంటే ఇవాళ ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని అన్నారాయన. రతన్ గనుక ఉండి ఉంటే.. బాధిత కుటుంబాలు ఇప్పుడు ఇంతగా ఇబ్బందులు ఎదుర్కొని ఉండేవి కావని అన్నారాయన. ఏఎన్ఐ ఇంటర్వ్యూలో మైక్ ఆండ్రూస్ మాట్లాడుతూ.. "అమెరికాకు రతన్ టాటా అంటే ఏంటో తెలుసు. ఆయన నైతిక విలువలు, ఉద్యోగుల పట్ల ఆయన కనబరిచే శ్రద్ధ, వాళ్ల బాగోగుల గురించి ఆయన చేసే ఆలోచనలు.. వీటి గురించి అమెరికా ప్రజలకు కూడా కొంత తెలుసు. ఒకవేళ ఆయన గనుక ఇవాళ ఉండి ఉంటే.. ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదు. బాధితుల




పట్ల దయగుణం కచ్చితంగా ప్రదర్శించేవారు" అని అన్నారాయన. ప్రమాదంలో మరణించిన 65 కుటుంబాల తరపున పరిహారం కోసం ఆం?డ్రూస్ వాదనలు వినిపిస్తున్నారు. ఈ సందర్భంగా ఒక బాధిత కుటుంబం దీనావస్థను ప్రస్తావిస్తూ.. వయసుపైబడి మంచాన ఉన్న ఓ తల్లి ఒక్కగానొక్క కొడుకు సంపాదన మీదే ఆధారపడి బతుకుతోంది. అలాంటి కొడుకు ఎయిరిండియా ప్రమాదంలో మరణించాడు. ఆమెకు ఇప్పటిదాకా ఎలాంటి పరిహారం అందలేదు. మరి ఇప్పుడు ఆమె వైద్య ఖర్చులను ఎవరు చెల్లిస్తారు? ఆమె పరిస్థితి ఏంటి? అని ఆండ్రూస్ అంటున్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధిత కుటుంబాల కోసం ఓ ట్రస్ట్ నెలకొల్పి కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని టాటా గ్రూప్స్ కు చెందిన ఎయిరిండియా ప్రతిజ్ఞ చేసింది. అలాగే ప్రమాదంలో దెబ్బతిన్న బీజే మెడికల్ కాలేజీ హాస్టల్‌ను తిరిగి నిర్మిస్తామని పేర్కొంది. జులైలో.. తాత్కాలిక పరిహారం కింద రూ. 25 లక్షలను ఎయిరిండియా విడుదల చేసింది. ఆ సొమ్మును 147 విమాన ప్రమాద బాధిత కుటుంబాలకు, విమానం కూలడంతో నేల మీద మరణించి మరో 19 కుటుంబాలకు పరిహారంగా అందజేశారు. ఈ సొమ్మును తుది పరిహారంలో మినహాయిస్తామని కూడా ప్రకటించారు. అయితే పరిహారం అందడంలో జాప్యంతో.. బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు మెట్లు ఎక్కాయి. 2025 జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఎయిర్ ఇండియా %ూ×%171 విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (%ూూ×దీ%) ప్రాథమిక నివేదికను కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖకు సమర్పించింది. అందులో.. ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు టేకాఫ్ తర్వాత సెకన్ పాటు ఆగిపోయాయి, ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. ఇంజిన్లు గాల్లోనే ఆగిపోవడం వల్ల విమానం కుప్పకూలింది. 32 సెకన్లలోనే విమానం క్రాష్‌ల్యాండ్ అయింది. ఆ సమయంలో ఒక పైలట్ ఇంధనం ఎందుకు సిచ్ఛ్ ఆఫ్ చేశావని మరో పైలట్‌ను ప్రశ్నించాడు. నేను ఆఫ్ చేయలేదు అని సమాధానం ఇచ్చాడతను. మేడే కాల్ ఇచ్చిన తర్వాత ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినా.. విమానం అప్పటికే కూలిపోయింది. విమాన ప్రమాదానికి సిస్టమ్‌లో లోపం కారణమైతే, బోయింగ్ కంపెనీపై అమెరికాలో ఉత్పత్తి బాధ్యత కేసు వేయవచ్చని లాయర్ మైక్ ఆండ్రూస్ తెలిపారు. అలాకాని పక్షంలో ఎయిరిండియాదే గనుక బాధ్యత అయితే.. మాంట్రియాల్ కన్వెన్షన్ ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. రెండూ ఉన్నట్లు గనుక తేలితే.. అప్పుడు పరిస్థితి కొంత సంక్లిష్టంగా మారే అవకాశం ఉంటుంది అని అభిప్రాయపడ్డారయన.

## ముఖ్యమైన అంశాలపై వివరంగా చర్చించాం

ఉంది' అని ప్రధాని మోదీ చేసిన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రధాని మోదీతో కీలక అంశాలపై వివరంగా చర్చించినట్లు జెలెన్‌స్కీ సైతం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఉక్రెయిన్ పౌరులకు మద్దతుగా మాట్లాడిన ప్రధాని మోదీకి నా కృతజ్ఞతలు. మా నగరాలు, గ్రామాలే లక్ష్యంగా రష్యా చేపడుతున్న దాడుల గురించి ఆయనకు వివరించా. ఉక్రెయిన్ శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని, అలాగే యుద్ధం ముగింపుకు సంబంధించిన వ్యవహారంలో మా భాగస్వామ్యం కచ్చితంగా ఉండాలని కోరారు. అందుకు భారత్ సానుకూలంగా ఉండటం సంతోషకరం' అని జెలెన్‌స్కీ తెలిపారు. ప్రధాని మోదీ అంతకుముందు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడారు. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని మరోసారి స్పష్టం చేశారు. ఒకవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై ట్రంప్ సుంకాలు విధించారు

## బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు.. మోదీకి చిన్నారి లేఖ





**జనంసాక్షి:** బెంగళూరు మెట్రో ఎల్లో లైన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా'రోడ్డు చాలా దారుణంగా ఉంది. దయచేసి సహాయం చేయండి' అంటూ ఐదేళ్ల చిన్నారి చేతితో రాసిన విజ్ఞప్తి ప్రజల దృష్టిని ఆకర్షించింది . నెట్టింట తీవ్ర చర్చకు దారి దీసింది. బెంగళూరు నివాసి అభిరూప్ కుమార్తె ఆర్య, నగరంలోని దీర్ఘకాలిక ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించమని కోరుతూ ప్రధానమంత్రికి ఒక చిన్న లేఖ రాసింది. "నరేంద్ర మోదీ జీ, ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంది. మేము పాఠశాలకు , కార్యాలయానికి ఆలస్యంగా వెళ్తాము. రోడ్డు చాలా దారుణంగా ఉంది. దయచేసి సహాయం చేయండి" అని ఆమె రాసింది. చిన్నారి లేఖను తండ్రి అభిరూప్ ఎక్స్‌లో షేర్ చేశారు. ప్రధాని బెంగళూరును పర్యటన సందర్భంగా. నా 5 ఏళ్ల అమ్మాయి దీనిని చివరకు ట్రాఫిక్‌ను సరిదిద్దే అవకాశంగా భావిస్తోంది" అని క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఈ పోస్ట్ త్వరగా వైరల్ అయింది, నాలుగు లక్షలకు పైగా వీక్షణలు వచ్చాయి. దీంతో నెటిజన్లు కూడా ఆమె మద్దతుగా స్పందించారు. మరికొంతమంది బెంగళూరు ట్రాఫిక్ కష్టాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "కోరమంగళ నుండి ఇందిరానగర్ వరకు ఉన్న రోడ్ల కారణంగా అధ్వాన్నం. అటునుంచి వెళ్లాలంటేదాదాపు చచ్చినంత పని.. నేను రూ. 3 లక్షలు ఆదాయపు పన్ను చెల్లిస్తాను. అయినా మనకు లభించేది యమపురికి దారుల్లాంటి రోడ్లు అంటూ మండిపడ్డారు. మరోవైపు ఒక యూజర్ ముంబైలో శబ్ద కాలుష్యం గురించి 15 సంవత్సరాల క్రితం తన కుమార్తె రాసిన లేఖను గుర్తు చేసుకున్నారు. ఆగస్టు 11 నుండి ఉదయం 6:30 గంటలకు బెంగళూరు మెట్రో ఎల్లో లైన్ ప్యాసింజర్ సర్వీసులు ప్రారంభమైనాయి. కర్ణాటక మెట్రో ప్రాజెక్టు నిధులలో 87శాతం అందిస్తుందని,చ, 2030 నాటికి బెంగళూరులో 220 కి.మీ నెట్‌వర్క్ పూర్తవుతుందని సీఎం సిద్ధరామయ్య హామీ ఇచ్చారు.

## నాకు కొడుకే కావాలి..

### ఏడాది కుమార్తెకు విషమిచ్చి ప్రాణం తీసిన తండ్రి

**అగర్తల(జనంసాక్షి):** కొడుకులకన్నా కూతురు నయం అనుకునే ఈ రోజుల్లో ఆడపిల్లలపై ఇంకా వివక్ష ఇంకా కొనసాగుతోంది. తాజాగా ఓ తండ్రి తన కుమార్తెకు విషం ఇచ్చి హత్య చేసిన ఘటన..విషాద వాస్తవానికి నిదర్శనంగా నిలుస్తోంది. త్రిపుర రాష్ట్రం ఖోవై జిల్లా బేహలాబారి గ్రామంలో దారుణం జరిగింది. త్రిపురా స్టేట్ రైఫిల్స్‌కు చెందిన జవాన్ రతీంద్ర దేవ్‌బర్మా తన ఏడాది కుమార్తెను విషమిచ్చి హత్య చేశారు. అయితే,తండ్రి విషం ఇవ్వడంతో చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చిన్నారిని అత్యవసర చికిత్స నిమిత్తం త్రిపురా రాజధాని అగర్తల జీబీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ చిన్నారి కన్నుమూసినట్లు వైద్యులు నిర్ధారించారు. నిందితుడు రతీంద్ర దేవ్ బర్మా త్రిపురా స్టేట్ రైఫిల్స్ పదోవ బెటాలియన్ తరుపున ఏడీసీ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా.. అతడిని పోలీసులు అదుపులోకి



తీసుకున్నారు. ప్రస్తుతం రతీంద్రదేవ్‌ను కోర్టు మూడు రోజుల రిమాండ్ విధించింది. కుమార్తె మరణంపై గుండెలవిసేలా రోధిస్తున్న తల్లి మిథాలీ.. తన భర్త రతీంద్రదేవ్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది. కుమార్తెకు బిస్కెట్లు కొనుక్కునే నెపంతో తమ కూతురు సుహాని దేవ్ బర్మా విషం తినిపించాడని ఆరోపించింది. తన భర్తకి ఎప్పుడూ కుమారులే కావాలి. ఇద్దరు కూతుళ్లకు జన్మనిచ్చినందుకు తనను నిరంతరం ద్వేషిస్తుండేవారని వాపోయింది. మేం బెహలబరిలోని నా సోదరి ఇంటికి వెళ్తున్నాము. అప్పుడు నా భర్త.. నా కుమార్తెను, నా సోదరి కొడుకుకు బిస్కెట్లు కొనిచ్చేందుకు సమీపంలోని దుకాణానికి తీసుకెళ్లాడు.

## పెట్రోల్ పంపుల ఏర్పాటు ఇకపై మరింత సులువు?

**జనంసాక్షి:** ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, దేశ క్లీన్ ఎనర్జీ పరివర్తనను ముందుకు తీసుకెళ్లడానికి విధానపరమైన చర్యల్లో మార్పులు చేయాలని భారత ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా పెట్రోల్ పంపుల ఏర్పాటుకు లైసెన్సింగ్ నిబంధనలను సులభతరం చేయడానికి సిద్ధమవుతోంది. ఇంధన రిటైల్ మార్కెట్‌ను వైవిధ్యపరచడానికి, పోటీని పెంపొందించడానికి, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడానికి విస్తృత వ్యూహంలో భాగంగా ఈమేరకు చర్యలు తీసుకుంటోంది. 2019లో ప్రవేశపెట్టిన ఇంధన రిటైల్ ఆథరైజేషన్ నిబంధనలను పునసమీక్షించడానికి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ సుఖ్మల్ జైన్



నేతృత్వంలో నలుగురు సభ్యుల నిపుణుల కమిటీని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. అభివృద్ధి చెందుతున్న ఇంధన ప్రాధాన్యతలను ప్రతిబింబించే సవరణలను సూచించేలా కమిటీ ప్రస్తుత రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను సమీక్షిస్తోంది. పారదర్శకత, సమగ్రతను నిర్ధారించడానికి మంత్రిత్వ శాఖ ఈ ప్రక్రియ కోసం ప్రజల అభిప్రా యాల కు కూడా కోరుతోంది. ఆగస్టు 6న జారీ చేసిన అధికారిక నోటీసు ప్రకారం 14 రోజుల్లోగా వాటాదారులు, పౌరులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని తెలిపింది. ఇంధన రిటైల్ లైసెన్సింగ్ నిబంధనలను చివరిసారిగా 2019లో ప్రభుత్వం సవరించింది. ఇది ప్రభుత్వ చమురు మార్కెటింగ్ కంపెనీలకు అనుకూలంగా ఉన్న కొన్ని ఆంక్షల్లో మార్పులు చేసింది. సవరించిన ఫ్రేమ్‌వర్క్ ప్రకారం చమురుయేతర సంస్థలు, గ్లోబల్ ఎనర్జీ సంస్థలు దేశీయ ఇంధన రిటైల్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి అనుమతించింది. రిటైల్ లైసెన్స్ కోసం కంపెనీలు రూ. 250 కోట్ల నికర విలువ కలిగి ఉండాలి. రిటైల్ ం బల్క్ మార్కెటింగ్ కోసం రూ. 500 కోట్లు నికర విలువ కలిగి ఉండాలి. ప్రత్యామ్నాయ ఇంధన మార్కెట్ కోసం సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, జీవ ఇంధనాలు(బయో ఫ్యూయెల్స్) లేదా ఈవీ ఛార్జింగ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు 3 సంవత్సరాలలోపు ఏర్పాటు చేయాలి. కొత్త కంపెనీలు దేశంలో కనీసం 100 రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయాలి. అందులో గ్రామీణ ప్రాంతాలకు కనీసం 5% కేటాయించాలి. 2019లో మార్పులు చేయకముందు రిటైల్ లైసెన్స్ కోసం అర్హత సాధించడానికి కంపెనీలు అప్‌స్ట్రీమ్ ఆయిల్ లేదా గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కనీసం రూ. 2,000 కోట్లు పెట్టుబడి పెట్టాల్సి ఉండేది. ఇది కొత్త కంపెనీలకు సవాలుగా మారింది. దాంతో ఈ విభాగంలో మార్కెటింగ్ కోసం ఎక్కువ కంపెనీలు ముందుకు రాలేకపోయాయి. ఫలితంగా 2019లో కొన్ని సంస్కరణలు తీసుకొచ్చారు. తాజాగా వాటిలో కూడా కొన్ని మార్పులు చేయాలని కమిటీ ఏర్పాటు చేశారు. వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థకు, జనాభాకు వీలుగా దేశవ్యాప్తంగా 97,000కు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంధన మార్కెట్‌కు ఇది ఉదాహరణ. దేశీయ డిమాండ్ పెరుగుతున్న కొద్దీ, ఇంధన రిటైలర్ల సంఖ్యను పెంచుతూ వారి సర్వీసులను వైవిధ్యపరచాల్సి ఉంది. అందుకు అడ్డంకులను తగ్గించడానికి, సరఫరా గొలుసులను పెంచడానికి కొన్ని మార్పులు అవసరమని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. భారతదేశం దీర్ఘకాలిక డీకార్బనైజేషన్ లక్ష్యాలకు అనుగుణంగా కొత్త సమీక్షలో మార్పులు చేయనున్నారు. ఇంధన రిటైల్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా, ముఖ్యంగా సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, జీవ ఇంధనాలు, ఈవీ ఛార్జింగ్ కోసం క్లీన్ ఎనర్జీ పరివర్తనను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త నిబంధనలు విస్తృత శ్రేణి దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఆకర్షిస్తాయని భావిస్తున్నారు.



# ప్రతిపక్షమా.. పాలక పక్షమా!?

## మంత్రి పదవి కోసం బ్లాక్ మెయిల్

- మంత్రి పదవిపై ఉన్న సోయి.. నియోజకవర్గ అభివృద్ధిపై లేదు
- రాజగోపాల్ రెడ్డి నాన్ లోకల్.. మునుగోడుపై ప్రేమ లేదు
- మంత్రిని, ఎంపీని నియోజకవర్గానికి రాకుండా అడ్డుకుంటూరు
- మంత్రి పదవి, కాంట్రాక్టులు ఇవ్వనందుకే అసమ్మతి రాగం
- నా ప్రాంతం వెనుకబడుతోంది కాబట్టే మళ్లీ ప్రజల్లో తిరుగుతున్న
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లమల్ల కృష్ణారెడ్డి గరంగరం

**మర్రిగూడ, ఆగస్టు 11 (జనం సాక్షి) :**
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి మీద ఉన్న సోయి మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిపై లేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లమల్ల కృష్ణారెడ్డి అన్నారు, సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పూర్తిగా విఫ్లమయ్యారని ఎద్దేవ చేశారు.మునుగోడు నియోజకవర్గ ప్రజలకు తాను అభివృద్ధి చేసింది ఏమాత్రం లేదని గత ఉప ఎన్నికల్లో 18 వేల కోట్ల కాంట్రాక్టర్ నిధుల కోసమే బిజెపిలో చేరిన విషయాన్ని చలమల కృష్ణారెడ్డి గుర్తు చేశారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శిం చడం ప్రతిపక్షమా.... పాలక పక్షమా ....అనే విధంగా విస్మయపరిచే విధం గా మంత్రి పదవి కోసం బ్లాక్ మెయిల్ చేయడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన సూచించారు.ఉప ఎన్నికల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం 176 కోట్లు విడుదల చేసిన నిధులు ఇప్పటికీ నియోజకవర్గంలో పనులు ఆనిధులతోటే సాగుతున్నాయని ఆయన తెలిపారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శించడం ప్రతిపక్షమా.... పాలక పక్షమా ....అనే విధం



గా విస్మయపరిచే విధంగా మంత్రి పదవి కోసం బ్లాక్ మెయిల్ చేయడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెండు నరసింహారెడ్డి, వెన్నమనేని సుధాకర్ రావు, చిట్యాల రంగారెడ్డి, నరసింహ, మాధగోని కృష్ణయ్య, బండి అనంతం శ్రీను నాయక్, సిరిపంగి శ్రీనివాస్, కొట్టం శ్రీనివాస్, ఖదీర్, జీవన్, ఎండి ఇబ్రహీం, యాదయ్య, కర్నాటి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.






# కరీంనగర్‌లో పిసిఓడి, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లోని హెల్త్ క్లబ్ మరియు మహిళా సాధికారత విభాగం సంయుక్తంగా సోమవారం కళాశాల ఆడిటోరియంలో పిసిఓడి (పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్), రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజి రెడ్డి, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ మరియు అదనపు కంట్రోలర్ డాక్టర్ రజనీ దేవి అధ్యక్షత వహించారు. ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. కల్పన, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ నజియా రెహమాన్, అతిథి వక్త డాక్టర్ రజనీ ప్రియదర్శిని ఎమ్ఎస్ (ఒబిజి), ఎఆర్టి స్పెషలిస్ట్ (క్లీవ్‌ల్యాండ్ అక్రిడిటేషన్, యు.ఎస్.ఎ), రజనీ ఫెర్టిలిటీ సెంటర్ వ్యవస్థాపకు రాలు, రెనీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ రజనీ ప్రియదర్శిని పిసిఓడి యొక్క కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలపై వివరణాత్మక సెషన్‌ను అందించారు. పిసిఓడి నిర్వహణలో ముందస్తు రోగ నిర్ధారణ, జీవనశైలి మార్పుల ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు. హార్మోన్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సమతుల్య ఆహారం, శారీరక శ్రమ, ఒత్తిడి నిర్వహణ యొక్క పాత్రను ఆమె వివరించారు. రుతుక్రమ పరిశుభ్రత గురించి మాట్లాడుతూ, శానిటరీ ఉత్పత్తులను సకాలంలో మార్చడం, వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడుకోవడం, శ్వాసక్రియకు అనుకూలమైన బట్టలు ధరించడం, సింథటిక్ పదార్థాల వాడకాన్ని తగ్గించడం వంటి ఆచరణాత్మక సూచనలను ఆమె అందించారు. అధిక జంక్ ఫుడ్, చక్కెర పదార్థాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలను నివారించాలని, తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, తగినంత నీటిని ఆహారంలో చేర్చుకోవాలని డాక్టర్ రజనీ సూచించారు. మహిళల ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవడం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆమె హైలైట్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక సభ్యులు చురుకుగా పాల్గొని, ఇంటరాక్టివ్ ప్రశ్నోత్తర సెషన్‌లో డాక్టర్ రజనీతో సంభాషించారు. మహిళల పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో డాక్టర్ రజనీ చేసిన కృషిని కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

# గంజాయిపై ఉక్కు పాదం

### గోదావరిఖని ఏసిపి మడత రమేష్

### గంజాయి రవాణా చేస్తున్న యువకులను పట్టుకున్న పోలీసులు

**మంథని, (జనంసాక్షి) :** గంజాయి రవాణా పై ఉక్కు పాదం మోపుతామని గోదావరిఖని ఏసిపి మరత రమేష్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని లో గంజాయి తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఇందులో ఇద్దరు మైనర్లు కాగా ముగ్గురు యువకులు ఉన్నారు. మహారాష్ట్ర లోని సిర్వోంచ నుండి ముగ్గురు యువకులు, మంథని చెందిన మరో ఇద్దరు మైనర్ యువకులను ప్రోత్సహించి గంజాయి రవాణా చేపిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు మంథని మండలం ఎక్లాస్పూర్ గాడుదలగండి గుట్టపై మాటు వేసి ద్విచక్ర వాహనం పై 2.23 కిలోల గంజాయిని తరలిస్తుండగా మైనర్ బాలురను పట్టుకొని విచారించగా గంజాయి ముటాగుట్టు రట్టయింది, వారి వద్ద నుండి ఒక ద్విచక్రవాహనం, రెండు కత్తులు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఏసిపి తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసిపి రమేష్ మాట్లాడుతూ..ఈ కేసులో మైనర్లు మారణాయుధాలతో, అక్రమ గంజాయి రవాణా చేయడం కొత్తగా ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలపై రోజులో కొన్ని నిమిషాలైనా పిల్లల కోసం కేటాయించి వారిని అదుపులో ఉంచుకోవాలని లేదు ఎడల వారి పిల్లల ప్రవర్తనపై తమకు సమాచారం అందిస్తే ఆ పిల్లలను కౌన్సిలింగ్ నిర్వహించి చెడు అలవాట్లకు దూరంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో గోదావరిఖని టూ టౌన్ సిఐ ప్రసాద్ రావు, మంథని ఎస్సై రమేష్ పాల్గొన్నారు.



# సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి) :**వేములవాడ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతిపై సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు,పలు ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కలికోట నుండి కుడి,ఎడమ కాల్వల నిర్మాణ పనులు, మల్కాపేట రిజర్వాయర్ ఎడమకాలువ కోసం భూ సేకరణ,వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి ప్రోజెక్టు పనులు,కోనరావుపేట మండల పరిధిలోని లచ్చాపేట తండా రిజర్వాయర్ కాలువ పనులు, చందుర్తి మండల పరిధిలోని ఆశిరెడ్డిపల్లి కొచ్చేరువు,సనుగుల ఎర్ర చెరువు పటేల్ చెరువులోకి నిటితో నింపే ఏర్పాట్ల అంశాలపై అధికారులకు ఆయన చర్చించారు. ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని,రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ,ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు.రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించడంతో పాటు,వ్యవసాయ ఉత్పాదకత పెరగడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అధికారుల నుండి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీఈ సుధాకర్ రెడ్డి,ఈఈ సంతు ప్రకాష్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిది ఆగస్టు 11 (జనం సాక్షి) :**
వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే తగిన బుద్ధిచెప్తామని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్, డిమాండ్ చేశారు.ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలని,వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే తగిన బుద్ధిచెప్తామని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్, రామారెడ్డి మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్, మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలో భాగంగా భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని హామీ హామీ ఇచ్చి విస్మరించారని, మాట నిలబెట్టుకోకుంటే తగిన బుద్ధి చెప్తాం అని వారు హేచ్చరించారు. వ్యవసాయ కూలీలు వ్యసాయరంగంలో యాంత్రికరణ, బీహార్ లాంటి రాష్ట్రాల నుంచి వలస కూలీల వల్ల ఉపాధి కోల్పోయి పొట్ట గడవని స్థితికి చేరుకున్నారన్నారు. చేతిలో పని లేక అర్ధాకరితో అలమటిస్తున్నారని అన్నారు. తమ హామీని తామే నిలబెట్టుకోకుంటే ఎలా




అని వారు ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికులు ఉపాధి కరువై అన్నమో రామచంద్ర అనాల్సిన దుస్థితి నెలకొన్నది అన్నారు. వ్యవసాయ కూలీల కొంతమందికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని, అలా చేస్తే టిఆర్ఎస్‌లో పట్టిన గతే కాంగ్రెస్ పడుతుంద న్నారు. ఇప్పటికైనా తాత్సారం చేయకుండా వెంటనే అమలుకు పూనుకోవా లన్నారు. కాలయాపన చేయకుండా ప్రతి వ్యవసాయ కూలికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయల అమలుచేసి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈజీఎస్ కింద 20 రోజులు పని చేసిన వారికే ఇస్తామనడం సబబు కాదన్నారు. నిబంధనలు షరతులు లేకుండా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ జిల్లా కోశాధికారి యస్ కిషోర్, ఏఐయు కేఎస్ కోశాధికారి వెంకన్న, మండల నాయకులు కే గోపాల్, సాయిబాబా, గ్రామ కమిటీ సభ్యులు రాజేష్, కల్పనా, శశికళ, బలరాం, రాజనార్సు, బి రాజు, నారాయణ, దుర్గయ్య పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ప్రభుత్వ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):**
కామారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్తులపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత వివరాలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విద్యుత్ మరియు రెడ్కో శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఇంజనీరింగ్ శాఖ కార్యాలయాలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌ల ద్వారా విద్యుత్ ఉత్పాదనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్తుల వివరాలను సేకరించాలని, మండల స్థాయిలో ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ ఏఈలు ఆయా భవనాలను సందర్శించి, సూర్యరశ్మి పడే ప్రాంతాలను జాగ్రత్తగా కొలిచి, వాటి వివరాలను సేకరించాలని ఆదేశించారు. అలాగే, ఈ సంస్థలలో విద్యుత్ వినియోగం వివరాలను సేకరించి త్వరగా సమర్పించాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శివకుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ చర్యలు జిల్లాలో సౌర విద్యుత్ ఉత్పాదనను పెంచి, స్థిరమైన శక్తి వనరులను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టబడుతున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

# జగిత్యాల డీపీవో చీకోటి మదన్ మోహన్‌పై చర్యలు తీసుకోవాలని బుగ్గారం వాసుల డిమాండ్

**జగిత్యాల, ఆగస్టు 11 (జనంసాక్షి):** జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) చీకోటి మదన్ మోహన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుగ్గారం గ్రామ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ, డీపీవో చట్టాలను ఉల్లంఘిస్తూ, లోకాయుక్త తీర్పు, కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలను, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ విధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు, వీడీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, వీడీసీ కోర్ కమిటి వైస్ చైర్మన్ పెద్దనవేని రాగన్న ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఎనిమిది నెలలుగా బుగ్గారం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినప్పటికీ, దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా డీపీవో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయం నుండి జారీ అయిన ఉత్తర్వులు, సమాచార హక్కు చట్టం దరఖాస్తులు, అప్పీల్స్, ఇతర ఫిర్యాదులను కూడా పట్టించుకోకుండా బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు. బుగ్గారం గ్రామ పంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడిన దోషులతో కుమ్మక్కై, వారిని కాపాడుతూ కేసులు నమోదు చేయకుండా చీకోటి మదన్ మోహన్ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు చేశారు.

# విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

**గంభీరావుపేట ఆగస్టు 11(జనం సాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగము, జంతు శాస్త్ర విభాగము, మరియు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. 19 సంవత్సరాల వయసుగల విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు అందజేశారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి మందులు అత్యంత ఆవశ్యకమైన వని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు. 160 మంది విద్యార్థులకు నులిపురుగుల( ఆల్బెండజోల్) మాత్రలు అందజేశారు. ఈ మాత్రలను వేసుకున్నట్లయితే జీర్ణ వ్యవస్థలో ఉండే నులిపురుగులను క్రమంగా తీసివేసి ఆరోగ్యమైన జీర్ణవ్యవస్థను ఉంచి మంచి ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. ఎం.ప్రభాకర్ ఎన్ఎస్ఎస్పిఓ పాక ధర్మపురి,కోఆర్డినేటర్ డాక్టర్. వై ఆంజనేయులు, కోఆర్డినేటర్ వి. వాణి. డాక్టర్ ఆదివిష్ణు డాక్టర్. కె. వి. బిక్షమయ్య, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఏఎన్ఎం విజయ,ఆశా వర్కర్లు జ్యోతి, రాణి,సుజాత మనోహర్, శ్రీనివాస్, మహేష్,జగన్నాథం, శైలజ,దీపిక,రమ్య తదితర అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# ‘బీసీ కదన భేరి’ పేరిట భారీ బహిరంగ సభ

- ఈనెల 14న కరీంనగర్ సభ .. హాజరుకానున్న కేటీఆర్
- బీసీలకు అవకాశాలిచ్చింది కేసీఆరే : గంగుల కమలాకర్
- కాంగ్రెస్ బూటకపు హామీలు: తలసాని శ్రీనివాస్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి) :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఈనెల 14న కరీంనగర్‌లో ‘బీసీ కదన భేరి’ పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. బీసీలకు అవకాశాలిచ్చింది కేసీఆరే అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పుడు మోసపూరిత నాటకాలు ఆడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ప్రధానిని, రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించారా? అని ప్రశ్నించారు. వంద మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ‘బీసీలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించింది, ఆర్టీసీ చైర్మన్‌గా, హైదరాబాద్ మేయర్‌గా బీసీలకే అవకాశం ఇచ్చింది కేసీఆర్’ అని గుర్తుచేశారు. మంత్రులుగా బీసీలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చింది గత ప్రభుత్వమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ తరపున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

### కాంగ్రెస్ బూటకపు హామీలు..

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ... తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కేవలం ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. కుల గణన, 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావిడి చేసి ఇప్పుడు ఏమీ చేయడం లేదని ఆరోపించారు. సీఎం



రేవంత్‌రెడ్డి బీసీల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు గురుకులాలు ఏర్పాటు చేసి, కులవత్తులకు వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు.

### బీసీల గొంతు నొక్కే కుట్ర..

శాసనమండలి పక్ష నేత మధుసూదనచారి మాట్లాడుతూ... బీసీల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీలకు న్యాయం జరగాలంటే తమిళనాడు తరహాలో పోరాడాలని తాము కాంగ్రెస్‌కు సూచించినట్లు చెప్పారు. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడమే ఏకైక మార్గమని చెప్పారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బీసీల సంఖ్యను తక్కువగా చూపారని విమర్శించారు. కేంద్రానికి పంపిన ఆర్డినెన్స్ ముసాయిదాలో రాజకీయ రిజర్వేషన్ల అంశం మాత్రమే ఉందని, విద్య, వైద్యం వంటి ఇతర రంగాలను కావాలనే విస్మరించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బీసీల రిజర్వేషన్లు పెంచితే కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్న విషయం ప్రజలకు తెలుసని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనచారి, బండ ప్రకాష్, ఎల్.రమణ, మాజీ చీఫ్ విప్ దాస్యం వినరు భాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కష్ణమోహన్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్‌బాబు, విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు బండ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, కరీంనగర్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణ రావు, సిరిసిల్ల బీఆర్ఎస్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ.. ఆదుకోండి

- ప్రభుత్వ సహాయం కోరిన నిరుపేద కుటుంబం
- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



**రాయికల్ ఆగస్టు 11(జనం సాక్షి):** కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వం ఆదుకోవాలని రాయికల్ పట్టణానికి చెందిన అనసూయ, ఆమె భర్త జాంగిరి ఇటీవల గుండెపోటుతో మరణించారు. సంవత్సరం క్రితం మా కొడుకు కూడా ప్రమాదం కారణంగా చనిపోయాడు. ప్రస్తుతం మా కుటుంబంలో ఆమెకు పెళ్లి కావాల్సిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మాకు స్వంతంగా ఇల్లు లేదు. మా దగ్గర కులం సర్టిఫికేట్ లేదు. జీవనోపాధి కోసం ఎలాంటి వనరులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.

### ఇంట్లో పని చేసే మగదిక్కు కూడా లేదు

ఈ కష్టకాలంలో మా కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నాము.మీ దయ, సహాయం మా కుటుంబాన్ని తిరిగి నిలబెట్టడానికి ఎంతో తోడ్పడుతుంది. అందువల్ల మా కుటుంబానికి తగిన సహాయం అందించగలరని ముఖ్యంగా నివసించడానికి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సోమవారం రోజున ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది.



# ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**మంథని, (జనంసాక్షి) :** ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని 7వ తరగతి పిల్లల ఇంగ్లీష్ రీడింగ్ స్కిల్స్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. పిల్లలకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యా ప్రమాణాల పెంపు పై దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకోవడం కూడా రావాలని ఆ దిశగా మన బోధన ఉండాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో గేట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి అందించాలని, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట హెడ్మాస్టర్ నరసింహా రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బట్లర్ ఇంట్లో తీవ్ర విషాదం

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి జాన్ బట్లర్ కన్నుమూశారు. ఈ విషయాన్ని జోస్ బట్లర్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్వయంగా వెల్లడించాడు. "రెస్ట్ ఇన్ పీస్ డాడ్.. థాంక్యూ ఫర్ ఎవ్రీథింగ్" అని జోస్ బట్లర్ తన తండ్రితో కలిసి దిగిన ఫోటోను పోస్ట్ చేశాడు. తన తండ్రితో కలిసి వన్డే వరల్డ్ కప్ ట్రోఫీని పట్టుకున్న ఫోటోను జోస్ బట్లర్ షేర్ చేశాడు. అయితే తన తండ్రి మృతికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. కాగా.. జాన్ బట్లర్ ఆత్మకు శాంతి కలగాలని.. జోస్ బట్లర్ కుటుంబం ధైర్యంగా ఉండాలని కాంక్షిస్తూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఈ విషాద సమయంలో కూడా జోస్ బట్లర్ ది హండ్రెడ్ టోర్నీలో తన జట్టు అయిన మాంచెస్టర్ ఒరిజినల్స్ తరఫున ఆడారు. జోస్ బట్లర్ తండ్రికి నివాళిగా జట్టు సభ్యులందరూ బ్లాక్ ఆర్మ్ బ్యాండ్‌లు ధరించారు. ఈ మ్యాచ్ లో నాలుగు బంతులను ఎదుర్కొన్న జోస్ బట్లర్ ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు.

## ఏళ్ల తరబడి భారత్ మెరుగ్గా రాణిస్తున్నా..

భారత మహిళల జట్టుకు తొలిసారిగా వన్డే ప్రపంచ కప్ గెలిచేందుకు సువర్ణావకాశం లభించింది. మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్ 2025కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. సొంత గడ్డపై జరగనున్న ఈ టోర్నమెంట్‌లో తొలిసారి ఐసీసీ టైటిల్ సాధించాలని భారత మహిళా క్రికెట్ జట్టు కలలు కంటోంది. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అభిమానులకు ఒక మెసేజ్ ఇచ్చారు. ఈసారి కప్ కచ్చితంగా కొడతామని దేశప్రజలు చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఆ కలను నిజం చేస్తామని ఆమె చెప్పారు. మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగనుంది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి 50 రోజుల కౌంట్‌డౌన్ ప్రారంభోత్సవంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడారు. "సొంత ప్రేక్షకుల ముందు ఆడడం ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఈసారి మా జట్టు కప్ గెలవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది.

# యశ్ దయాల్‌పై నిషేధం విధింపు



ఆర్సీబీ స్టార్ బౌలర్ యశ్ దయాల్‌ను ఇప్పుడు కష్టాలు చుట్టుముట్టాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ట్రోఫీ అందించడంలో కీలక పాత్ర పోషించిన యశ్ దయాల్ తన ఆటతో అందరినీ ఆకట్టుకున్నాడు. కానీ ఇప్పుడు యశ్ దయాల్ కెరీర్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం కనిపిస్తోంది. యశ్ దయాల్‌పై లైంగిక దాడి ఆరోపణలు రావడంతో ఒక కీలక లీగ్ నుంచి అతడిని నిషేధించారు. యశ్ దయాల్ తనపై వచ్చిన లైంగిక ఆరోపణల కారణంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో అతడిని ఒక కీలక లీగ్ నుంచి నిషేధించారు. ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్(%ఖూజాూ%) అతడిని రాబోయే యూపీ టీ20 లీగ్ నుంచి నిషేధించింది. యశ్ దయాల్‌పై 17 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు రాగా.. యూపీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో అతని క్రికెట్ కెరీర్‌కు ప్రమాదం ఏర్పడింది. ఈ నిర్ణయం వల్ల యూపీ టీ20 లీగ్‌లో గోరఖ్‌పూర్ లయన్స్ జట్టు యశ్ దయాల్‌ను రూ. 7 లక్షలకు కొనుగోలు చేసినప్పటికీ, ఈ సీజన్‌లో అతను ఆడలేదు. యశ్ దయాళ్‌పై జైపూర్‌లోని సాంగనేర్ సదర్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు నమోదైంది. ఈ కేసులో రాజస్థాన్ హైకోర్టు నుంచి అతనికి ఎలాంటి ఉపశమనం లభించలేదు. ఇది మైనర్‌కు సంబంధించిన కేసు కాబట్టి, అతని అరెస్టుపై స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 22న జరగనుంది. కోర్టు నుండి ఉపశమనం లభించకపోవడంతో యశ్ అరెస్టుకు అవకాశాలు పెరిగాయి. వాస్తవానికి యశ్ దయాల్‌పై లైంగిక వేధింపులు రావడం ఇది రెండోసారి. గతంలో ఘజియాబాద్‌కు చెందిన ఒక మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించాడని ఆరోపణలు వచ్చాయి. ఆ కేసులో అలహాబాద్ హైకోర్టు యశ్ దయాల్ అరెస్టుపై స్టే విధించింది. కానీ ఇప్పుడు జైపూర్‌లో నమోదైన కొత్త కేసు యశ్ దయాల్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. ఇదిలా ఉండగా.. యశ్ దయాల్ ఇటీవల ఐపీఎల్ 2025ల ఆర్సీబీ తరఫున మంచి ప్రదర్శన చేసి 15 మ్యాచ్‌లలో 13 వికెట్లు పడగొట్టి జట్టు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే యశ్ దయాల్‌పై వచ్చిన ఈ తీవ్రమైన ఆరోపణల కారణంగా అతని భవిష్యత్తు ప్రస్తుతం అనిశ్చితిలో ఉంది.

### రైతులకు యూరియా కూడా అందించలేని
# స్థితిలో ప్రభుత్వం ఉంది

- ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లేక ఇబ్బందులు పడుతున్న రైతులు
- యూరియా సమస్యపై ఎప్పటిలోగా పరిష్కరిస్తారో ప్రభుత్వ విప్ స్పష్టతనివ్వాలి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి) :** రైతులకు సాగు నీటిని అందించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, కష్టపడి పంటలు సాగు చేసిన అన్నదాతలకు యూరియా కూడా సకాలంలో సరఫరా చేయలేని దుర్భాగ్య స్థితిలో ఉందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెలకొన్న యూరియా కొరతను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, పంటల వివరాలను సేకరించి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రైతులు గంటల తరబడి యూరియా కోసం క్యూలలో నిలబడాల్సి వచ్చిందని, ఈ నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గత నాలుగైదు రోజులుగా రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు, యూరియా కోసం నానా ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టించుకోకపోవడం బాధాకరమని విమర్శించారు. ఆయన సొంత గ్రామం రుద్రంగిలో రైతులు పది గంటల పాటు యూరియా కోసం నిరీక్షించినా విప్ స్పందించలేదని ఆరోపించారు. యూరియా కొరతను పరిష్కరించేందుకు విప్, జిల్లా అధికారులు కలెక్టర్‌తో సమావేశమై చర్చించి, సరఫరా వివరాలు, కొరతకు కారణాలను పరిశీలించి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడా లేని విధంగా వేములవాడ నియోజకవర్గంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, చందుర్తి, సనుగుల సొసైటీల వద్ద పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ జరగడం దీనికి నిదర్శనమని ఆయన తెలిపారు. వందలాది రైతులు, ముఖ్యంగా మహిళలు, పనులను వదిలిపెట్టి గంటల తరబడి క్యూలలో నిలబడి యూరియా కోసం నిరీక్షించడం సమైక్యాంధ్ర రోజులను తలపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీటి కొరతతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు యూరియా సరఫరా చేయకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఈ వివక్షను బీఆర్ఎస్ సహించబోదని ఆయన స్పష్టం చేశారు. తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. యూరియా కొరత సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో విప్ యుద్ధప్రాతిపదికన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేములవాడ నియోజకవర్గంలోని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వాన్ని నిలదీస్తామని, రైతుల సమస్యలపై సర్కార్ స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల అవసరాలకు సరిపడేలా యూరియా ఎప్పటిలోగా సరఫరా చేస్తారో స్పష్టంగా చెప్పాలని చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు.

# పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు వద్దు
### శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది డిమాండ్



**ముంబై, ఆగస్టు 11 (జనంసాక్షి):** ఆసియా కప్‌లో జరగనున్న భారత్–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌పై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్‌తో క్రికెట్ సంబంధాలను పునరాలోచించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. ఒకవైపు పాకిస్తాన్ నిరంతరం భారత్‌ను బెదిరిస్తుంటే, మరోవైపు క్రికెట్ ఆడటానికి సిద్ధమవడం ద్వంద్వ వైఖరి అని ఆమె ప్రశ్నించారు. "ఇకపై పాకిస్తాన్‌తో ఎటువంటి మ్యాచ్‌లు ఆడబోమని స్పష్టంగా చెప్పలేమా?" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ "పాకిస్తాన్ మునిగితే సగం ప్రపంచాన్ని ముంచేస్తుంది" అని చేసిన ప్రకటనను ఆమె డొల్ల బెదిరింపుగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యల్లో నిజం లేదని, భారత వైమానిక దళం ఆపరేషన్ సిందూర్ ద్వారా ఇప్పటికే పాకిస్తాన్‌కు సమాధానం చెప్పిందని ఆమె తెలిపారు. అమెరికా నుంచి అణుయుద్ధ బెదిరింపులు చేస్తున్న పాకిస్తాన్‌తో క్రికెట్ గురించి మాట్లాడటం దేశ ప్రజలకు అన్యాయమని, స్పష్టమైన విధానంతో అన్ని సంబంధాలను పునరాలోచించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ఇండియా కూటమి నాయకులను సమావేశానికి పిలవడంపై స్పందిస్తూ, ఇది బలవంతపు నిర్ణయమని, ప్రతిపక్షం ప్రజల ఓటింగ్ హక్కుల కోసం పోరాడుతున్నప్పటికీ, ఎన్నికల సంఘం, ప్రభుత్వం కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయని ఆమె ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలు కీలకమైనవని, ఆయన మీడియాలో ఆధారాలతో వాస్తవాలను సమర్పించినప్పటికీ, అఫిడవిట్ కోరడం ప్రతిపక్ష గొంతును నొక్కే ప్రయత్నమని ఆమె అన్నారు. ఆరోగ్య సేవల బలోపేతంపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రకటనను స్వాగతిస్తూ, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తొలగించి సామాన్యులకు ఉపశమనం కలిగించాలని, విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం గట్టిగా పనిచేయాలని ఆమె కోరారు. పాకిస్తాన్ బెదిరింపుల నేపథ్యంలో క్రీడలు ఆడటం అవసరమా అని ప్రశ్నిస్తూ, దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రామగుండంలో చెత్త, నిషేధిత
# ప్లాస్టిక్ వినియోగంపై జరిమానా
### కమిషనర్ అరుణశ్రీ ఆదేశాలు



**గోదావరిఖని, ఆగస్టు 11 (జనంసాక్షి):** బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడం, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించడం వంటి చర్యలపై జరిమానా విధించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసి) మరియు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు, నీటి సరఫరా సిబ్బంది, మెప్మా సిబ్బంది, వార్డు అధికారులతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బందితో జరిగిన సమావేశంలో, రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేసి అపరిశుభ్రతకు కారణమయ్యేవారిపై జరిమానా వసూలు చేయాలని, ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో పూడిక తీత, స్ప్రే, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులను నియమిత షెడ్యూల్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, స్వచ్ఛ ఆటోలు రోజుకు రెండుసార్లు డంపింగ్ యార్డ్‌కు వెళ్లేలా, వాహనాలు మంచి స్థితిలో ఉండేలా చూడాలని సూచించారు. ఆరోగ్య శాఖతో సమన్వయంతో జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. నీటి సరఫరా విభాగంతో జరిగిన సమావేశంలో, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతు చేయాలని, నిర్ణీత వేళల్లో ఒకే సమయంలో నీటి సరఫరా జరిగేలా చూడాలని, ఒకే ఇంటికి రెండు నల్లా కనెక్షన్లు ఉంటే ఒకటి తొలగించాలని, శవసక్రియ ట్యాంకుల ఆవరణను పరిశుభ్రంగా ఉంచి మొక్కలు నాటాలని సూచించారు. మెప్మా సిబ్బందితో సమావేశంలో, 18 ఏళ్లు నిండిన నిరుపేద మహిళలను గుర్తించి కొత్త స్వశక్తి సంఘాలు, సమాఖ్యలు ఏర్పాటు చేయాలని, వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పీఎం స్వనిధి పథకం ద్వారా అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించాలని, రుణాల రికవరీలో సహకరించి నాన్–పెర్ఫార్మింగ్ అసెట్స్‌ను శూన్యం చేయాలని, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు స్వశక్తి మహిళలను ప్రోత్సహించాలని ఆదేశించారు. వార్డు అధికారులతో సమావేశంలో, ఇంటి పన్నులు, లైసెన్స్ రుసుముల చెల్లింపులో వినియోగదారులను చైతన్యపరచాలని, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశాల్లో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ తదితరులు పాల్గొన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది రామ్‌నగర్‌లో పరిశుభ్రత, తడి–పొడి చెత్త వేరుచేయడంపై అవగాహన కల్పించారు. డీఆర్‌సీసీ, కంపోస్ట్ యార్డ్, డంపింగ్ యార్డ్‌లను సందర్శించి, అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# దసరా పండగల డిప్యూటేషన్

దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు పల్లెలు గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని చరిత్రలో వ్రాసుకున్న మహనీయుల మాటలు పుస్తకాలకే పరిమితం అవుతున్నాయి కానీ ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన గ్రామీణ పేద విద్యార్థుల భవిష్యత్తు మాత్రం మారడం లేదు అందుకే తరగతి గదిలో దేశ భవిష్యత్తు నిర్ణయించబడుతుందనే మాటలనుండి అదే తరగతి గదిలో దేశ భవిష్యత్తు తాకట్టు పెట్టేవరకు కొందరు ఉపాధ్యాయుల పనితీరు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది...

## ఇక ఉపాధ్యాయులకు పండుగే పండుగ

- ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి
- పల్లెలు వదిలి పట్టణాల బాట పడుతున్న ఉపాధ్యాయులు
- గ్రామీణ ప్రాంతాల్లో చదువు చెప్పడానికి విముఖత చూపనీ వైనం



F THE DIRECTOR, SCHOOL EDUCATION, ELANGANA, HYDERABAD

Adjustment of Surplus Teachers to Needy Schools Authorizing District Collectors – Further guidelines

The committee is instructed to implement the stage-wise measures as mentioned in the reference 3d cited, for identifying surplus teachers and deploying/positioning them to needy schools.

(III) The committee shall ensure the following while identifying surplus teachers and deploying/positioning them to needy schools:

i. Teachers working in Tribal Areas shall not be adjusted to schools in plain areas; adjustments must be confined within the Tribal Area itself. However, in the event of a teacher deficit in Tribal Areas, teachers from plain areas may be deputed to Tribal area schools, following the same order of preference as prescribed.

ii. Teachers who are junior in the cadre (as per seniority) should be identified as surplus during the process.

iii. Under no circumstances shall teachers be deputed on work adjustment to schools on a mutual basis (e.g., A to B and B to A), triangular basis (e.g., A to B, B to C and C to A) or other similar arrangement.

iv. The Teachers who are adjusted and assigned to a new school under these orders must report to the new school by 13.06.2025 and begin their duties there.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** విద్యార్థులకు ఎంతో కొంత లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రొసీడింగ్ (1267)జీవో ఎంఎస్ (25) జీవో ఎంఎస్ (5) ను కొందరు ఉపాధ్యాయులు తమ రాజకీయ పలుకుబడితో విద్యాశాఖ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కుతున్నారు ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో టీచర్లు ఉన్న దగ్గర పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాల నుండి తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలల నుండి ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవో పూర్తిగా దుర్వినియోగం అవుతుండడం పై అటు ఉపాధ్యాయ సంఘాలు ఇటు విద్యార్థి సంఘాలు కొందరు ఉపాధ్యాయుల, విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు ముఖ్యంగా హైదరాబాదు రంగారెడ్డి మేడ్చల్ శివారులలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఉపాధ్యాయులు విద్యను బోధించడానికి ఉవ్విలూరుతుంటారు దానికి తోడు (హెచ్ఆర్ఏ) ఇంటిఅద్దె కూడా ఎక్కువ మొత్తంలో రావడంతో హైదరాబాదు రంగారెడ్డి మేడ్చల్ ఉపాధ్యాయులకు దసరా దీపావళి లాంటివి ఇక రంగారెడ్డి జిల్లా శివారులో ఉన్న గ్రామీణ గిరిజన మారుమూల ప్రాంతాల నుండి ఇప్పటికే రాజకీయ పలుకుబడితో డిప్యూటేషన్లతో పట్టణాలకు వెళ్లిన ఉపాధ్యాయులు తిరిగి ఆ ప్రభుత్వ పాఠశాలలకు రాకపోవడం విద్యార్థులకు విద్యను పూర్తిగా నష్టం కలిగిస్తుందని అక్రమ డిప్యూటేషన్లను వెంటనే ప్రభుత్వం రద్దు చెయ్యాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని జిల్లేడు చౌదర్ గూడ మండలంలోని వివిధ గ్రామాలకు గిరిజన ప్రాంతాలకు వెళ్లాలంటే ఉపాధ్యాయులు అబ్బో అంత దూరమా మేము వెళ్లలేము అంటూ పైరవీలు కొనసాగిస్తుంటారు జిల్లేడు చౌదర్ గూడా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇప్పటికే ముగ్గురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పై వెళ్ళారు 384 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాల నుండి ముగ్గురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో విద్యార్థులకు చదువు బోధించడానికి ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారు విద్యార్థులు ఇక ఫరూక్ నగర్ మండలం వెల్జర్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి ఇద్దరు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పై వెళ్లడంతో అక్కడ విద్యార్థులకు నష్టం జరుగుతుంది ఇక లెక్కలేని పైరవీలు ఇప్పటికే మొదలుపెట్టారు ఉపాధ్యాయులు (డీఎస్సీ) డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుండి డిప్యూటేషన్ల లెటర్లు తీసుకొని డిప్యూటేషన్ పై వెళ్తున్నారు ఉపాధ్యాయులు జీతాలు మాత్రం గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్నట్టు తీసుకుంటూ విధులు మాత్రం పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు ఉపాధ్యాయులు దీంతో గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులు తమ చదువును నష్టపోతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు స్పందించి అక్రమ డిప్యూటేషన్లను రద్దుచేసి పేద విద్యార్థులకు విద్యను అందించాలని ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి
#### టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావరవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఉపాధ్యాయులు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులకు విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు డిప్యూటేషన్ల పేరుతో పల్లెలు వదిలి పట్టణాలకు పైరవీల పేరుతో వస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని బడి దొంగల భరతం పట్టాలన్నారు...

ప్రతి సంవత్సరం క్రికెట్‌లో కొత్త రికార్డులు నమోదవుతూనే ఉంటాయి, కానీ కొన్ని రికార్డులు బద్దలు కొట్టడం దాదాపు అసాధ్యం అని చెప్పవచ్చు. అందులో సచిన్ టెండూల్కర్ 100 సెంచరీల రికార్డు కూడా ఒకటి. కోహ్లీ సచిన్ శత సెంచరీల రికార్డును ఈజీగా బద్దలుకొడతారని అన్నారు.

# పదవ తరగతిలో యధావిధిగా ఇంటర్నల్ మార్కులు

- రాత పరీక్షకు 80 మార్కులు
- ఉత్తర్వులు వెల్లడించిన విద్యాశాఖ




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి) :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మార్కుల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ప్రతి సబ్జెక్టులో పరీక్షకు 80 మార్కులు ఉండగా వారికి ఇంటర్నల్ మార్కులు 20 నిర్ణయించారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్న ల్ మార్కులను తీసివేసి రాత పరీక్షకు వంద మార్కులు కేటాయిస్తూ విద్యార్థు లు ప్రతిభను గుర్తించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది.

ప్రస్తుత విద్యా సంవత్సరం మధ్యలో మార్కుల విధానాన్ని మార్పు చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వ్యతిరేకించడంతో గత విద్యా సంవత్సరం లాగ ఇంటర్నల్ మార్కులను కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ సోమవారం ప్రకటించింది. విద్యా సంవత్సర ప్రారంభం నుండి ఇంటర్నల్ మార్కులు ఉండవనే కోణంలో విద్య బోధన జరుగుతుంది. కానీ జాతీయ విద్యా విధానంలో ఉన్న మార్కుల విధానాన్ని కొనసాగించాలన్న క్రమంలో ఇంటర్నల్ మార్కులను గతంలో మాదిరిగా యధావిధిగా కొనసాగించనున్నట్లు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు 6 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి చదువుతున్నట్లు సమాచారం.

**ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం..**

ఇంటర్నల్ మార్కులను కేటాయించడంలో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టరాజ్యాంగ కొనసాగిస్తున్నట్టుగా విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ప్రతిభ ద్వారా మార్కులు కేటాయిస్తున్నారని, ప్రవేట్ పాఠశాలలలో మాత్రం ర్యాంకుల కోసం అందరికీ 20 మార్కులను కేటాయించే విధానాలను అవలంబిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇంటర్నల్ మార్కులను తొలగించాలని గత ఏడాది విద్యాశాఖ అధికారులు నిర్ణయించినప్పటికీ మళ్లీ పాత పద్ధతిలోనే ఇంటర్నల్ మార్కులను కేటాయింపులు చేయాలని ఉత్తర్వులు రావడం జరిగింది.

# నాలాల ఆక్రమణలను తొలగించండి
### హైడ్రా ప్రజావాణికి 51 ఫిర్యాదులు

**హైదరాబాద్, ఆగస్టు 11:**
వర్షాల వేళ నాలాల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వరద ముంచెత్తే రహదారులు, కాలనీల చిత్రాలతో పాటు.. నాలాల ఆక్రమణలను ఫిర్యాదుదారులు కళ్లకు కట్టారు. ఆక్రమణలు చిన్నవైనా.. వరదకు ఆటంకం కలిగినప్పుడు సమస్య తీవ్రంగా పరిగణిస్తోందని పలువురు వాపోతున్నారు. కుండపోతగా వర్షం పడుతున్నప్పుడు వరద నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోందని ఇదే సమయం.. వరదను చూసి నాలా ఆక్రమణలను తొలగించాలని పలువురు ఫిర్యాదులో పేర్కొంటున్నారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు వస్తే.. అందులో 70 శాతం వరకూ నాలా ఆక్రమణలపైనే ఉన్నాయి. వరద కాలువలెక్కడా.. వాస్తవ వెడల్పు లేవని.. కొన్ని చోట్ల నాలుగు వంతుల్లో 3 వంతుల వరకూ కబ్జాలకు గురయ్యాయని పేర్కొన్నారు. హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్. అశోక్ కుమార్ గారు ఫిర్యాదులను పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్ ద్వారా వాస్తవ పరిస్థితిని తెలుసుకుని సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.




**ఫిర్యాదులు ఇలా..:**

- పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని బార్కాస్ సలాలా ప్రాంతంలోని నాలా మీద ఇల్లు కట్టేశారు. దీంతో ప్రతి ఏటా వరద ముప్పు ఎదుర్కోవాల్సి వస్తోందని అక్కడి నివాసితులు చిత్రాలతో అక్కడి తీవ్రతను కళ్లకు కట్టారు. ఈ ఆక్రమణలను తొలగిస్తే మూడు బస్తీలకు వరద ముప్పు తప్పుతుందని పేర్కొన్నారు.
- మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కీసర మండలం నాగారం విలేజ్‌లో పార్కులకు, ప్రజావసరాలకు ఉద్దేశించిన 12000 గజాల స్థలాలు కబ్జాలకు గురౌతున్నాయని.. వెంటనే వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాపాడాలని హెచ్ ఎంటీ బేరింగ్స్ నగర్ నివాసితులు కోరారు. ఇందులో రహదారులు, పార్కులున్నాయని పేర్కొన్నారు.
- రంగారెడ్డి జిల్లా బాలాపూర్ ఏఆర్‌సీఐ రోడ్డులోని ఆర్చిడ్ రెసిడెన్సీ సమీపంలోని పెద్ద చెరువు నాలా కబ్జాలకు గురవ్వడంతో మా ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయని అక్కడి ఆర్చిడ్ రెసిడెన్షియల్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పురా మండలం బీరంగూడలోని వందనపురి కాలనీ ఫేజ్–1లో 20 అడుగుల రహదారిని 10 అడుగుల మేర ఎదురుగా ఉన్న ప్లాట్ యజమానులు కబ్జా చేశారంటూ స్థానికులు పిర్యదు చేశారు. రోడ్డు ఆక్రమణలను తొలగించి లే ఔట్ ప్రకారం కాపాడాలంటూ కోరారు.
- రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఉప్పరపల్లిలోని ఎస్ ఆర్ సదన్ జీకే అవెన్యూ సమీపంలోని పార్కులోకి మురుగు నీరు వచ్చి చేరుతోందని.. దీంతో పార్కులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నాలా ఆక్రమణలకు గురైందని.. దీంతో మురుగు పొంగి పార్కులోకి వస్తోందన్నారు.
- అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్‌లో నాలాను ఆక్రమించి ఇల్లు నిర్మించేయడం వల్ల.. వరద సాఫీగా సాగడంలేదని.. దీంతో వరద మా ప్రాంతాలను ముంచెత్తుతోందని ఆయా ప్రాంతాల నివాసితులు హైడ్రా ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
12 ఆగస్టు 2025

# అన్ని జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీల ఏర్పాటు

- కష్టపడే రైతన్నే అదృష్టవంతుడు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వ్యవసాయాన్ని పండుగగా మారుస్తున్నాం : మంత్రి సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 11(జనంసాక్షి) :** ఫామ్ ఆయిల్ పంటను సాగు చేస్తున్న రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఫామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అరుకాలం కష్టపడి పలు పంటలను సాగు చేస్తున్న రైతులే అదృష్టవంతులని రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం, చేనేతలు, వస్త్రాలు శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామపంచాయతీ శివారులో 12 ఎకరాల స్థలంలో కేవెన్ బయోసైన్స్ కంపెనీ వారు ఏర్పాటు చేస్తున్న ఫామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆయిల్ ఫేడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాషా, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ములుగు జిల్లా ఇప్పటికే పర్యాటక ప్రాంతంగా ఎంతగానో అభివృద్ధి చెందిందని, సాగునీరు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయానికి అనుకూలంగా మారిందని అన్నారు. సమ్మక్క సారలమ్మ, కాకతీయ రాజులు తిరిగిన ఈ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందని, ములుగు జిల్లా అభివృద్ధి కావడానికి మంత్రి సీతక్క ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. మంత్రి సీతక్క అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏది అడిగినా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారని తెలిపారు. రైతులు తమకు ఉన్న భూములలో కొంత భాగాన్ని ఫామాయిల్ మొక్కల పెంపకం కేటాయించాలని, మొక్క నాటిన అనంతరం మూడు సంవత్సరాల తరవాత రైతుల ఇండ్లలో సిరులు కురిపిస్తుందని అన్నారు. జిల్లాలో కనీసం పదివేల ఎకరాలలో ఫామాయిల్ మొక్కలు పెంచడానికి జిల్లా యంత్రాంగం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన కర్రే గుట్టల ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరువ చూపుతున్నదని వివరించారు. ఫామ్ ఆయిల్ గింజలను పండిస్తున్న రైతులకు ప్రస్తుతం టన్నుకు 18 వేల 52 రూపాయలు ఉండగా రైతులకు గిట్టుబాటు కలిగే విధంగా 25 వేలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీ పనులను రానున్న ఉగాది లోపు పూర్తి చేసి ప్రారంభిస్తామని అన్నారు. ములుగు జిల్లా వ్యవసాయ పంటల సాగుకు అనుకూలంగా భూములు ఉన్నాయని, రైతు పలు రకాల పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఫామ్ ఆయిల్ పంట సాగుకు రైతన్నకు కష్టం తక్కువగా ఉండి ఎక్కువ లాభం చేకూరుతుందని, ప్రతి రైతు ఈ పంట సాగు కోసం ప్రయత్నించాలని సూచించారు. జిల్లాలోని రైతులు గతంలో వరి, పత్తి పంట సాగు చేయడానికే ఆసక్తి కనపరిచారని, ప్రస్తుతం ఫామాయిల్ పంట సాగు చేయడానికి ముందుకు రావడం ఆశించదగ్గ విషయమని అన్నారు. ఈ పంట ద్వారా పచ్చదనంతో పరిసర ప్రాంతాలు ఉండడంతో పాటు ప్రతి సంవత్సరం లక్ష రూపాయల ఆదాయం పొందే అవకాశం రైతులకు దక్కుతుందని, 200 రూపాయలకు లభించే మొక్కను రాష్ట్ర ప్రభుత్వం 25 రూపాయలకే రైతులకు అందిస్తున్నదని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ఎంత ఎక్కువ పంట సాగు చేస్తే, అంత త్వరగా ఆర్థికంగా స్థిరపడగలరు. ఒకసారి పంట పూర్తయ్యాక, కంపెనీలు ఆ పంటను నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేస్తారని అన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, కే ఎన్ బయోసైన్స్ కంపెనీ ఎండి సుధా రెడ్డి, జిల్లా, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సారూ! కాపాడండి మహాప్రభో

- కొడుకూ కోడలే కాలయములయ్యారు
- ఆస్తి లాక్కున్నారు.. లేని ఎయిడ్స్ ఉందని నెపం పెట్టి గెంటేశారు
- గద్వాల కలెక్టర్ ఎదుట వృద్ధురాలి ఆవేదన



**గద్వాల జిల్లా (జనంసాక్షి) :** ఆస్తులు లాగేశారు! అవసరం తీరాక కొడుకూ కోడలే కాలయములయ్యారు. కంటికి పాపల కాపాడుకుంటారని ఆస్తినంతా కొడుకూ కోడలు రాసిందా వృద్ధురాలు. అయితే ఆస్తి దక్కినంక ఆమెతో ఆ కొడుకూ కోడలుకు ఆమెతో అవసరం తీరిపోయింది. దీంతో ఆమెను వీధిలోకి గెంటేశారు. అంతేకాక ఎయిడ్స్ ఉందని ప్రచారం చేశారు. తనకు ఏ జబ్బూ లేదని ఆ వృద్ధురాలు ఎంతో వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఆ వృద్ధురాలు కలెక్టర్‌ను ఆశ్రయించింది. ఎవరూ తనను చేరదీయకుండా చేశారని ప్రజావాణిలో తనను కాపాడాలంటూ దీనంగా వేడుకుంది. ఈ ఘటన గద్వాల జిల్లాలో సోమవారం జరిగింది.

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డెపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ(80) సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కె.మోహన్‌రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌కు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో.. తన రెండో కుమారుడు, కోడలు చిన్న ఇస్మాయిల్, సాభేరాభాను తనను బాగా చూసుకుంటానని నమ్మబలికి ఇంటికి తీసుకెళ్లాడని, రామాపురం శివారులోని కోడలు సాబేరా భాను పేరున 4-26 ఎకరాలను, జూలకల్ శివారులో కొడుకు చిన్న ఇస్మాయిల్ పేరున 2-03 ఎకరాలను, కోడలు సాబేరా భాను పేరున 2-03 ఎకరాలను శాంతినగర్ తహసీల్దార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ చేయించుకున్నారని, ఆస్తి రిజిస్ట్రేషన్ అనంతరం తన బాగోగులు చూడటం లేదని, మానసికంగా కృంగదీశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు అంటరాని రోగం ఉందని, కనీసం తనకు ఎవరూ మంచినీరు కూడా ఇవ్వకుండా చేశారని పేర్కొన్నారు. ఆధార్ కార్డు లాక్కున్నారని, ఎవరినీ సంప్రదించకుండా తన ఫోన్ లాక్ చేసి పెట్టారని తెలిపారు. తనకు తెలియకుండా తులంన్నర బంగారాన్ని తీసుకున్నారని, సేవింగ్ అకౌంట్‌లోని డబ్బులను తనను వెంటతీసుకెళ్లి డ్రా చేసుకున్నారని, తనకు డబ్బులు ఇవ్వలేదని తెలిపారు.

కావున తన ఫిర్యాదును విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు. తన పేరున రిజిస్ట్రేషన్ అయిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి మళ్లీ తన పేరున భూమి నమోదు చేయాలని, తన ఇంటిలో వారు ఉండకుండా తన శేష జీవితం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సదరు కోడలు, కుమారునిపై తగు చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



# దేశంలో ప్రజాస్వామ్యం లేదు

- రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారు
- ఇండియా కూటమి ఎంపీల అరెస్టుపై ఎంపీ మల్లు రవి ఆగ్రహం



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఈసీని కలవడానికి ప్రయత్నించిన ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఖండించారు. మోదీ, బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు ఇది పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు తమను అడ్డుకున్నా.. 140 కోట్ల మందికి దేశంలో ఏం జరుగుతుందో తెలిసిందన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'త్వరలో బీహార్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సమయంలో ఓట్ల చోరీ ఇష్యూ చర్చనీయాంశంగా మారింది. దీని గురించి కాంగ్రెస్ సహా.. ఇండియా కూటమి ఎంపీలు ఎలక్షన్ కమిషన్‌ను కలవాలని ప్రయత్నించారు. పార్లమెంట్ నుంచి కొంచెం దూరం రాగానే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే కూర్చొని ఆందోళన చేపట్టాం. ఈ సమయంలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు' అని ఎంపీ మల్లు రవి వివరించారు. 'మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ లోక్ సభ స్టార్ట్ అయ్యింది. మమ్మల్ని సభలోకి అనుమతించలేదు. గట్టిగా ప్రశ్నించడంతో.. సభలోకి అనుమతించారు. ఓట్ల చోరీ గురించి ప్రశ్నిస్తే.. సభ వాయిదా వేస్తున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంపై చర్చకు పట్టుబట్టాం. కానీ మోదీ ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా లేదు. కీలకమైన అంశాలపైనా చర్చలు జరపడం లేదు. కనీసం జీరో అవర్‌లో ప్రశ్నలు అడిగే అవకాశం కూడా ఇవ్వడం లేదు. ఎలాంటి చర్చ లేకుండానే కీలక బిల్లులను ఆమోదిస్తున్నారు.' ఎంపీ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పార్లమెంట్ జరగకుండా మోదీ ప్లాన్ చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం చేసే పనులను 140 కోట్ల మంది గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెప్తారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించక తప్పదు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే.. దేశంలో ప్రజాస్వామ్యం బతుకుతుంది. మోదీ, బీజేపీ, ఢిల్లీ పోలీసులు మమ్మల్ని ఎలక్షన్ కమిషన్ దగ్గరకు వెళ్లకుండా ఆపగలిగారు. కానీ.. మా పోరాటం 140 కోట్ల మంది ప్రజలకు తెలిసింది. రాహుల్ గాంధీ పోరాటంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది' అని ఎంపీ డాక్టర్ మల్లు రవి వ్యాఖ్యానించారు.

# మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనపై బ్యాంకులకే స్వేచ్ఛ

- ఈ వ్యవహారం ఆర్‌బిఐ పరిధిలో లేదు : గవర్నర్ మల్హోత్రా

**గాంధీనగర్, ఆగస్ట్11 (జనంసాక్షి) :** బ్యాంకులో ఖాతాదారుల అకౌంట్స్‌లో మినిమమ్ బ్యాలెన్స్ నిబంధన అన్నది ఆయా బ్యాంకులకున్న స్వేచ్ఛ అని, ఇందులో ఆర్‌బిఐ జోక్యం ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాల్లోని కనీస నిల్వల అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని చెప్పారు. దీనిపై ఆర్‌బీఐ నియంత్రణ ఏదీ ఉండదని పేర్కొన్నారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న వేళ గుజరాత్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమం పాల్గొన్న సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కనీస సగటు- బ్యాలెన్స్ ఎంత ఉండాలి అనే నిర్ణయం ఆర్‌బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10వేలు నిర్ణయిస్తాయి. మరికొన్ని రూ.2 వేలు ఉంచుతాయి. కొన్ని కనీస బ్యాలెన్స్ నిబంధనను ఎత్తివేశాయి. ఈ అంశం ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తుండగా, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు షాకిచ్చింది. సేవింగ్స్ అకౌంట్లోల కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే ఇది వర్తించనుంది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్లు కనీసం రూ.50,000 నిల్వ ఉంచాలి. గతంలో ఈ మొత్తం రూ.10,000గా ఉండేది. ఇప్పుడు ఏకంగా 5 రెట్లు- పెంచేసింది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ.5,000 నుంచి రూ.25,000కు, గ్రామీణ ఖాతాదార్లకు రూ.2,500 నుంచి రూ.10,000కు సవరించింది. కనీస నిల్వ లేనిపక్షంలో ఛార్జీలు కనీస నిల్వకు ఎంత తక్కువ మొత్తం ఉంటు-ందో దానిపై 6 శాతం లేదా రూ.500 ఏది తక్కువైతే అది చెల్లించాల్సి ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. అయితే దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఔటర్‌పై వాహనం ఢీకొని ముగ్గురు కార్మికుల మృతి

**హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకుంది. ఔటర్‌పై పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. మృతులు ఒడిశాకు చెందిన నారాయ(28), చెక్‌మోహన్(24), జైరామ్(32)గా గుర్తించారు. గాజువాక నుంచి సెల్‌ఫోన్ టవర్ సామగ్రితో వాహనం షామీర్‌పేట్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు- తెలుస్తోంది. వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు- గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

## 84,58,366 మంది చిన్నారులకు అల్బండజోల్

- మాత్రలు పంపిణీ చేసిన ఆరోగ్యశాఖ..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** 84,58,366 మంది చిన్నారులకు అల్బండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. మొత్తం 96 లక్షల టార్గెట్‌లో తొలిరోజే 89 శాతం మంది చిన్నారులకు మాత్రల పంపిణీ పంపిణీ చేసినట్టు పేర్కొంది. ఈ నెల 18వ తేదీ వరకూ స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో కొనసాగనున్న మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావులేకుండా, తొలిరోజే 85.58 లక్షల మంది చిన్నారులకు ఆల్బండజోల్ పంపిణీ చేసిన ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. మిగిలిన పిల్లలు కూడా తప్పనిసరిగా మాత్ర తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. 1-19 ఏండ్ల పిల్లలకు తప్పనిసరిగా ఆల్బండజోల్ మాత్ర వేయించాలని మరోసారి ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

## పాతపద్ధతిలోనే పదోతరగతి పరీక్షలు

**హైదరాబాద్, ఆగస్ట్11 (జనంసాక్షి) :** పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్కంఠకు విద్యాశాఖ తెరదించింది. పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు- వెల్లడించింది. ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వం జివో జారీ చేసింది. అయితే ఇటీ-వలే ఢిల్లీలోని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తాయి. దీంతో విద్యాశాఖ అధికారులు పునరాలోచనలో పడ్డారు. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూశారు. దీంతో పాత విధానాన్నే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాత విధానం ప్రకారమే 20 శాతం ఇంటర్నల్ మార్కులు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# దేశం తీవ్ర సంక్షోభంలో పడింది

- ప్రజలు మహోద్యమం నిర్మించాలి
- తీవ్రంగా నష్టపోయిన మహబూబ్ నగర్
- ఈ ఉద్యమంలో ముందునిలవాలి
- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశం, దేశంలోని రాష్ట్రాలు ప్రభుత్వాలు మునుపు ఎన్నడూ లేనంతగా అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, అప్పుల వడ్డీల చెల్లింపుల కోసం ప్రజల మీద పన్నులు, అధిక ధరలు మోపి దోచుకుంటున్నారు. అందువల్ల కార్పొరేట్ సంస్థల ఆదాయాలు పెరిగి పోతున్నాయని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి తెలిపారు. పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కోల్పోయి రోడ్డున పడ్డారని, చిన్న చిన్న వేతనాలతో కుటుంబాలు గడుపు కోలేక కష్టాలు, నష్టాలు తప్పక దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, విద్యార్థులు,నిరుద్యోగులు ఈ సంక్షోభం కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కమాటలోచెప్పాలంటే దేశంలో ఎవ్వరూ శాంతిగా లేరని తెలిపారు. నిజమైన శాంతి కోసం, ప్రజల గౌరవ ప్రద జీవనం కోసం, దోపిడీ వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నష్ట పోతున్న నిర్వాసితులకు న్యాయంకోసం పోరాటాలు చేస్తున్న సంఘాల మీద, వ్యక్తుల మీద అనేక తప్పుడు కేసులు పెట్టి అరెస్టుచేసి జైలుకు పంపుతున్నారని, కోర్టుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారు. ఇంత తీవ్ర సంక్షోభం, నిర్బంధ పరిస్థితులు మునుపు ఎన్నడూ లేవని తెలిపారు. దేశంలో మెజారిటీ రాష్ట్రాలలో భాజపా పాలన ఉందని, డబుల్ ఇంజన్ సర్కారులుఏ చిన్న సమస్య కూడా పరిష్కారం చేయ లేక పోయాయని తెలిపారు. ప్రతి పక్ష పార్టీలు ప్రజాహిత , పర్యావరణ పరిరక్షణ హిత విధానాలు రూపొందించి అమలు చేయలేక పోతున్నారు. దోపిడీ విధానాల ను అరికట్టేందుకుచర్యలు తీసుకో లేక భావ దారిద్ర్యంలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల ఓట్లను ఎన్నికల సంఘం ద్వారా కేంద్ర ప్రభుత్వం దొంగ తనం చేస్తున్న విషయం బయటకు వచ్చిందని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం సంఘ పరివారం అండతో పని చేస్తున్నదని, సంఘ పరివారం సంస్థలు దేశంలో పెరిగిపోతున్న అవినీతిని చర్చకు రాకుండా చూస్తోందని తెలిపారు. ఇలా ఎవరికి వారు అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్న కారణంగా దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా వంటి ప్రదేశాల సమస్యలు పరిష్కారంకావడం లేదన్నారు. ఈ విధమైన పాలన దుర్మార్గం వల్లనే దేశంలో స్త్రీలపై అత్యాచారం, దళితులు, ఆదివాసీల పై హింస, వారి ఆస్తుల దురాక్రమణ పెరిగింది. మహబూబ్ నగర్ జిల్లా అంతటా ఈ ఆక్రమణలు పెరిగి పోయాయి. ప్రజలను విడగొట్టు తున్నారన్నారు. స్థానిక సమస్యలుపరిష్కరించాలని, దేశంలో నెలకొన్న సంక్షోభం నివారణ కావాలని ఎక్కడి వారు అక్కడ పెద్ద ఎత్తున ఆందోళనలు , ఉద్యమాలు చేపట్టాలని, అందరం కలిసికట్టుగా ఆ ఉద్యమాలలో పాల్గొని దేశ భవిష్యత్తును కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించలేదు

- ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ తోడు దొంగలు
- సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శి అశోక్

**గోదావరిఖని (జనంసాక్షి) :** సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదని సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శి అశోక్ తెలిపారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, టీజీబీకేఎస్ సంఘాలు కార్మికులను మోసగిస్తున్నాయని పేర్కొన్నారు. యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని, సింగరేణిలో జనరల్ అసెంబ్లీ ఎన్నికలలో శుష్క వాగ్దానాలు చేసి మభ్యపెట్టి కోల్ బెల్ట్‌లో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇంత వరకు ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. తదనంతరం సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో సర్కార్ సంఘంగా ఐఎన్‌టీయూసీ, ఎర్రజెండా పోరాటాల సంఘంగా ఏఐటీయూసీ పోటీలు పడి కార్మికులకు ఎన్నో వాగ్దానాలను చేసి ఆదాయ పన్ను రద్దు చేపిస్తామని, కార్మికులకు సొంత ఇంటి కల నెరవేరుస్తామని ప్రైవేటీకరణను అడ్డుకొని కొత్త గనులు తీసుకువస్తామని విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తామని, అనారోగ్యాలతో అన్ ఫిట్ అయ్యే మైనింగ్ టెక్నికల్ స్టాఫ్, ట్రాక్ మెన్ లకు వేతనంబీ క్యాటగిరి నష్టం జరగకుండా సర్ఫేస్ లో సూటబుల్ జాబ్స్ ఇప్పిస్తామని, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇప్పించి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నో వాగ్దానాలతో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచాయని తెలిపారు. ఇప్పుడు యాజమాన్యంతో కుమ్మక్కై రాత్రి అలాయ్-బలాయ్: పగలు ఆరోపణ-ప్రత్యారోపణలు చేసుకుంటూ రెండు సంఘాల నాయకులు సీతారామయ్య, జనక్ ప్రసాద్ లు కార్మిక వర్గాన్ని మోసం చేస్తూ నీకిది, నాకది అని అవినీతి వాటాదారులు, తోడుదొంగలుగా మారి సింగరేణి వ్యాప్తంగా భజనపరులను, అనుచరులను ఏర్పాటుచేసుకొని పరిగె ఏరుకునే అవసరాన్ని కల్పించి కార్మిక వర్గాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆరోపించారు. నాయకుల అవినీతి అరాచకాలను ప్రోత్సాహిస్తూ కొంతమంది అధికారులు గనుల స్థాయి, ఏరియా స్థాయి నుండి కార్పోరేట్ స్థాయి వరకు తామేమి తక్కువ కాదని అవినీతి అక్రమాలకూ పాల్పడుతూ సంస్థకు ద్రోహం చేస్తూ కార్మికుల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని తెలిపారు. సింగరేణిలో గతంలో కంటే నేడు అధికారుల విచ్చలవిడితనం, దోపిడీ పీడన పెట్రేగి తారాస్థాయికి చేరుకుందని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెందిన కొత్త బొగ్గు గనులను తీసుకువచ్చే యోచన మాని యాజమాన్యం పాలకులు యాక్షన్ లో పాల్గొంటామంటూ ప్రభుత్వరంగ సంస్థ సింగరేణికి పరోక్షంగా నష్టం చేస్తూ పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే కేంద్ర ప్రభుత్వ రంగ ఎత్తుగడలకు దొడ్డిదారిలో సహకరించే ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. తోడుదొంగలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ దళారీ దొంగ నాయకులను కార్మికులు నిలదీస్తూ తన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కోల్ బెల్ట్ ఎంపీలు పార్లమెంట్ లో ఆదాయ పన్ను రద్దుకై క్రియాశీల పోరాటం చేపట్టకుండా అంటిమ ంట్టనట్టు వ్యవహరించడాన్ని ఖండిస్తూ కార్మికుల గత పోరాటాల స్ఫూర్తితో హక్కుల సాధనకోసం ఆదాయ పన్ను రద్దు, సొంత ఇంటి కల కొరకు, మైనింగ్ టెక్నికల్ స్టాఫ్, ట్రాక్ మెన్ ల వేతన నష్టం, క్యాటగిరి నష్టానికి గురికాకుండా అనారోగ్యంతో అండర్ గ్రౌండ్ అన్ ఫిట్ అయితే సర్ఫేస్ లో సూటబుల్ జాబ్స్, మెరుగైన ప్రమోషన్ పాలసీ, మెరుగైన విద్య, వైద్య సౌకర్యాల కోసం యాక్షన్ లోకి వెల్లకుండా కొత్త బొగ్గు గనుల సాధన ద్వారా సంస్థ పరిరక్షణ, మెడికల్ బోర్డ్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికున్ని అన్ ఫిట్ చేసి వారసులకు ఉద్యోగ అవకాశం, జూలై 30, 31 తేదీలలో జరిగిన రెఫరల్ కు చెందిన రీమెడికల్ కు వచ్చిన ప్రతి ఒక్కరిని అన్ ఫిట్ చేసి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులకు "హై పవర్ కమిటీ" వేతనాలు తక్షణ అమలుతో పాటు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్ ల సాధన కోసం సింగరేణి కార్మిక వర్గం, కాంట్రాక్ట్ కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370